www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
మంగళవారం 24 డిసెంబర్ 2024
సంపుటి :06 సంచిక : 206 , పేజీలు : 12 వెల:రూ.5/-
TELANGANA, ANDHRA PRADESH



## పివికి సిఎం రేవంత్ రెడ్డి నివాళి

**హైదరాబాద్,డిసెంబర్23( వెలుతురు):** భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 20వ వర్ధంతి సందర్భంగా ఆయనకు పలువురు నేతలు ఘనంగా నివాళి అర్పించారు. సిఎం రేవంత్ తన నివాసంలో పివి చిత్రపటం వద్ద ఘనంగా నివాళి అర్పించారు. పివి ప్రధానిగా చేసిన సేవలను స్మరించుకున్నారు. దార్శనిక నేత పివి అని కొనియాడారు. తెలుగు ముద్దుబిడ్డ ప్రధానిగా దేశానికి దిశా నిర్దేశం చేశాడని కీర్తించారు.

## పివికి ప్రముఖుల నివాళి

- తెలుగు వాడైనందుకు గర్వకారణమని వెల్లడి



**హైదరాబాద్,డిసెంబర్23( వెలుతురు):** భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 20వ వర్ధంతి సందర్భంగా ఆయనకు పలువురు నేతలు ఘనంగా నివాళి అర్పించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఎస్ వేణుగోపాలాచారి, పివి కుటుంబ సభ్యులు వాణి తదితరులు పివి ఘాట్ 2 లో..

## పీవీ నరసింహారావు తెలంగాణలో పుట్టడం మనకు గర్వకారణం

### - కేటీఆర్



**హైదరాబాద్,డిసెంబర్ 22 ( వెలుతురు):** ఆర్థికవేత్త, రాజనీతిజ్ఞుడు, బహుభాషా కోవిదుడు భారతరత్న, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వర్ధంతి 2 లో..



## విశ్వశాంతి మహాయాగ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయల్ శంకర్ దంపతులు

**ఆదిలాబాద్ వెలుతురు డిసెంబర్ 23:** ఆదిలాబాద్ లోని డైట్ మైదానంలో అత్యంత వైభవోపేతంగా జరుపుతున్న ఆయుత చండీ యాగం భక్తి శ్రద్ధల నడుమ కొనసాగుతోంది. రెండవ రోజైన సోమవారం ఉదయం నుండే పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి జి నేతృత్వంలో యాగక్రతువును చేపట్టారు. విశ్వశాంతి మహాయాగ మహోత్సవంలో భాగంగా ఉదయం శ్రీ లక్ష్మి గణపతి శ్రీ రుద్ర మృత్యుంజయ సహిత అమృత పాశు పశాస్త్ర హోమములను చేపట్టగా.. ఎమ్మెల్యే పాయల్ శంకర్ సతీసమేతంగా పాల్గొన్నారు




## బ్యాంకర్లు సకాలంలో రుణాలు మంజూరు చేయాలి

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి
- రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో పాల్గొన్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల, ప్రధాన బ్యాంకర్ల అధికారులు

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 23:** సోమ వారం ప్రజాభవన్ లో రాష్ట్ర స్థాయి బ్యాంకర్స్ కమిటీ సమావేశం జరిగింది, ఇందులో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తో పాటుగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పాల్గొన్నారు, ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పెద్ద ఎత్తున వ్యవసాయానికి, సంక్షేమరంగాలకు డబ్బును ప్రజల్లోకి వదులుతుంద న్నారు, అలాగే అందుకు అనుగుణంగా మ్యాచింగ్ గ్రాంట్లు, సబ్సిడీ పథకాలు మంజూరు చేసి రాష్ట్ర ప్రజలకు సహకరించాలని ఈ సందర్భంగా బ్యాంకర్ల ను 2 లో..

## ఏడాదిన్నరలో పదిలక్షల
# ఉద్యోగాలు

- దేశ చరిత్రలో ఇదో అతిపెద్ద రికార్డు
- దేశాభివృద్ధిలో యువతే కీలక పాత్ర
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నియామకపత్రాలు
- యువతను అభినందించిన ప్రధాని మోడీ




**న్యూఢిల్లీ,డిసెంబర్23( వెలుతురు):** తమ పాలనలో యువతకు పెద్ద మొత్తంలో ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. గత ఒకటిన్నర ఏళ్లలో 10 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చామన్నారు. దేశ చరిత్రలో ఇది పెద్ద రికార్డ్ అని పేర్కొన్నారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో నిజాయతీ, పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. నేడు జరుగుతున్న రోజ్‌గార్ మేళాలోనూ 71,000 మందికి పైగా యువతకు అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చామని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా కొత్తగా నియామకమైన 71,000 మందికి పైగా యువతకు అపాయింట్‌మెంట్ లెటర్‌లను పంపిణీ 2 లో..

## నేడు మంత్రి శ్రీనివాస రెడ్డి
# సమీక్ష సమావేశం

- డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పై అధికారులతో సమీక్ష
- హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్ష సమావేశం

( రాపర్తి భాస్కర్ గౌడ్)



**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 23:** రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు హిమాయత్ నగర్ హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో సమావేశం ను నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో మంత్రి అధికారులతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పూర్తి- కేటాయింపు, ఇందిరమ్మ ఇండ్లపై సర్వే, గ్రౌండింగ్ తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామని మంత్రి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు,

## సహనాన్ని కోల్పోయా..
# క్షమించండి

- జాతీయ మీడియాకు సిపి సివి ఆనంద్ క్షమాపణలు
- ఎక్స్ వేదికగా వెల్లడించిన కమిషనర్



**హైదరాబాద్,డిసెంబర్23( వెలుతురు):** హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ క్షమాపణలు చెప్పారు. జాతీయ మీడియాను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు పోస్ట్ పెట్టారు. సంధ్య థియేటర్ ఘటనపై జాతీయ మీడియా ప్రశ్నలు అడిగినప్పుడు తాను సహనాన్ని కోల్పోయినట్లు తెలిపారు. సంధ్య థియేటర్ వద్ద అసలేం జరిగిందో తెలుపుతూ నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ 2 లో..

## పారదర్శకంగా ఉద్యోగనియామకాలు

- రోజ్‌గార్ మేళాలో నియామకపత్రాలు
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్ వెలుతురు 23 డిసెంబర్ 2024:** గత ఏడాదిన్నర కాలంలో దాదాపు 10 లక్షల మంది యువతకు మోదీ ప్రభుత్వం శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించింది. ఎలాంటి రాజకీయ జోక్యమూ లేకుండా అభ్యర్థుల అర్హతలు, ప్రతిభ ఆధారంగా కేంద్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన నియామక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తోందని కేంద్ర మంత్రి శ్రీ కిషన్ రెడ్డి తెలిపారు. సోమవారం జరిగిన 14వ విడత రోజ్‌గార్ మేళాలో భాగంగా కొత్తగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు శ్రీ కిషన్ రెడ్డి నియామక పత్రాలు అందించారు.

చాంద్రాయణగుట్టలోని సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్)లో జరిగిన రోజ్ గార్ మేళా కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీ కిషన్ రెడ్డి ప్రసంగించారు. స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా వంటి పథకాల ద్వారా.. వ్యవస్థాపక నైపుణ్యాలతో యువతను సన్నద్ధం చేస్తూ ప్రైవేటు రంగంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగాలను కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయాత్మక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఉద్యోగార్థులుగా ఉన్న వారిని ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలనీ, తద్వారా 2 లో..

## కాంగ్రెస్ హయాంలోనే సినీ పరిశ్రమ అభివృద్ధి

- అందరూ బాగుండాలన్నదే మా విధానం
- థియేటర్ ఘటనలో వివరాలు వెల్లడించిన సిఎం
- ఎవరో రాసిన స్క్రిప్టు చదివిన అల్లు అర్జున్
- సినీ పరిశ్రమపై కాంగ్రెస్‌కు వ్యతిరేకత ఉండదు
- ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

2 లో..



**హైదరాబాద్,డిసెంబర్23( వెలుతురు):** సినీ పరిశ్రమ అభివృద్ధి కాంగ్రెస్ హయాంలోనే జరిగిందని ఆ పార్టీ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. అందరూ బాగుండాలనే కాంగ్రెస్ కోరుకుంటుందన్నారు. సంధ్య

## బీసీలకు తిరిగి 34 శాతం రిజర్వేషన్లకు నిర్ణయం

- బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టంపై మంత్రుల కమిటీ
- బీసీ హాస్టళ్లలో వసతుల కల్పన, బాలికల హాస్టళ్లలో తక్షణ మరమ్మత్తులు
- 104 బీసీ హాస్టళ్లలో ఎస్.ఆర్.శంకరన్ నాలెడ్జ్ కేంద్రాలు
- బీసీ సంక్షేమ శాఖపై సమీక్షలో సీఎం నారా చంద్రబాబు నాయుడు

9 లో..



**అమరావతి,డిసెంబర్23( వెలుతురు):** స్థానిక సంస్థల్లో బీసీలకు తిరిగి 34 శాతం రిజర్వేషన్ల సాధనకు న్యాయ పరమైన పోరాటం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టంపై మంత్రుల కమిటీ సూచనలపై సమీక్షలో చర్చించారు. నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయం తీసుకున్నారు. బీసీ సంక్షేమ హాస్టళ్లలో వసతుల కల్పన, బాలికల హాస్టళ్లకు తక్షణ మరమ్మతులు చేపట్టాలని చంద్రబాబు ఆదేశించారు. పింఛన్లు తొలగించడం లేదని.. ఇందుకు సంబంధించిన తనిఖీలు జరుగుతున్నాయని సీఎం స్పష్టం చేశారు. స్కిల్ ఎడ్యుకేషన్ కోసం 104 బీసీ హాస్టళ్లలో ఎస్ఆర్. శంకరన్ నాలెడ్జ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా సీఎం ఆదేశించారు. సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖపై సీఎం సమీక్షించారు. అందరికీ ఇచ్చేలా పథకాలు ఇస్తూనే.....వెనుకబడిన వర్గాలకు ప్రత్యేకంగా



## సందేశాత్మక చిత్రాలకు చోటేది

- జైభీమ్ లాంటి సినిమాలకు అవార్డులేవీ
- స్మగ్లర్ లాంటి పుష్ప సినిమాకలు అవార్డులా
- మంత్రి సీతక్క ఆవేదన

2 లో..

**ములుగు,డిసెంబర్23( వెలుతురు):** అల్లు అర్జున్ హీరోగా నటించిన పుష్ప సినిమా వివాదంపై తెలంగాణ మంత్రి

## రోడ్డు నాణ్యతను పరిశీలించిన పవన్

- 44 గ్రామాల మంచినీటి పనులకు మరమ్మత్తులు
- కృష్ణా జిల్లాలో పలు పనులకు శంకుస్థాపన

**విజయవాడ,డిసెంబర్23( వెలుతురు):** కంకిపాడు మండలంలోని గొడవర్రు గ్రామంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సోమవారం పర్యటించారు. రూ. 3.5 కోట్ల వ్యయంతో శరవేగంగా జరుగుతున్న గొడవర్రు -రొయ్యూరు రోడ్డు పనులను పవన్ పరిశీలించారు. ఇటీవల కంకిపాడులో జరిగిన బహిరంగ సభలో స్థానిక ఎమ్మెల్యే బోడే ప్రసాద్ విజ్ఞప్తి మేరకు అధ్వాన్నంగా ఉన్న రొయ్యూరు రోడ్డును వెంటనే అభివృద్ధి చేయాలంటూ పవన్ ఆదేశాలు జారీ చేశారు. ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు పనులు తుదిదశకు చేరుకోవడంతో పవన్ పరిశీలించారు. స్థానికులు, వాహనదారులు హర్షం

2 లో..



## పివికి ప్రముఖుల నివాళి

(మొదటి పేజీ తరువాయి..)
వద్ద పుష్పాంజలి అర్పించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ పివి తెలుగు వాడైనందుకు గర్వకారణమని అన్నారు. ఆయన సంస్కరణలు దేశానికి మార్గం చూపాయని అన్నారు. దేశాన్ని క్లిష్ట సమయంలో ఆదుకున్నారని అన్నారు. పివి తెలంగాణ రాష్ట్రంలో పుట్టడం మన అదృష్టమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం పీవీ నరసింహారావు అనేక నిధులు తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఇక, పీవీ భూ సంస్కరణల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదన్నారు. దేశంలో విద్య వ్యవస్థను పటిష్టం చేసేందుకు పీవీ అద్భుతమైన ప్రణాళికలు రూపొందించారన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంతో పోటీ పడే విధంగా పీవీ కృషి చేశారని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ తీసుకున్న అనేక నిర్ణయాలను పీవీ అమలు చేశారని అన్నారు. ప్రస్తుత రాజకీయ నాయకులు పీవీ చూపించిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ దేవానికి దిశాదశ చూపిన నేతని అన్నారు. ఆయన సంస్కరణలు ఎప్పటికీ మరువలేనివన్నారు.

## పీవీ నరసింహారావు తెలంగాణలో పుట్టడం మనకు గర్వకారణం

సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘనంగా నివాళులర్పించారు. ఆర్థిక సంస్కరణలతో భారతదేశ ముఖచిత్రాన్ని మార్చిన మాజీ ప్రధాని పీవీ నరసింహా రావు తెలంగాణలో పుట్టడం మనందరికి గర్వకారణమని చెప్పారు. గడ్డు కాలంలో దేశానికి ప్రధానిగా సేవలందించిన పీవీ.. ఆర్థిక సంక్షోభం నుంచి దేశాన్ని కాపాడారని, తన పాలనతో ఆధునిక భారతానికి బాటలు వేశారని తెలిపారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత.. తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహా రావు గారిని బీఆర్ఎస్ ప్రభుత్వం సముచితంగా గౌరవించిందని వెల్లడించారు. పీవీ నరసింహా రావు శత జయంతి ఉత్సవాలను కేసీఆర్ ప్రభుత్వం ఘనంగా నిర్వహించిందని గుర్తుచేశారు. నెక్లెస్ రోడ్‌కి పీవీ మార్గ్ అని పేరు పెట్టిందని, ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసిందన్నారు. వెటర్నరీ యూనివర్సిటీకి పీవీ పేరు పెట్టిందని చెప్పారు. అంతే కాదు.. పీవీ నరసింహా రావుకి భారతరత్న ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం తరఫున కేంద్ర ప్రభుత్వానికి తీర్మానం పంపించిందని తెలిపారు. వారి కూతురిని ఎమ్మెల్సీగా గౌరవించిందన్నారు. భారతరత్న పీవీ.. తెలంగాణ ఠీవి అని ఎక్స్ వేదిగా ట్వీట్ చేశారు.

## బ్యాంకర్లు సకాలంలో రుణాలు మంజూరు చేయాలి

భట్టి విక్రమార్క కోరారు,వ్యవసాయ రుణాల పంపిణీలో వేగం పెంచి రైతులకు సకాలంలో రుణాలు అందాలని బ్యాంకర్స్ కు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు, ఈ బ్యాంకర్ల రాష్ట్ర స్థాయి కమిటీ సమావేశంలో పలు ప్రధాన శాఖల బ్యాంకు అధికారులతో పాటు వ్యవసాయ శాఖ ముఖ్య అధికారులు తదితరులు పాల్గొన్నారు,

## సహనాన్ని కోల్పోయా.. క్షమించండి

తాజాగా మీడియా సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే. థియేటర్‌లో ఆరోజు ఏం జరిగిందో తెలుపుతూ కొన్ని వీడియోలను విడుదల చేశారు. ఈక్రమంలో మీడియా ఆయన్ను కొన్ని విషయాలపై ప్రశ్నించగా.. నేషనల్ మీడియా ఈ ఘటనకు మద్దతు ఇస్తుందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో అక్కడ ఉన్న కొందరు జర్నలిస్టులు ఈ ఆరోపణలను తప్పుపట్టారు. తాజాగా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు సీవీ ఆనంద్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. 'ఈ ఘటనపై విచారణ జరుగుతోంది. ప్రెస్‌మీట్‌లో రెచ్చగొట్టే ప్రశ్నలు వేయడంతో నేను కాస్త సహనాన్ని కోల్పోయాను. పరిస్థితులు ఎలా ఉన్నా సంయమనం పాటించాల్సి ఉంటుంది. నేను చేసింది పొరబాటుగా భావిస్తున్నాను. నేషనల్ మీడియాపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా. క్షమాపణలు కోరుతున్నా' అని తెలిపారు. మరోవైపు సంధ్య థియేటర్ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, న్యాయపరమైన సలహాలు తీసుకుని ముందుకెళ్తామని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. డిసెంబరు 4న సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనపై మీడియా అడిగిన ప్రశ్నలకు సీపీ సమాధానమిచ్చారు. ఘటనకు సంబంధించిన సీసీ ఫుటేజ్‌ను ఆయన విడుదల చేశారు. ఇక ఈ ఘటనపై తాజాగా సినీ నటి, కాంగ్రెస్ నాయకురాలు మాజీ ఎంపీ విజయశాంతి స్పందించారు. ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమన్నారు. దీనిపై తెలంగాణ సీఎం రేవంత్‌పై కేంద్రమంత్రులు ఆరోపణలు చేయడం గర్హనీయమన్నారు. ఈ ఘటనను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు భాజపా నేతలు యత్నిస్తున్నారన్నారు. సినీ పరిశ్రమకు అన్ని ప్రాంతాల ప్రజల ఆదరణ కావాలని.. ఇలాంటి ఘటనలు జరగకుండా సమస్యను పరిష్కరించుకునేందుకు ప్రయత్నం చేయాలని సూచించారు.

## సందేశాత్మక చిత్రాలకు చోటేది

సీతక్క సోమవారం ములుగులో సంచలన వ్యాఖ్యలు చేశారు. జై బీమ్ లాంటి సందేశాత్మక సినిమాలకు అవార్డులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి చిత్రాలకు ప్రోత్సాహకాలు సైతం లేవన్నారు. కానీ ఒక స్మగ్లర్.. పోలీస్ దుస్తులు విప్పి నిలబెట్టి.. పోలీస్‌స్టేషన్ కొన్న సినిమాలకు మాత్రం కేంద్ర ప్రభుత్వం అవార్డులు ఇవ్వడం దేనికి సంకేతమన్నారు. స్మగ్లర్ హీరో అంటే అదేం సినిమా? అని మంత్రి సీతక్క ప్రశ్నించారు. స్మగ్లర్ హీరో.. స్మగ్లింగ్ కట్టడి చేసే పోలీస్.. విలన్ ఎలా అవుతాడని మంత్రి సీతక్క సందేహం వ్యక్తం చేశారు. అయితే సందేశాత్మక సినిమాలు తీస్తే ప్రజలు స్వాగతిస్తారని ఆమె స్పష్టం చేశారు. రెండు హత్యలు చేసిన నేరస్థుడు మహారాష్ట్రలో పుష్ప 2 సినిమా చూస్తూ దొరికిపోయాడని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇలాంటి సినిమాలు నేర ప్రవృత్తిని పెంచేలా ఉన్నాయని మంత్రి సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. అయినా మానవతా దృక్పథం ఉన్న సినిమాలు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మతాలు, కులాలు ముఖ్యం కాదని.. మనిషికి ఉండవలసింది మానవత్వమని సీతక్క స్పష్టం చేశారు. మానవత్వం ఉన్న సినిమాలకు ప్రోత్సాహం అందించాలని కేంద్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా ఆమె సూచించారు. చంకలో బిడ్డ పెట్టుకుని ఒక పేద మహిళపై హక్కులు కోసం పోరాడిన జై బీమ్ సినిమాకు అవార్డు సైతం రాలేదన్నారు. అయితే సినిమాలను మాత్రం తాము గౌరవిస్తామని చెప్పారు.

## మేడిగడ్డ నిర్మాణంలో అవినీతి వ్యవహారం

- క్వాష్ పిటిషన్లు దాఖలు చేసిన కెసిఆర్, హరీష్ రావు

హైదరాబాద్,డిసెంబర్23( వెలుతురు):
తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు హైకోర్టులో క్వాష్ పిటిషన్లు దాఖలు చేశారు. మేడిగడ్డ నిర్మాణంలో అవినీతి జరిగిందన్న అంశంపై భూపాలపల్లి కోర్టు ఇచ్చిన నోటీసులను కొట్టివేయాలని కోరారు. మేడిగడ్డ నిర్మాణంలో ప్రమాణాలు పాటించలేదని, దీనివల్ల ప్రజాధనం వృథా అయ్యిందని రాజలింగమూర్తి అనే వ్యక్తి భూపాలపల్లి జిల్లా కోర్టులో గతంలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జిల్లా న్యాయస్థానం జులై 10న కేసీఆర్, హరీశ్‌రావు సహా ఆరుగురికి నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులను సవాల్ చేస్తూ హైకోర్టులో కేసీఆర్, హరీశ్‌రావు తాజాగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై మంగళవారం హైకోర్టు విచారణ చేపట్టనుంది.

# ఏడాదిన్నరలో పదిలక్షల ఉద్యోగాలు

(మొదటి పేజీ తరువాయి..)
చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ప్రసంగిస్తూ కొత్తగా నియమితులైన వారిని అభినందించారు. భారతదేశ యువతతో మాట్లాడేందుకు తాను కువైట్ నుంచి రాత్రి భారత్ వచ్చానని పేర్కొన్నారు. ఇక్కడికి వచ్చిన తర్వాత దేశంలోని యువతతో తన మొదటి కార్యక్రమం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన వారి కుటుంబాలకు హృదయపూర్వకంగా అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. భారతదేశ యువత సామర్థ్యాన్ని, ప్రతిభను పూర్తిగా వినియోగించుకోవడమే ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమని ప్రధాని ఉద్ఘాటించారు. దేశాభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషిస్తారని.. వారిలోని సామర్థ్యాలను వినియోగించుకోవడం ద్వారా ప్రభుత్వం మరింత ముందుకువెళ్తుందని అన్నారు. ఇలా ఉద్యోగాలు పొందినవారంతా భక్తితో, నిజాయతీతో దేశం కోసం పని చేస్తున్నారని.. ఇలాగే ముందుకుసాగితే 2047 కల్లా వికసిత భారత్ లక్ష్యాన్ని చేరుకోగలమని ప్రధాని వ్యాఖ్యానించారు. దేశ అభివృద్ధి యువత పైనే ఆధారపడి ఉంటుందని.. అయితే గత ప్రభుత్వాలు వారికి సరైన ఉపాధి కల్పించకపోవడం వల్ల దేశం వెనకబడిపోయిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యువతకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని.. అందుకనుగుణంగా మేక్ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్, డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం భారత్ అన్నిరంగాల్లో ముందుకువెళ్తుందని.. అంతరిక్షం, రక్షణ, మొబైల్ తయారీ, పునరుత్పాదక ఇంధనం, పర్యటక రంగాల్లో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఎదుగుతోందని పేర్కొన్నారు. రోజ్‌గార్ మేళాలో అందించిన నియామక పత్రాల్లో అధిక సంఖ్యలో యువతులు ఉన్నారని మోదీ పేర్కొన్నారు. మహిళలు అన్నిరంగాల్లో స్వయంప్రతిపత్తిని సాధించాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. అన్ని ప్రాంతాల యువతకు అనుకూలంగా ఉండేందుకు 13 భారతీయ భాషల్లో రిక్రూట్‌మెంట్ పరీక్షలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు వెల్లడించారు. రోజ్‌గార్ మేళా ద్వారా ఈ దిశగా నిరంతరం కృషి చేస్తున్నామని ప్రధాని మోదీ ప్రస్తావించారు. గత 10 సంవత్సరాలుగా వివిధ ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, సంస్థల్లో ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలనే ప్రచారం జరుగుతోందన్నారు. నేటికీ 71,000 మందికి పైగా యువతకు అపాయింట్‌మెంట్లు ఇచ్చారు. గత ఏడాదిన్నర కాలంలో మా ప్రభుత్వం దాదాపు 10 లక్షల మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలను శాశ్వతంగా కల్పించిందని మోదీ పేర్కొన్నారు. ఇది స్వతహాగా భారీ రికార్డు అని ప్రధాని అన్నారు. ఈ విధానంలో యువతకు శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించేందుకు గత ప్రభుత్వాల హయాంలో ఇలాంటి చొరవ జరగలేదని, నేడు దేశంలో లక్షలాది మంది యువత ఉద్యోగాలు పొందారని పేర్కొన్నారు. ఏ దేశమైనా అభివృద్ధి చెందాలంటే యువత బలం, నాయకత్వం నుంచే పుడుతుందని ప్రధాని అభిప్రాయం వ్యక్తం చేశారు. పారదర్శకమైన సంప్రదాయం నుంచి వస్తున్న యువత పూర్తి భక్తి, నిజాయితీలతో దేశ సేవలో నిమగ్నమై ఉన్నందుకు సంతోషిస్తున్నట్లు ప్రధాని అన్నారు. 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన భారతదేశంగా తీర్చిదిద్దాలన్నది మా సంకల్పమన్నారు.

ఈ లక్ష్యాన్ని సాధించడంలో పూర్తి విశ్వాసం ఉందన్నారు. గత దశాబ్ద కాలంలో ప్రభుత్వం అనేక విధానాలను తీసుకొచ్చిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. మేక్ ఇన్ ఇండియా, స్వావలంబన భారత్ ప్రచారం, స్టార్టప్ ఇండియా, స్టాండ్ అప్ ఇండియా, డిజిటల్ ఇండియా ఇలా ప్రతి స్కీమ్ యువతను కేంద్రంగా చేసుకుని రూపొందించినట్లు వెల్లడించారు. అంతరిక్ష రంగంలో భారత్ తన విధానాలను మార్చుకుంది. భారతదేశం తన రక్షణ రంగంలో తయారీని ప్రోత్సహించింది. దీనిలో యువత ఎక్కువగా లాభపడింది. నేడు భారతదేశ యువత కొత్త విశ్వాసంతో నిండి ఉంది. ప్రతి రంగంలోనూ యువత విజయపతాకం రెపరెపలాడుతోంది. ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మనం అవతరించామని ప్రధాని గుర్తు చేశారు. భారతదేశం ప్రపంచంలో మూడవ అతిపెద్ద స్టార్టప్ పర్యావరణ వ్యవస్థగా ఉంది. ఈ క్రమంలో ఒక యువకుడు తన సొంత స్టార్టప్‌ను ప్రారంభించాలని నిర్ణయించుకున్నప్పుడు, వారు పూర్తి పర్యావరణ వ్యవస్థను పొందుతారని పేర్కొన్నారు. ఈ క్రమంలో నేడు దేశంలోని వేలాది మంది యువత జీవితాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. ఈ రోజు ఇచ్చిన 71,000 ఉద్యోగాల్లో 29 శాతానికి పైగా ఓబీసీలు, 15.8 శాతం షెడ్యూల్ కులాలు, 9.6శాతం షెడ్యూల్ తెగలు ఉన్నారని అన్నారు. గత ప్రభుత్వాలతో పోలిస్తే ఎన్డీఏ హయాంలో ప్రభుత్వ ఉద్యోగాల్లో వెనకబడిన తరగతుల రిక్రూట్‌మెంట్ 27శాతం పెరిగిందని చెప్పారు.

# పారదర్శకంగా ఉద్యోగనియామకాలు

(మొదటి పేజీ తరువాయి..)
2047 నాటికి 'అభివృద్ధి చెందిన భారత్'ను నిర్మించడం కోసం ప్రధాని మోదీ నిర్దేశించిన దార్శనిక లక్ష్యాల సాధనలో భాగస్వాములు కావాలనీ యువతకు ఆయన పిలుపునిచ్చారు. రక్షణ రంగంలో భారత్ 'ఆత్మనిర్భరత'ను సాధిస్తోందనీ, అంతర్జాతీయ తయారీ నిలయంగా ఎదుగుతోందని కిషన్ రెడ్డి అన్నారు. కొన్నేళ్లుగా ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగా భారత్ దిగుమతిదారు నుంచి ఎగుమతిదారుగా మారిందని తెలిపారు. 2014లో రక్షణ రంగంలో రూ. 900 కోట్ల ఎగుమతులు జరిగాయనీ.. అయితే, ఇప్పుడు మనం దాదాపు రూ. 15,000 కోట్ల ఎగుమతులు చేస్తున్నామనీ పేర్కొన్నారు. దాదాపు 75 దేశాలకు ఎగుమతి అవుతున్న మన రక్షణ ఉత్పత్తుల వల్ల ఉపాధి కూడా గణనీయంగా పెరిగిందని ఆయన అన్నారు.

డిజిటల్ ఇండియాకు పెద్ద ఎత్తున ప్రోత్సాహాన్ని ఇవ్వడం, డిజిటల్ లావాదేవీల్లో సంస్కరణలను తీసుకురావడం, ఉత్పత్తితో ముడిపెట్టిన ప్రోత్సాహకాలను ఇచ్చే పథకం (పీఎల్ఐ).. వంటివి ప్రధాన మార్పులను తీసుకువచ్చి, ఉపాధి కల్పనకు ఊతాన్నిచ్చాయని ఆయన అన్నారు.

దేశంలో 2014లో మొబైల్ తయారీ కంపెనీలు రెండే ఉండగా, ప్రస్తుతం మొబైల్ ఫోన్లలో 99 శాతం మన దేశంలో తయారవుతున్నాయని ఆయన తెలిపారు. "చైనా తరువాత ప్రపంచంలో అతి తక్కువ ధరలకు 4జీ ఇంటర్‌నెట్



సర్వీసులను అందిస్తున్న దేశం భారతదేశమే. 5జీ టెక్నాలజీ సామాన్యులకు కూడా అందుబాటులోకి వచ్చి, యువతీ యువకులకు అనేక అవకాశాలను అందిస్తోంది. ప్రస్తుతం మనం దాదాపుగా 150 దేశాలకు సెల్ ఫోన్‌లను ఎగుమతి స్థాయికి చేరుకొన్నాం, ఈ దేశాల్లో అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్, జర్మనీలు కూడా ఉన్నాయ"ని ఆయన వివరించారు.

ఈ సందర్భంగా తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 546 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఈ అభ్యర్థులు.. సీఆర్‌పీఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ, రైల్వేలు, తపాలా విభాగం, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ– హైదరాబాద్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, ఎస్‌బీఐ, కెనరా బ్యాంకులలో వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇదే కార్యక్రమంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా పాల్గొని, రోజ్‌గార్ మేళాను ఉద్దేశించి ప్రసంగించారు. దేశవ్యాప్తంగా 45 చోట్ల ఏకకాలంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విభాగాలు, సంస్థల్లో కొత్తగా ఉద్యోగ నియామకాలు పొందిన యువతీయువకులకు 71,000కు పైగా నియామక పత్రాలను ప్రధాని పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో – శ్రీ ఉదయ్ భాస్కర్ బిల్లా, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, జీ.సీ. (గ్రూప్ సెంటర్) సీఆర్‌పీఎఫ్, హైదరాబాద్‌బీ శ్రీ ఎమ్.హెచ్. ఖోబ్రగడే, కమాండెంట్, జీ.సీ., సీఆర్‌పీఎఫ్‌బీ శ్రీ ధృవ్ నారాయణ్, డిప్యూటీ కమాండెంట్, జీ.సీ., సీఆర్‌పీఎఫ్‌బీ ఇన్‌స్పెక్టర్, జి.కె. గుప్త, గ్రూప్ సెంటర్, హైదరాబాద్‌లు కూడా పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హయాంలోనే సినీ పరిశ్రమ అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి..)
థియేటర్ వద్ద జరిగిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాస్తవాలలను ప్రజలకు వివరించే ప్రయత్నం చేశారని చెప్పారు. ఈ మేరకు గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. 'సినీ పరిశ్రమపై అవగాహన లేని వ్యక్తికి ఛైర్మన్ పదవి ఇస్తే సమస్యలు పరిష్కారం కావేమోనని ఆలోచించి.. పరిశ్రమకు చెందిన ఒక కీలకమైన వ్యక్తికి ఇచ్చాం. దిల్ రాజు అనే వ్యక్తి ఇవాళ ఒక బ్రాండ్ మార్క్ లాంటివారు. ఇండస్ట్రీలో పనిచేసే కార్మికులు ఎంతో మంది ఉన్నారు. అంజయ్య ప్రభుత్వ హయాంలో సినీ ఇండస్ట్రీని హైదరాబాద్ తీసుకొచ్చే క్రమంలో ఫిల్మ్ నగర్‌లో స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. పద్మాలయ, రామానాయుడు స్టూడియోస్‌కు కూడా ప్రభుత్వం తరఫున స్థలాన్ని కేటాయించాం. ప్రొడ్యూసర్ నుంచి మొదలు పెడితే కింది స్థాయి కార్మికుడి వరకు బాగుండాలని కోరుకునే పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. నటుడు అల్లు అర్జున్‌పై కేసు ఎందుకు పెట్టాల్సి వచ్చిందనే విషయాన్ని పోలీసులు స్పష్టంగా చెప్పారు. ఇది కేవలం బాధ్యత లేకుండా వ్యవహరించడం వల్లే జరిగిందని క్లారిటీగా విజువల్స్‌తో పోలీసులు వివరించారు. జైలు నుంచి బయటికొచ్చాక అల్లు అర్జున్ చట్టానికి కట్టుబడి ఉంటానని బాధ్యతాయుతమైన పౌరుడిగా మాట్లాడారు. ఈ ఘటనలో ఎవరినీ బాధ్యులను చేయడం లేదని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడుతూ.. ఎంఐఎం పార్టీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు వివరణ ఇచ్చారు. వాస్తవాలను ప్రజలకు చెప్పే ప్రయత్నం చేశారు. థియేటర్ యాజమాన్యం అనుమతి కోసం దరఖాస్తు చేయడం వాస్తవం.. కానీ అనుమతి ఇచ్చారని చెప్పడం అవాస్తవం అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడిన రోజే.. అల్లు అర్జున్ మీడియాతో మాట్లాడారు. ఒక కుటుంబంలో మహిళ చనిపోయింది.. మరో బాలుడు చికిత్స తీసుకుంటున్నాడు. ఇలాంటి ఘటనలు జరిగితే భవిష్యత్తులో బెనిఫిట్ షోలు ఇతరత్రా రాయితీలకు సంబంధించిన అనుమతులు ఇవ్వబోమని సీఎం తేల్చి చెప్పారు. సామాన్యులకు ఇబ్బంది కలిగే పరిస్థితి వచ్చినప్పుడు ఇలాంటి కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని సీఎం చెప్పారని ఎంపి అన్నారు. అల్లు అర్జున్ కూడా మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి సినీపరిశ్రమను ఉద్దేశించి మాట్లాడిన విషయాలపై వివరణ ఇస్తూ సినీ పరిశ్రమకు వివరణ ఇవ్వాల్సింది. అలా కాకుండా.. తొక్కిసలాటలో ఒక మహిళ చనిపోయింది.. బాలుడు చికిత్స తీసుకుంటున్నాడు.. అనే విషయాలు మరుసటి రోజు వరకు తెలియదని మీడియా ముందు చెప్పారు. తనపై ఆరోపణలు చేస్తున్నారు అని అన్నారు. ఏమాత్రం అవగాహన లేకుండా ఎవరో స్క్రిప్ట్ ఇస్తే చదివారని మండిపడ్డారు. అయితే, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చూసుకుంటామని అల్లు అర్జున్ చెప్పి ఉంటే రీల్ స్టార్ నుంచి రియల్ స్టార్ అయ్యే వారని చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. హీరో అల్లు అర్జున్‌తోపాటు టాలీవుడ్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కోపం లేదన్నారు. అయినా అల్లు అర్జున్, సినిమా ఇండస్ట్రీతో తమకు వైరం ఏముంటుందని ఆయన ప్రశ్నించారు. బాధ్యత లేకుండా వ్యవహరించడం వల్లే ఇలా జరిగిందని ఆయన అభిప్రాయపడ్డారు. సినిమా హాల్‌కు హీరో, హీరోయిన్ రావడానికి పోలీసులు పర్మిషన్ ఇవ్వలేదన్నారు. సామాన్యులకు ఇబ్బంది ఎదురవుతోందనే స్పెషల్ షోలు ఇవ్వకూడదని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. హ్యూమిలేట్ చేస్తున్నారంటూ అల్లు అర్జున్ చెప్పడం తప్పు అని పేర్కొన్నారు. అల్లు అర్జున్ నివాసంపై ఎవరో దాడి చేశారని.. కానీ ఆ పని కాంగ్రెస్ పార్టీ నేతలు చేశారనే ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దాడి చేసిన వ్యక్తులు బీఆర్ఎస్ కండువాతో కేటీఆర్ తో ఫోటోలు దిగారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రధానమంత్రి రిలీఫ్ ఫండ్ నుంచి ఒక్క రూపాయి అయినా చనిపోయిన కుటుంబానికి ఇప్పించారా? అంటూ తెలుగు రాష్ట్రాలకు చెందిన బీజేపీ ఎంపీలు బండి సంజయ్, పురందేశ్వరిలను ఈ సందర్భంగా ఆయన సూటిగా ప్రశ్నించారు. తొక్కిసలాట ఘటనలో మహిళా చనిపోతే నాయకురాలైన పురంధేశ్వరి కనీసం బాధితురాలి కోసం స్పందించ లేదన్నారు. తాము ఎవరిపై కక్ష సాధింపు చర్యలకు దిగమని ఎంపీ స్పష్టం చేశారు. అయితే ఇమేజ్ పెంచుకోవడానికే కొందరు అల్లు అర్జున్ అంశంపై మాట్లాడుతున్నారంటూ ఆయన కుండబద్దలు కొట్టారు. బీజేపీ హయాంలో అనేక చోట్ల తొక్కిసలాటలు జరిగాయని ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గుర్తు చేశారు.

## రోడ్డు నాణ్యతను పరిశీలించిన పవన్

(మొదటి పేజీ తరువాయి..)
వ్యక్తం చేశారు. ఇకపోతే జిల్లాలో పలు ప్రాంతాల్లో పర్యటించారు. గుడివాడ నియోజకవర్గం పరిధిలోని మల్లాయపాలెం గ్రామంలో పర్యటించారు. గ్రామీణ రక్షిత మంచినీటి పథకం ద్వారా సరఫరా చేస్తున్న నీటిని పరిశీలించారు. గ్రామీణ రక్షిత మంచినీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో గుడివాడ నియోజకవర్గం పరిధిలోని 44 గ్రామాల్లో రక్షిత మంచినీటి సరఫరా వ్యవస్థకు మరమ్మత్తులు చేపట్టారు. గ్రామీణ ప్రాంతంలో నీటి సరఫరా సరిగా లేదన్న విషయం పల్లె పండుగ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ దృష్టికి గుడివాడ శాసనసభ్యుడు వెనిగండ్ల రాము తీసుకురాగా... రూ. 3.8



కోట్ల నిధులు కేటాయంచి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. ఫిల్టర్ బెడ్లు పూర్తిగా దెబ్బ తినడంతో పంచాయతీకి రూ. 4 లక్షల ఖర్చు చేసి ఫిల్టర్ బెడ్లు మార్పు చేశారు. 14 గ్రామాల పరిధిలో ఫిల్టర్ బెడ్ల మార్పు ప్రక్రియ పూర్తి అయిన క్రమంలో సోమవారం శ్రీ పవన్ కళ్యాణ్ గారు మల్లాయపాలెం రక్షిత మంచి నీటి సరఫరా కేంద్రం వద్ద క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. స్టోరేజీ ట్యాంక్, ఫిల్టర్ బెడ్లతోపాటు– 14 గ్రామాల్లో మరమ్మతులకు ముందు, తర్వాత నీటి నమూనాలను పరిశీలించారు. క్షేత్ర స్థాయి పరిశీలన నిమిత్తం గుడివాడ నియోజకవర్గానికి వచ్చిన పవన్ కళ్యాణ్ కి స్థానిక శాసనసభ్యులు వెనిగెండ్ల రాము ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర గారు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ , రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వర రావు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణ తేజ , జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ , జిల్లా అధికారులు పాల్గొన్నారు.గుడివాడలో జనసేన, బీజేపీ నేతలు ఘన స్వాగతం పలికారు.

## జిల్లల్లగడ్డ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ పాఠశాలను తనిఖీ చేసిన మంత్రి ప్రభాకర్



( రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 23:**
కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ నియోజక వర్గంలోని జిల్లల్లగడ్డలో ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సోమవారం నాడు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు, అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో డైట్ చార్జీలు పెంచిన తరువాత విద్యార్థులకు అందిస్తున్న మెనూ పాటించాలని,విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని అధికారులకు సూచించారు,హాస్టల్ పరిసర ప్రాంతాలలో బుష్ క్లియరెన్స్ చేయాలని అధికారులను మంత్రి ప్రభాకర్ ఆదేశించారు.హాస్టల్ లో ఉన్న వాటర్ ప్లాంట్ ఈ సందర్భంగాపరిశీలించారు.ఎప్పటికప్పుడు ట్యాంక్ లు శుద్ధి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.పాఠశాల గ్రౌండ్ లో ఉపయోగపడే మొక్కలు నాటాలని మునగ , జామ , మామిడి కూరగాయలు తదితర మొక్కలు నాటాలని ప్రిన్సిపల్ కు ఆదేశించారు.

## అసెంబ్లీ హాల్లో పీవీ వర్ధంతి

- కార్యక్రమంలో పాల్గొన్న స్పీకర్లు



( రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 23:**
మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా అసెంబ్లీ హాల్లో సోమవారం వారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించిన పలువురు ప్రముఖులు , ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ,శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ,మంత్రి శ్రీధర్ బాబు ,శాసన మండలి వైస్ ఛైర్మన్ బండ ప్రకాష్.ఎమ్మెల్సీ లు ప్రొఫెసర్ కోదండరాం , కల్వకుంట్ల కవిత, విద్యాదేవి లు,ఎంఎల్ఏ లు అది శ్రీనివాస్ , అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు మరియు ఇతర ఎంఎల్ఏ, ఎంఎల్సీలు తదితరులు పాల్గొన్నారు.

## షేక్ పేట్ ప్రభుత్వ పాఠశాలకు బెంచీలను పంపిణీ చేసిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి





**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 23:**
సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం, షేక్ పేట్ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలలో భాగంగా సోమవారం నాడు స్కూల్ కు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బెంచీలను ,టాయిలెట్ క్లీనింగ్ మిషన్లు పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఉపధ్యాయులు ,విద్యాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఇవి పాఠశాలను స్వచ్ఛంగా ఉంచడానికి ఉపయోగపడడమే కాకుండా విద్యార్థుల ఆరోగ్యాన్ని మెరుగు పరచి వారి విద్యాభివృద్ధికి దోహదం చేస్తాయని కిషన్ రెడ్డి తెలిపారు, అలాగే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి అందరం కృషి చేయాలని కోరారు. అలాగే విద్యార్థులు కూడా మంచిగా చదువుకోవాలని మంత్రి కిషన్ రెడ్డి సూచించారు , అలాగే విద్యార్థులు తమ పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కిషన్ రెడ్డి కోరారు.

## డ్రీమ్స్ స్కూల్ లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు..



**వెలుతురు, సిటీ కల్చరల్:**
అంబర్ పేటలోని డ్రీమ్స్ కిడ్స్ అప్ప ర్ ప్రైమరీ స్కూల్ లో సోమవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనం గా జరిగాయి. చిన్నారులు.. ఏసుక్రీ స్తు జననం నాటిక, నృత్య ప్రదర్శన లు,శాంతక్లాజ్ వేషాలతో ఆట పా టలతో అందరిని విశేషంగా ఆకర్షిం చాయి. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఉపాధ్యా యునీలు క్రిస్మస్ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కా ర్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## టిమ్స్ హాస్పిటల్ నిర్మాణాలను పరిశీలించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 23:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎల్బీ నగర్ నియోజకవర్గం కొత్తపేట పండ్ల మార్కెట్ లో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న టీమ్స్ ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణాన్ని సోమవారం నాడు రాష్ట్ర రోడ్డు భవనాలు మరియు సినిమా అటోగ్రపి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పరిశీలించారు, అనంతరం హాస్పిటల్ కు సంబంధిత అధికారులు.. నిర్మాణం చేపడుతున్న ఎల్ అండ్ టి సంస్థ అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించి పనుల పురోగతిపై మీడియా ప్రతినిధులతో మాట్లాడారు,ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి ,గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి ,కాంగ్రెస్ పార్టీ నాయకులు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్.కొత్తకురుమ శివకుమార్.ఎస్వీ కృష్ణ ప్రసాద్.మార్కెట్ కమిటి డైరెక్టర్లు పన్యాల జైపాల్ రెడ్డి...గణేష్ నాయక్.యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి.నియోజికవర్గ అధ్యక్షులు శివకుమార్ తోపాటు స్థానిక కాంగ్రెస్ సీనియర్ నేతలు తదితరులు పాల్గొన్నారు.








## తెలంగాణ మణికిరీటం సింగరేణి

- సీఎం రేవంత్ రెడ్డి

- సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్మికులకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం
- సింగరేణి అభివృద్ధి కి కృషి చేసిన అధికారులకు అభినందనలు

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 23:**
తెలంగాణ మణి కిరీటం సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం నాడు సింగరేణి కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు, అధికారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటూ 135 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిసిన సింగరేణి, ప్రగతి పథాన సాగుతూ దేశానికి వెలుగులు నింపుతుండటం రాష్ట్రానికి గర్వకారణమని రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సింగరేణి సుస్థిర భవిష్యత్తు కోసం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కార్మిక కుటుంబాల సంక్షేమం సమున్నతికి పాటుపడుతూ, సింగరేణి మరో శత వసంతాలు ఉజ్వలంగా దేశంలోనే అగ్రగామి సంస్థగా నిలవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.



# సంపాదకీయం..

## ప్రమాదంలో వివాహా వ్యవస్థ !

మానవ సంబంధాలు, కటుంబ, వివాహ వ్యవస్థలపై దేశ సర్వోన్నత న్యాయస్థానం తరచూ తమ తీర్పులలో కీలక వ్యాఖ్యలు చేస్తుంటుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ జంటకు విడాకులు ఇచ్చే సమయంలో పెళ్లి బంధం గురించి సుప్రీంకోర్టు చాలా ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. భార్యాభర్తల మధ్య వివాహ బంధం అనేది ఒకరిపై ఒకరికి పరస్పరం ఉండే విశ్వాసంపై ఆధారపడి ఉంటుందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఆ జంట మధ్య నమ్మకం, సహచర్యం, వారిద్దరి మధ్య అనుభవాల పునాదులపై నిర్మితమై ఉంటుందని తెలిపింది. తన భర్త నుంచి తనకు విడాకులు మంజూరు చేస్తూ మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ ఇచ్చిన విడాకుల తీర్పును ఆ భార్య సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేసింది. ఆ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. అంటే కలిసి ఉండాలని ఇద్దరిలో ఏ ఒక్కరికీ లేకపోయినా ఆ బంధం నిలబడదని సుప్రీంకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. ఇక, విడాకుల తర్వాత భర్త నుంచి భార్య పొందే భరణానికి సంబంధించిన నిబంధనలు భార్య సంక్షేమానికి ఉద్దేశించినవే తప్ప భర్తను భయపెట్టేందుకో, శిక్షించేందుకో లేక దోపిడీ చేసేందుకో ఉద్దేశించినవి కావంటూ సుప్రీం కోర్టు మరొక కేసులో చేసిన వ్యాఖ్యలు ఎన్నదగినవి. భార్యా బాధితులకు ఊరటనిచ్చేవి కూడా. తన భర్త సంపదకు తగినట్లుగా తనకు భరణం ఇప్పించాలంటూ కేసు వేసిన ఓ గృహిణిని సర్వోన్నత న్యాయస్థానం మందలిస్తూ, ఒకవేళ విడాకులు తీసుకున్నాక భర్త ఆర్థిక పరిస్థితి దిగజారితే బాధ్యత తీసుకుంటారా? అని ప్రశ్నించడం సహేతుకమే. భర్త, అత్తింటివారినుంచి డబ్బు వసూలు చేయాలన్న లక్ష్యంతోనే ఇలాంటి తీవ్రమైన ఆరోపణలతో కేసులు పెడుతున్నారని కూడా ఈ సందర్భంగా సుప్రీం కోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించడం గమనార్హం. మనోవర్తి అనేది రాజ్యాంగపరంగా సంక్రమించిన హక్కే కాదు, మానవ హక్కుల్లో అది ఒక భాగమని గతంలోనూ సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రత్యేక వివాహ చట్టం, హిందూ వివాహ చట్టం, నేర న్యాయస్మృతి వంటివి మనోవర్తికి సంబంధించిన అంశాలను వివరిస్తున్నాయి. ఈ చట్టాలలోని లొసుగులను ఆధారం చేసుకుని భర్తనుంచి ఎక్కువ డబ్బు గుంజాలనుకునే మహిళలకు తాజా తీర్పు చెంపపెట్టులాంటిదే. గృహహింస నిరోధక చట్టమూ ఇలాంటి ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. తమను రాచిరంపాన పెట్టే భర్తలనుంచి, అత్తమామలనుంచి గృహిణులకు రక్షణ కల్పించే ఉద్దేశంతో 2005లో అమలులోకి వచ్చిన ఈ చట్టం కొందరు మహిళలకు పెట్టనికోటలా మారింది. అత్తమామల్ని, భర్తనూ వేధించేందుకు ఈ చట్టం కొందరికి ఆయుధంగా మారుతోందని పలు సందర్భాల్లో న్యాయస్థానాలు ఆందోళన వ్యక్తం చేశాయి. వివాహిత స్త్రీలకు గృహహింస నుంచి రక్షణ కల్పించేందుకు ఉద్దేశించిన సెక్షన్ 498ఎ దుర్వినియోగమవుతోందంటూ గతంలో కలకత్తా హైకోర్టు వ్యాఖ్యానించింది. భర్తతో విభేదించిన మహిళలు అతని తరపు బంధువులందరినీ నిందితులుగా చూపుతున్నారంటూ బాంబే హైకోర్టు ఒక సందర్భంలో అసహనం వ్యక్తం చేసింది. మరో కేసులో అలహాబాద్ హైకోర్టు తీర్పు చెబుతూ పెళ్లికి సంబంధించిన ప్రతి కేసునూ వరకట్న వేధింపుల ఆరోపణలతో పెద్దదిగా చూపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ పేర్కొంది. అంతెందుకు, బెంగళూరుకు చెందిన ఓ టెకీ ఆత్మహత్య ఇటీవల దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. చనిపోయేముందు 80 నిమిషాల సేపు ఆయన చిత్రీకరించిన వీడియోలోనూ, 40 పేజీల సుదీర్ఘ లేఖలోనూ తన భార్య పెడుతున్న చిత్రహింసల గురించి వివరించిన తీరు మానవతావాదుల హృదయాలను ద్రవీభవింపజేసిందంటే అతిశయోక్తి కాదు. ఈ కేసు విషయంలో సుప్రీం కోర్టు వరకట్నం వేధింపుల చట్టాలు దుర్వినియోగం అవుతు న్నాయనీ, ఇలాంటి కేసుల విచారణలో జాగ్రత్తగా వ్యవహరించాలని న్యాయస్థానాలకు హెచ్చరికలు జారీ చేసింది. ఇదే సందర్భంలో విడాకుల తర్వాత భార్యకు ఎంత భరణం ఇవ్వాలో లెక్కించేందుకు ఎనిమిది అంశాలతో మార్గదర్శక సూత్రాలను కూడా జారీ చేసింది. ఒకప్పుడు ఉద్యోగం పురుష లక్షణం అనేవారు. ఇప్పుడు ఆ నానుడికి కాలం చెల్లింది. గతంలో వంటింటి కుందేళ్లుగా ఉన్న మహిళలు ఇప్పుడు పురుషులతో సమానంగా విద్య, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకుంటు న్నారు. పురుషాధిక్య ప్రపంచపు కోటలను బద్దలు కొట్టి అన్ని రంగాలలోనూ దూసుకుపోతున్నారు. మంచిదే, అయితే, కాపురాన్ని ముందుకు నడిపించేవి దంపతులు మధ్య ప్రేమాభిమానాలు, ఆప్యాయతానురాగాలే తప్ప, ఒకరిపై ఒకరు చూపే ఆధిపత్య ధోరణులు ఎంతమాత్రం కాదు. పవిత్రమైన హిందూ వివాహ వ్యవస్థ ఇటీవల పలుమార్లు కాలపరీక్షకు లోనవుతోంది. వివాహంపైనా, జీవితంపైనా సరైన అవగాహన లేని దంపతులు చిన్నాచితకా వివాదాలను కూడా భూతద్దంలోంచి చూస్తూ విడాకుల కోసం కోర్టుకు ఎక్కుతున్నారు. ఒకప్పుడు కాపురాల్లో కలతలు రేగితే పెద్దలు జోక్యం చేసుకుని సర్దిచెప్పేవారు. ఇప్పుడు పరిస్థితిలో మార్పు వచ్చింది. పిల్లలు విడాకులు తీసుకోవాలనుకుంటే సర్దిచెప్పడం అలా ఉంచి, పెద్దలే దగ్గరుండి విడాకులు ఇప్పించే పరిస్థితులు దాపురించాయి. మరోవైపు, వివాహ వ్యవస్థ ఒడిదుడుకులకు లోనవుతున్న విషయాన్ని గమస్తున్న యువతీయువకులు పెళ్లిని కాదని, సహజీవనం వైపు మొగ్గుచూపుతున్నారు. దీని వల్ల భారతీయ వివాహ వ్యవస్థ ఉనికే ప్రమాదంలో పడుతోంది. గృహి హింస, మనోవర్తి చట్టాలు దుర్వినియోగం అవుతున్నంత మాత్రాన వాటిని రద్దు చేయాలనే వాదనలు ఎంతమాత్రం సహేతుకం కాదు. ఇప్పటికీ సమాజంలో మహిళలపట్ల వివక్ష కొనసాగుతూనే ఉంది. గృహహింసకు లోనవుతూనే ఉన్నారు. కాబట్టి, వారికి రక్షణగా రూపొందిన చట్టాలలోని లొసుగులను పరిహరించే ప్రయత్నం జరగాలి. వాటిని ఆసరా చేసుకుని భర్తలను, అత్తమామలను వేధించాలనుకునే మహిళల భరతం పట్టేలా చట్టాలను పటిష్టంగా రూపొందించాలి. లేనిపక్షంలో పవిత్రమైన వివాహ వ్యవస్థ నాశనమయ్యే ప్రమాదం ఉంది.

# పాక్ కంటే బంగ్లాలోనే హిందువులపై ఎక్కువ హింస

**హైదరాబాద్, డిసెంబర్ 23 వెలుతురు:**
బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లలో హిందువులు, మైనారిటీ వర్గాలపై ఇటీవల దాడులు పెరుగుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా షేక్ హసీనా ప్రభుత్వం పతనం తర్వాత వీటి సంఖ్య భారీగా చోటు చేసుకుంటున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ క్రమంలో బంగ్లాదేశ్‌లో హిందువులపై హింసాత్మక ఘటనలకు సంబంధించి ఈ ఒక్క ఏడాదిలోనే 2200 కేసులు నమోదైనట్లు భారత విదేశాంగ శాఖ పేర్కొంది. పాకిస్థాన్ లోనూ ఈ ఏడాది 112 కేసులు రికార్డయ్యాయని రాజ్యసభకు సమాచారం ఇచ్చింది. 'హింసాత్మక ఘటనలను భారత ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. వీటిపై మన ఆందోళనను బంగ్లా ప్రభుత్వానికి వ్యక్తం చేశాం. హిందువులు, ఇతర మైనారిటీలకు భద్రత కల్పించేందుకు బంగ్లాదేశ్ అవసరమైన చర్యలన్నీ తీసుకుంటుందని ఆశిస్తున్నాం' అని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. దౌత్యమార్గాల ద్వారా ఆయా ప్రభుత్వాలతో తమ ఆందోళన తెలియజేశామని.. ఇటీవల బంగ్లాలో పర్యటించిన విదేశాంగ కార్యదర్శి కూడా ఇదే విషయాన్ని ఉద్ఘాటించారని పేర్కొంది. అటు మతపరమైన హింస, మైనారిటీ వర్గాలపై దాడులకు సంబంధించి చర్యలు తీసుకోవాలని పాకిస్థాన్‌కు కూడా విజ్ఞప్తి చేసినట్లు భారత విదేశాంగ వెల్లడించింది. అక్కడి మైనారిటీలపై జరుగుతున్న దారుణాల గురించి అంతర్జాతీయ వేదికలపై పాకిస్థాన్ తీరును ఎండగడుతూనే ఉన్నామని తెలిపింది. విదేశాంగ నివేదిక ప్రకారం.. హిందువులపై హింసాత్మక ఘటనలకు సంబంధించి బంగ్లాదేశ్‌లో 2022లో 47, 2023లో




302కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది డిసెంబర్ 8నాటికి ఏకంగా 2200 కేసులు రికార్డయ్యాయి. పాకిస్థాన్‌లో 2022లో 241 కేసులు, 2023లో 103, 2024లో 112 ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ రెండు దేశాలు మినహా మరే పొరుగు దేశంలో హిందువులపై హింసాత్మక దాడులు నమోదు కాలేదని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. మరోవైపు భారత్‌లోని కొన్ని ప్రాంతాలను స్వాధీనం చేసుకోవాలంటూ బంగ్లాదేశ్‌లో కొందరు చేస్తున్న వాదనను భారత్ తీవ్రంగా ఖండించింది. బహిరంగ వ్యాఖ్యలు చేసేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని స్పష్టం చేసింది. పొరుగుదేశ ప్రజలు, అక్కడి తాత్కాలిక ప్రభుత్వంతో సంబంధాలను పెంపొందించుకు నేందుకు ఆసక్తి చూపిస్తున్నప్పటికీ.. బంగ్లా వైపు నుంచి ఈ తరహా చర్యలు నిరాశ కలిగిస్తున్నాయని విదేశాంగశాఖ పేర్కొంది.

# సమభావంకు ఇల్లే పునాది కావాలి

**హైదరాబాద్, డిసెంబర్ 23 వెలుతురు:**
వేల ఏళ్ల నాటి మను సంస్కృతి భారతీయ సమాజాన్ని నేటికీ పీడిస్తూనే వుంది. 'స్త్రీ ఎప్పుడూ తండ్రి, భర్త, కొడుకు సంరక్షణలోనే వుండాలని, వేధించి హింసించే భర్తను కూడా పూజించాలి' అనే పురుషాధిక్య భావజాలాన్ని నేడు కూడా చలామణీ చేసేందుకు మనువాదులు యత్నిస్తున్నారు. దానికి నిదర్శనమే నేటికీ కొనసాగుతోన్న లింగ వివక్ష. స్త్రీ పట్ల సమాజం ఎంత అమానవీయంగా ప్రవర్తిస్తోందో తెలుపుతూ? 'నువ్వు ఆడదానివి, గీత దాటకూడని దానివి, మచ్చపడితే మాయని దానివి' అంటుందని చెబుతారు అబ్బూరి ఛాయాదేవి. ఈ మచ్చలు, గీతలు స్త్రీలకే గాని పురుషులకు లేవంటుందీ సమాజం. ఈ సమాజంలో అమ్మాయిలకు అడుగడుగునా అవరోధాలే.. వారి కదలికలపై ఎన్నో ఆంక్షలు, నిర్బంధాలు. పాప-బాబు, అమ్మాయి-అబ్బాయి, మహిళ-పురుషుడు అన్న ఈ పదాల మధ్య గీతలు చెరిపేసి, సమానం అని చెప్పాలనుకున్నా, పురుషాధిపత్య భావజాలం ఏదోఒక రూపంలో మొలకెత్తుతూనే వుంది. ఇంట్లో కనీసం ఒక్క మగపిల్లాడైనా వుండాలని కోరుకునే భావన బలంగా వేళ్లూనుకుని వుంది. అమ్మాయిలైతే పెళ్లి తర్వాత అత్తవారింటికి వెళ్లిపోతారు, అదే అబ్బాయిలైతే వృద్ధాప్యంలో తమను చూసుకుంటారని, అండగా వుంటారని తల్లిదండ్రులు భావిస్తుంటారు. కానీ, కొడుకు కంటే కూతురే నయమని అనుభవం చెబుతోంది. సమాజం అన్ని రంగాల్లోనూ మారుతున్నా అమ్మాయిలు- అబ్బాయిల పెంపకం విషయంలో మాత్రం పెద్దగా మారలేదు. కుటుంబానికి స్త్రీ పురుషుల ఇద్దరి అవసరం ఉంటుంది.



బండికి రెండు చక్రాల వంటి వారు. కానీ సమాజం వారిని వేరు చేసి చూస్తె?ంది. ఈ తరహా విభజన ప్రాథమిక పాఠ్యాంశాల నుంచి సాహిత్యం వరకూ, సీరియళ్ల నుంచి సినిమాల వరకూ అబ్బాయిలకు ప్రాధాన్యతనివ్వడం చూస్తూనే వున్నాం. విద్యలోనూ వివక్షతే. మగపిల్లలను బయట చదువులకు పంపించే తల్లిదండ్రులు ఆడపిల్లలను పంపడానికి సంకోచిస్తారు. ఎవరో ఒకరినే చదివించాల్సిన పరిస్థితివుంటే అబ్బాయిలకే ప్రాధాన్యతనిస్తారు. పిల్లల పుట్టుక దగ్గర నుంచి పెంపకం వరకూ ఈ వివక్ష అడుగడుగునా కొనసాగుతూనే వుంది. గర్భంలో ఉన్నది ఆడపిల్ల అని తెలిస్తే పిండ దశలోనే అంతమొంది స్తున్నారు. 'జనాభా లెక్కల్లో స్త్రీలకంటే పురుషుల సంఖ్యే ఎక్కువ' అని కేంద్ర ప్రభుత్వం గత వందేళ్లుగా నిర్వహించిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నివేదికలు చెబుతున్నాయి. ఇదంతా పురుషాధిపత్య భావజాల ఫలితమే. స్త్రీలను మగవారు తక్కవ చేసి చూడటం ఇంటి నుంచే మొదలవుతుంది. కాబట్టి ముందు తల్లులు మారాలి. అమ్మాయిల పట్ల కఠినత్వం కాకుండా, మార్థవం అబ్బాయిల్లో జీర్ణించుకునేలా పెంచడం తల్లిదం డ్రుల బాధ్యత. అమ్మాయి, అబ్బాయి సమానమేనన్న భావన ఇంటి నుంచి, చిన్న వయసు నుంచే మొదలవ్వాలి. అది తల్లిదండ్రుల బాధ్యత. ఇంటర్నెట్ యుగంలో సోషల్‌మీడియా, ఏఐ వంటి మాధ్యమాలు అందుబాటులో వున్న నేపథ్యంలో టీనేజ్ పిల్లల భావోద్వేగాలను నిశితంగా గమనిస్తుండాలి. ఒకవైపు కార్పొరేటీరణ, మరోవైపు మనువాదం నేర్పిన సనాతనధర్మం పురుష మెదళ్లలో చెత్తలా పేరుకుపోతోంది. ఈ చెత్తను తొలగించే బాధ్యత ఇంట్లో తల్లిదండ్రులది, పాఠశాలలో ఉపాధ్యాయులది. ఇంట్లో తల్లిని, చెల్లినీ గౌరవించడం నేర్పాలి. బయటి స్త్రీలకు కూడా అంతే గౌరవ మర్యాదలివ్వాలి. పాఠ్యాంశాల్లోనూ అమ్మాయి-అబ్బాయి సమానమన్న భావన పాదుకొల్పా లి. ఆ దిశగా అబ్బాయిలను పెంచాలి. వారి మానసిక వికాసానికి తోడ్పడాలి. వంట చేయడం, ఇల్లు తుడవడం వంటివి కేవలం అమ్మాయిల పని మాత్రమే కాదు, అబ్బాయిలూ నేర్వాలన్న విజ్ఞత తల్లిదండ్రులే నేర్పాలి. ఇంటి పనంటే ఇంతులది కాదని చెప్పాలి. అమ్మాయిలతో పాటు అబ్బాయికీ అంట్లు తోమడం అలవాటు చేయాలి. అబ్బాయిల పెంపకంలో ఈ తరహా మార్పు అత్యవసరం.

# డ్యామిట్.. కథ అడ్డం తిరిగింది!



**హైదరాబాద్, డిసెంబర్ 23 వెలుతురు:**
తెలంగాణలో ఇకపై ఎలాంటి బెనిఫిట్ షోలు ఉండవు. సినిమా టికెట్ల ధరలూ పెంచేది లేదని తెలంగాణ సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఆయన ఈ ప్రకటన ఎందుకు చేశారో కూడా తెలిసిందే. ఇప్పుడు ఈ అంశమే తెలుగు రాష్ట్రాలలో హాట్ టాపిక్ గా మారింది. అసెంబ్లీలో సీఎం రేవంత్ ప్రకటన.. అల్లు అర్జున్ ప్రెస్‌మీట్.. తరువాత సినీ స్టార్ల ఇళ్లపై దాడులు ఇటు ఇండస్ట్రీలో, అటు జనంలో కూడా చర్చనీయంగా మారాచి. టికెట్ రేట్లు పెంచేది లేదని తెలంగాణ సర్కారు నిర్ణయం సంక్రాంతి సినిమాల వసూళ్లపై తీవ్ర ప్రభావం చూపుతుందనటంలో ఎటువంటి సందేహం లేదు.డిసెంబరు 5న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన పుష్ప2 సినిమాకు ఏ ప్రభుత్వమూ ఇవ్వని విధంగా తెలంగాణ సర్కారు టికెట్ ధరలు పెంచుకునేందుకు అవకాశం ఇచ్చింది. అంతేకాదు, విడుదలకు ముందు రోజు అంటే డిసెంబరు 4న పెయిడ్ ప్రీమియర్ షోలకూ అనుమతి ఇచ్చింది. సదరు షోకు టికెట్ ధరకు అదనంగా రూ.800 పెంచుకునేలా వెసులుబాటు కల్పించింది. దీంతో సాధారణ థియేటర్‌లో టికెట్ ధర రూ.1000 దాటిపోగా, మల్టీప్లెక్స్‌లలో పన్నులతో కలిపి రూ.1200లకు పైనే అయింది. అలాగే, విడుదలైన రోజు నుంచి నాలుగు రోజులు ఒక్కో టికెట్ ధర దాదాపు రూ.500 వరకూ ఉంది. దీంతో 'పుష్ప2' భారీగా వసూళ్లు రాబట్టింది. తొలి రోజు అత్యధికంగా రూ.294 కోట్లు వసూలు చేసి చరిత్ర సృష్టించింది. ఇప్పటికే రూ.1500 కోట్లకు పైగా వసూలు చేసిందని అంటున్నారు. ఇక్కడి వరకూ బాగానే ఉంది. తరువాతే డ్యామిట్ కథ అడ్డం తిరిగింది. సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగానే అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఆ తర్వాత ఆయన బెయిల్‌పై బయటకు కూడా వచ్చారు. ఈ ఘటనపై ప్రతి పక్షాలు ప్రభుత్వంపై విమర్శలు చేయటం, అల్లు అర్జున్‌ను పరామర్శించేందుకు ఆయన ఇంటికి సినీతారలు క్యూ కట్టడం వంటి ఘటనలపైనా సామాజిక మాధ్యమాల వేదికగా తీవ్ర చర్చ జరిగింది. ఈ క్రమంలోనే అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి సంధ్య థియేటర్ ఘటన, తదనంతర పరిణామాలపై తీవ్రంగా స్పందించారు. థియేటర్ వద్ద జరిగిన విషాదకర ఘటన విషయంలో అల్లు అర్జున్ సహా, సినీ ప్రముఖులు కనీసం మానవీయ కోణంలోనూ స్పందించలేదని అన్నారు. సామాన్యుల ప్రాణాలు పోతున్నా సరే ప్రత్యేక సదుపాయాలు కల్పించాలంటే మాత్రం కుదరదని స్పష్టంచేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా ఈ విషయాన్నే ధ్రువీకరించారు. దీంతో రాబోయే సంక్రాంతి సినిమాలపై ప్రభుత్వ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపనుంది.సంక్రాంతికి వినోదాల విందును పంచడానికి పలు చిత్రాలు రెడీ అయ్యాయి. ఈ ముగ్గుల పండగకు మొదటగా ప్రేక్షకులను పలకరించే చిత్రం 'గేమ్ ఛేంజర్'. రామ్‌చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన ఈ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ జనవరి 10న విడుదల కానుంది. దాదాపు రూ.450 కోట్ల భారీ బ్జడెట్‌తో దిల్‌రాజు ఈ మూవీని నిర్మించారు. 'పుష్ప2'కు ఇచ్చినట్లే స్పెషల్ ప్రీమియర్‌కు అనుమతి లభిస్తుందని, టికెట్ ధరల పెంపుతో పాటు, బెనిఫిట్ షోలకు అనుమతి వస్తుందని చిత్ర బృందం అందుకు తగిన ఏర్పాట్లకు సిద్ధమవుతూ వస్తోంది. 'పుష్ప2'ను దాటేలా వసూళ్లు రాబట్టే అవకాశం ఉందని అంచనాలు కూడా వేశారు. అయితే, ఇప్పుడు తెలంగాణ సర్కారు ప్రకటనతో 'గేమ్ ఛేంజర్' వసూళ్లు తారుమారయ్యే పరిస్థితి నెలకొంది. బెనిఫిట్ షోల సంగతి పక్కన పెడితే, టికెట్ ధరల పెంపునకు అనుమతి ఇవ్వబోమని ప్రభుత్వం చెప్పడం ఒకరకంగా షాక్ ఇచ్చినట్లే. మరోవైపు అటు సీఎం ప్రకటన, ఇటు అల్లు అర్జున్ ప్రెస్‌మీట్‌తో ఈ అంశం మరింత హీటెక్కింది. ఈ పరిస్థితుల్లో టికెట్ ధరల పెంపునకు అనుమతి ఇచ్చే అవకాశం లేనట్లే. 'గేమ్ ఛేంజర్'తో పాటు ఈ సంక్రాంతి బరిలోకి దిగనున్న మారో మూవీ 'డాకూ మహారాజ్'. బాలకృష్ణ కథానాయకుడిగా బాబీ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. ఈ మూవీ టికెట్ ధరల పెంపునకు కూడా అవకాశం ఉంటుందని భావించారు. తాజా నిర్ణయంతో వసూళ్లు ఆశించిన స్థాయిలో వచ్చే అవకాశం లేదంటున్నారు. బాలకృష్ణ గత చిత్రం 'భగవంత్ కేసరి' ఫుల్ రన్‌లో దాదాపు రూ.130 కోట్లు వసూలు చేసింది అప్పుడు టికెట్ ధరల పెంపు, బెనిఫిట్ షోలు ఉన్నాయి. ఇప్పుడు అవేవీ లేకుండా ఆ మార్కును అందుకోవడం కష్టంగా కనిపిస్తోంది. వీటితో పాటు వస్తున్న మరో మీడియం బ్జడెట్ మూవీ 'సంక్రాంతికి వస్తున్నాం'. ఇది మాస్ మూవీ కాదు. పక్కా కుటుంబ ప్రేక్షకులే లక్ష్యంగా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఇది రాబోతోంది. ప్రీమియర్, బెనిఫిట్ షోలు లేకపోయినా, టికెట్ ధరలు పెంచుకునే వెసులుబాటు ఉంటుందని భావించారు. ఈ మూవీకి కూడా దిల్‌రాజు నిర్మాత కావడం విశేషం. ప్రభుత్వం నిర్ణయంతో దీనిపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఇండస్ట్రీ లెక్కలు తారుమారు చేయనున్న ప్రభుత్వం నిర్ణయంపై సినీ పెద్దలు ఎలా స్పందిస్తారో చూడాలి. మరోవైపు తెలంగాణ సర్కారు బాటలోనే ఏపీ ప్రభుత్వం నడుస్తుందా? సంక్రాంతి సినిమాలపై అక్కడి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశం ఆసక్తిని రేపుతోంది.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను విధిగా పాటించాలి...

● కార్పొరేటర్ రోజా దేవి రంగారావు...



**కూకట్ పల్లి డిసెంబర్ 23 వెలుతురు:** అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను విధిగా పాటించాలని వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ లోని హనుమాన్ నగర్, వివేకానంద నగర్ కాలనీలలో జరుగుతున్న సిసి రోడ్డు పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీవరేజ్ లైన్స్ సరిగా లేవని మురుగునీరు ఇంటి లోపలికి వస్తుందని కార్పొరేటర్ దృష్టికి తీసుకువస్తే జిహెచ్ఎంసి ఏ.ఈ నిఖిల్, హెచ్ఎండబ్ల్యూఎస్ మేనేజర్ ప్రియాంక లతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సిసి రోడ్ ని నాణ్యతతో వేసి క్యూరింగ్ చేసి వీలైనంత తొందరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అలాగే సివరేజ్ లైన్స్ మార్చి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నరసింహ, ఎర్రన్న, వెంకటయ్య, ఖాసిం, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి మహా పడిపూజ కి హాజరు కావాలని ఎంపీ ఈటెల రాజేందర్‌ను ఆహ్వానించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు...



**కూకట్ పల్లి డిసెంబర్ 23 వెలుతురు:**
కూకట్ పల్లి సర్కిల్ పరిధిలోని వివేకానంద నగర్ లో గల శ్రీ శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంలో డిసెంబర్ 31వ తేదీన నిర్వహించే మహా పడిపూజ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా కోరుతూ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ ను సోమవారం వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రాన్ని అందజేస్తూ శాలువాతో సత్కరించారు. అనంతరం ఈటల రాజేందర్ మాట్లాడుతూ హరిహర పుత్రుడు శ్రీ శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమానికి తప్పకుండా హాజరు అవుతానని ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొంటారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు, వివేకానంద నగర్ డివిజన్ అధ్యక్షులు నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## శంషి గూడలో సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు...



**కూకట్ పల్లి డిసెంబర్ 23 వెలుతురు:**
శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఆల్విన్ కాలనీ డివిజన్ లో గల శంషి గూడ ఇంద్రా హిల్స్ స్నేహ మోడల్ స్కూల్ లో సోమవారం జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలకు ముఖ్యఅతిథిగా కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చర్చి నిర్వాహకులు కృష్ణారావు ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమములో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాధవరం రంగారావు, ఎర్రవల్లి సతీష్ రావు, స్కూల్ కరస్పాండెంట్ ఎం.రాజు, ప్రిన్సిపాల్ ఎం.మమతరాజ్, శామ్యూల్, పాస్టర్ హారిస్, పాస్టర్ ఇజ్రాయెల్, ఎం.స్నేహ రాజ్, ఎం.నిఖితా రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## 10వ రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్ లో గోల్డ్ మెడల్ సాధించిన కుమారి అక్షయ...

● కుమారి అక్షయను అభినందించిన ఎమ్మెల్యే మాణిక్ రావు...



**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 24:**
తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థల ఆధ్వర్యంలో షాద్ నగర్ పరిధిలోని కమ్మదనం గురుకుల పాఠశాల ఆవరణలో జరిగిన 10వ రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్ 2024 లో కోహిర్ మాజీ ఎంపీటీసీ సంపత్ కుమార్తె అక్షయ లాంగ్ జంప్ క్రీడలో మొదటి బహుమతి సాధించి గోల్డ్ మెడల్ సాధించినందుకు జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు శాలువా పూల మాలతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో మరెన్ని జాతీయ స్థాయిలో అవార్డ్ లు సాధించడానికి కృషి చేయాలని కోరారు.

# పీవీ నరసింహారావు సేవలు చిరస్మరణీయం...

● టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం.



**కూకట్ పల్లి డిసెంబర్ 23 వెలుతురు:**
భారత దేశ ఆర్థిక సంస్కరణల పితామహుడిగా పేరుగాంచిన భారతదేశ మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు సేవలు చిరస్మరణీయమని టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం అన్నారు. సంస్కరణ వాది, బహు బాషా కోవిదుడు పి.వి. నర్సింహా రావు 20 వ, వర్ధంతి సందర్భంగా నెక్లెస్ రోడ్ లోని పి.వి. జ్ఞాన భూమి వద్ద తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ, సహకార చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు , రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, పి.వి. ప్రభాకర్ రావు, సత్తుపల్లి శాసన సభ్యులు మట్టా రాగమయి, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం లు ఘనంగా నివాళులర్పించి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ భారతదేశ తెలుగు ప్రజలు గర్వించదగ్గ నాయకుడు పి.వీ నరసింహారావు అన్నారు. తెలంగాణ పల్లె నుంచి దేశ ప్రధానిగా అంచెలంచెలుగా ఆయన ఎదిగిన తీరు ఆదర్శ నీయమని, దేశానికి ఆయన అందించిన సేవలు మరువ లేనివని అన్నారు. దక్షిణ భారతావని నుండి ప్రధానమంత్రి పదవి అధిష్టించిన తొలి నేతగా, ఒకే ఒక తెలుగు వానిగా పీ.వీ నరసింహారావు సేవలందించడం మనందరికీ గర్వకారణమని, ఆయన రక్షణ, విదేశాంగ, హెూం శాఖా మంత్రిగా, ముఖ్యమంత్రిగా, బహు బాషా వేత్తగా, రచయితగా, న్యాయ శాస్త్ర కోవిదులు, అపర చాణక్యుడిగా పేరుందారని పేర్కొన్నారు. భారత ఆర్థిక సంస్కరణలకు బీజం వేసి, కుంటుతున్న వ్యవస్థను తిరిగి పట్టాలెక్కించిన ఘనత ఆయన సొంతం అన్నారు. భారత ఆర్థిక సంస్కరణలకు పితామహుడిగా పేరొందిన మేధావి అని, భూస్వామ్య వ్యవస్థ నిర్మూలనకు నడుం బిగించి, భూ గరిష్ట పరిమితి చట్టాన్ని, భూ సంస్కరణలు అమలు చేసి మిగులు భూములు పంచిన ఘనత పీవీ దే అన్నారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా గురుకుల పాఠశాలలు విద్యారంగానికి ఎనలేని సేవలు అందించి, విద్య వ్యవస్థ పటిష్ట పరిచి ఇంత ఉన్నత స్థాయికి రావడానికి ప్రధాన కారణం ఆయనే నని, పీవీ కీర్తిని పెంచేలా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని, ఆయన ఆలోచన విధానాలు కాంగ్రెస్ పార్టీకి ఎప్పుడు దోహదపడతాయని అన్నారు.

# ఆశా వర్కర్ల సమస్యలను అసెంబ్లీలో చర్చించాలని వాల్ పోస్టర్ విడుదల..

**సీఐటీయూ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్..**




**కూకట్ పల్లి డిసెంబర్ 23 వెలుతురు:**
అసెంబ్లీ సమావేశాలలో ఆశా వర్కర్ల సమస్యలపై జీతాల పెంపు కోసం కనీసం18000రూ ఇవ్వాలని సిఐటియు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆశ వర్కర్స్ ల సమస్యలు పరిష్కరించాలని నడుస్తున్న బస్ జాతా పోస్టర్ లను బాలానగర్ మండలం లోని ఎమ్మార్వో కార్యాలయం వద్ద సోమవారం ఆశా వర్కర్లు వాల్ పోస్టర్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్,ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలులు అనిత, సబియా లు పాల్గొని మాట్లాడుతూ ఆశ వర్కర్స్ కీ కనీస వేతనాలు18వేల రూపాయిలు ఇవ్వాలని అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పక్షంలో ఉన్నప్పుడు ఆశ వర్కర్స్ కీ 26వేలు రూ. ఇస్తాం అని హామీ ఇచ్చిన నేపథ్యంలో హామీని పరిష్కరించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఆశా కార్యకర్తలకు పిఎఫ్, ఈయస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించి రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించాలని తదితర డిమాండ్లతో బస్సు జాతాను నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఆరోగ్య తెలంగాణ గా మార్చడం కోసం క్షేత్రస్థాయిలో విస్తృత సేవలు అందిస్తున్న ఆశా కార్యకర్తలను విస్మరిస్తే సహించేది లేదని అన్నారు. అదేవిధంగా కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఎన్ హెచ్ ఎం కీ బడ్జెట్ కేటాయించాలి అని అన్నారు. ఆశ వర్కర్స్ ల శ్రమను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా లాంటి సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి దేశాన్ని కాపాడిన ఆశా వర్కర్లకు కనీస వేతన 18 ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు. డిసెంబర్ 31 న చలో ఇంద్ర పార్క్ బస్ జాతా ముగింపు సభ ను జయప్రదం చెయ్యాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అనిత, సబియా, మంజుల, లలిత, సోమలత, మారుత, అఫ్రీన్, రుక్మిణి, లక్ష్మీ, రేణుక, భాగ్యలక్ష్మి, రావళి, దీప్తి, నజీమా తదితరులు పాల్గొన్నారు.

# బోసుపల్లి ప్రతాప్ నివాసానికి త్రిపుర గవర్నర్



**తుర్కయంజాల్, వెలుతురు : డిసెంబర్ 23**
ఇంజాపూర్ స్నేహపురి కాలనీలో నివాసం ఉంటున్న బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్ నివాసానికి త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేన రెడ్డి విచ్చేయడం జరిగింది.ప్రతాప్ తో ఉన్న స్నేహం గురించి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ పార్టీలో నిబద్ధతతో కష్టపడి పనిచేస్తున్నారని అన్నారు. బిజెపి పార్టీలో వారు కలిసి పనిచేసిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

కార్యక్రమంలో కుటుంబ సభ్యులు రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షులు కొండటి శ్రీధర్, బిజెపి జిల్లా అధ్యక్షులు బొక్క నరసింహ రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజన్ కుమార్ గౌడ్, జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ గారు కొంద్రు పురుషోత్తం బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జహీరాబాద్ డిపోలో నిర్వహించిన డయల్ యువర్ డిఎం కార్యక్రమానికి విశేషణ స్పందన...

● జాకీర్ హుస్సేన్, జహీరాబాద్ డిపో మేనేజర్..



**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 23:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ డిపోలో సోమవారం నిర్వహించిన దయల్ యువర్ డిఎం కార్యక్రమానికి విశేషణ స్పందన వచ్చిందని డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్ ఒక ప్రకటన విడుదల చేశారు. దీనిలోభాగంగా నరసింహ చారి అనే ప్రయాణికుడు పిప్పడపల్లి సర్వీసును నైట్ అవుట్ సర్వీసు గా పునరుద్దించాలని కోరారు. గుడుపల్లి గ్రామానికి చెందిన మల్లయ్య గుడుపల్లి మరియు మొగడంపల్లి మీదుగా బస్సు సదుపాయం కల్పించాలని కోరారు. జహీరాబాద్ కు చెందిన ప్రవీణ్ అనే ప్రయాణికుడు చెయ్యెత్తిన చోట బస్సులు ఆపాలని కోరారని, డిపో మేనేజర్ పై సమస్యలకు సానుకూలంగా స్పందించి పై సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని వారి వెల్లడించిన ప్రకటనలో పేర్కొన్నారు.

# రంజోల్ రైతు వేదికలో ఘనంగా జాతీయ రైతు దినోత్సవ వేడుకలు...

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 23:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం రంజోల్ రైతు వేధికలో వ్యవసాయ శాఖ కొండా లక్ష్మణ్ ఉద్యాన కళాశాల విద్యార్థినులు చేత జాతీయ రైతు దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్ కుమార్ రైతుల చేత కేక్ కట్ చేయించి రైతులకు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ప్రధాన మంత్రి చౌదరి చరణ్ సింగ్ జన్మ దిన సందర్భంగా రైతుల కొరకు ఆయన చేసిన వ్యవసాయ సేవలకు గుర్తింపుగా జాతీయ రైతు దినోత్సవం వేడుకలు జరుపుకుంటున్నామని గుర్తు చేశారు. రైతు లేనిదే వ్యవసాయం లేదని ... అది లేకుంటే మానవ మనుగడ కష్టమని అందుకే రైతును మనమందరం గౌరవించాలని రామ్ మోహన్ జోషి తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్ కుమార్, రైతులు నాగేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఫిరోజ్, మోహన్, మహిపాల్ రెడ్డి, సలీం, సంజీవరెడ్డి, మనెప్ప, జమీర్ ఉద్దీన్, వీర రెడ్డి, ఉద్యాన కళాశాల విద్యార్థినులు మోనికా, సరిత, శ్రీలత, మమతా, అఖిల, మనోజ్ఞ, ప్రవలిఖ తదితరులు పాల్గొన్నారు.



# కేంద్ర మంత్రి అమిత్ షా తక్షణమే పదవికి రాజీనామ చేయాలి

## జహీరాబాద్ ఎంపి సురేష్ కుమార్ శెట్కార్



జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 23:

రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ భీఆర్ అంబేద్కర్ ను అగౌర్వపరుస్తూ కేంద్ర మంత్రి అమిత్ షా పార్లమెంట్ సాక్షిగా చేసిన అనుచిత వాఖ్యలను జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శెట్కార్ తీవ్రంగా ఖండిచారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ఎంపి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శెట్కార్ మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ భీఆర్ అంబేద్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని, అంబేద్కర్ ను కించపరిచేలా మాట్లాడిన అమిత్ షా తక్షణమే పదవికి రాజీనామా చేయాలన్నారు. దీన్ని కాంగ్రెస్ పార్టీ ముక్త కంఠంతో ఖండిస్తోందని చెప్పారు. కులమతాలకు



అతీతంగా కాంగ్రెస్ పనిచేస్తుంటే బీజేపీ విభజించే పాలసి అమలు చేస్తున్నదన్నారు. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఈ నెల 24న సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టరెట్ ముందు ధర్నా చేపడుతున్నట్లు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేసారు. ఈ సమావేశంలో మాజీ ఇండస్ట్రీస్ చైర్మన్ తన్వీర్, పట్టణ అధ్యక్షులు కండెం నర్సింలు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పీ. నర్సింహా రెడ్డి, హన్మంత్ రావు పాటిల్, మక్సూద్, భి. శ్రీనివాస్ రెడ్డి, రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆటలతో క్రమశిక్షణ అలవడుతుంది

## - బి ఆర్ ఎస్ యువత అధ్యక్షుడు సంతోష్ రావు

కొల్చారం వెలుతురు న్యూస్ డిసెంబర్ 23:

మెదక్ జిల్లా కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి గ్రామంలో బిఆర్ఎస్ యువత విభాగం అధ్యక్షుడు తణుకులపల్లి సంతోష్ రావు ఆధ్వర్యంలో వాలీబాల్ ప్రీమియర్ లీగ్ -1 కార్యక్రమాన్ని ప్రారంభించారు. పతి గ్రామంలో ఇలాంటి పోటీలు నిర్వహించడం తనకెంతో సంతోషాన్నిస్తుందన్నారు. యువకులకు విద్యతోపాటు క్రీడలు కూడా అత్యంత ఆవశ్యకమని, క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడంలో దోహదపడతాయని, దేహదారుఢ్యం మానసిక ప్రశాంతత మొదలగునవి క్రీడల వలన పెరుగుతాయన్నారు. క్రీడలు యువకులు చెడుదారి పట్టకుండా వారిలో సృజనాత్మకతను పెంపొందించుకునే విధంగా , తమపై తమకు ఆత్మస్థైర్యం పెంపొందించడంలో ఎంతగానో ఉపయోగపడతాయి అన్నారు. అనంతరం వి న్నర్ జట్టు అయిన వేణు కు విన్నర్ కప్పుతో పాటు 10,000 రూపాయల ప్రైజ్ మనీని అందజేశారు. ఈ కార్యక్రమంలో నరేందర్ రెడ్డి, కొమ్ములయాదగౌడ్, ముత్యం గారి సంతోష్ ,గౌరీ శంకర్, సిద్ధిరములు, రవితేజ, రవీందర్, చిట్యాల యాదయ్య, బైకారి శ్రీకాంత్, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.




# సీఎం పర్యటనకు ఏర్పాట్ల పరిశీలన





కొల్చారం, వెలుతురు న్యూస్ డిసెంబర్ 23:

ఈనెల 25న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటన భాగంగా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పి ఉదయ్ కుమార్ రెడ్డి లతో సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి ముందుగా మండలం పరిధిలోని పోతంశెట్టిపల్లి శివారు ప్రాంతంలో గల ఏడుపాయల ప్రాంగణంలో హెలికాప్టర్లో దిగనున్న నేపథ్యంలో అక్కడ నూతన సిసి హెలిఫాడ్ నిర్మాణం చేశారు. అనంతరం ట్రాఫిక్ నియంత్రణకు భారీకేడ్లు ఏర్పాటు చేయాలని, ఏడుపాయల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు మెదక్ మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు, కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పి ఉదయ్ కుమార్ రెడ్డి, అదనపు కలెక్టర్ నగేష్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, కాంగ్రెస్ నర్సాపూర్ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# శంకరపట్నం మండలంలో పలు గ్రామాల బిజేపి బూత్ అధ్యక్షుల ఎన్నిక

శంకరపట్నం వెలుతురు డిసెంబర్ 23:

శంకరపట్నం మండలంలోని పలు గ్రాములలో బిజేపి మండల అధ్యక్షుడు ఎనుగుల అనీల్ ఆద్వర్యంలో, మండల ఎన్నికల అధికారి ఆకుల రాజేందర్ సమక్షంలో బూత్ కమిటీలను ఎన్నుకోవడం జరిగింది.కేశవపట్నం గ్రామంలోని107వ బూత్ అధ్యక్షుడిగా బొజ్జ కూమార్,

112వ బూత్ అధ్యక్షుడిగా నాగవెల్లి జగదీష్, మొలంగూర్ గ్రామంలోని115 వ బూత్ అధ్యక్షుడిగా దాసారపు తిరుపతి,

117 వ బూత్ అధ్యక్షుడిగా పొద్దుటూరి వెంకన్న, గద్దపాక గ్రామంలోని

126 వ బూత్ అధ్యక్షుడిగా రెడ్డి రమణారెడ్డి,

127 వ అధ్యక్షుడిగా జంగ సతీష్

114 వ బూత్ అధ్యక్షుడిగా మారాటి వెంకటేశ్వర్,

116 వ బూత్ అధ్యక్షుడిగా బండి అనీల్,అంబాల్ పూర్ గ్రామంలోని

79 వ బూత్ అధ్యక్షుడిగా

రాణవేణి నగేష్, 80 వ బూత్ అధ్యక్షుడిగా పెద్దాపురం వీరస్వామి, ఎరడపల్లి గ్రామంలోని

97 వ బూత్ అధ్యక్షుడిగా నేదురు శ్రీనివాస్,98 వ అధ్యక్షుడిగా జాలిగం నాగయ్య,

99 వ అధ్యక్షుడిగా జింక స్వామి,

కేశవపట్నం పరిదిలోని పాపయ్యపల్లె 109 బూత్ అధ్యక్షుడిగా



చెంచు సంపత్ లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దండు కొమురయ్య, జంగ జైపాల్ , దొంగల రాములు, మండల ప్రధాన కార్యదర్శులు దాసారపు నరెందర్, కొయ్యడ అశోక్, శక్తి కేంద్ర సంయోగులు పోతునూరి రాజు, శ్రీనివాస్, సాయి ప్రకాష్, తిరుపతి, తోట అనిల్ లతో పాటు ఆయా గ్రామాల బిజేపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీనియర్ జర్నలిస్ట్ శ్రీనివాస్ రెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే మాణిక్ రావు



జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 23:

సీనియర్ జర్నలిస్ట్ వై. శ్రీనివాస్ రెడ్డి, అయన సోదరుడు శ్రీధర్ రెడ్డి మాతృమూర్తి అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెల్సుకున్న జహీరాబాద్ శాసనసభ్యులు కొనింటీ మాణిక్ రావు, డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్ లు సోమవారం కోహీర్ లోని వారి నివాసానికి చేరుకొని శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని కలగజేసారు. వారితో పాటు మాజీ ఆత్మ చైర్మన్ విజయ్ కుమార్, కొహీర్ మండల పార్టీ అధ్యక్షులు నర్సింలు , జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, ఝరాసంఘం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం ,మాజి కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయ చైర్మన్ నర్సింహ గౌడ్,మాజి సర్పంచ్ కలిం ,మాజి ఎంపీటీసీ సంపత్ ,యువ నాయకులు సందీప్ ,చిన్న రెడ్డి, అస్లాం,వహీద్ తదితరులు ఉన్నారు.

# విద్యుత్ ఘాతంతో రైతు మృతి



కొల్చారం, వెలుతురు న్యూస్ డిసెంబర్ 23:



మండల పరిధిలోని సంగాయిపేట గ్రామ శివారులో గల వ్యవసాయ క్షేత్రంలో ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి గురై రైతు మృతి చెందిన ఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. మృతుని బంధువుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ముక్కిరే మల్లయ్య(60) నారుమడికి నీరు పెడదామని పొలం వద్దకు వెల్లి చూడగా స్టార్టర్ లో ఒక ఫేస్ కరెంటు రావడంలేదని గమనించాడు. ఏమైందోనని ట్రాన్స్ఫార్మర్ వద్దకు వెళ్లి చూడగా ఫీజు వైరు కట్ అయి ఉండడానికి చూసి, ఫీజు వైరు అమర్చడానికి ఏపీ స్విచ్ బంపర్ ఆఫ్ చేయబోయే క్రమంలో అదుపుతప్పి ట్రాన్స్ఫార్మర్పై పడిపోయాడు. దీంతో కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహమ్మద్ గౌస్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య సత్యమ్మ, కుమారుడు నరసింహులు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

# రూ.4 కోట్ల 10 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన చైర్ పర్సన్ మల్ రెడ్డి అనురాధ



తుర్కయంజాల్,వెలుతురు: డిసెంబర్ 23

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని చైర్ పర్సన్ మల్ రెడ్డి అనురాధ రాంరెడ్డి అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలో నాలుగు కోట్ల 10 లక్షల రూపాయలతో సిసి రోడ్లు, డ్రైనేజీ పనులకు చైర్ పర్సన్ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా అనురాధ రాంరెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కరించడానికి ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నామని అన్నారు. వార్డులలో అభివృద్ధి పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్, మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్త కురుమ మంగమ్మ శివకుమార్, కౌన్సిలర్, ఫ్లోర్ లీడర్ కొశిక ఐలయ్య, కౌన్సిలర్ లు కాకుమాను సునీల్, నక్క శివలింగం గౌడ్, బొక్కా రవీందర్ రెడ్డి, నాయకులు మర్రి మహేందర్ రెడ్డి, విజయా నంద్ రెడ్డి, రాగ్య నాయక్, వెంకట్ రావు, దూదిమెట్ల వెంకటేశ్ యాదవ్, శంకర్, హనుమంతు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక రంగాలను బలోపేతం చేసిన మహెూన్నతుడు పీవీ : హరీశ్‌రావు

హైదరాబాద్, డిసెంబర్ 22 ( వెలుతురు):

ఆర్థిక రంగాలను బలోపేతం చేసి నూతన శకాన్ని ప్రారంభించిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా హరీశ్ రావు నివాళు లర్పించారు. భారత రాజకీయ, ఆర్థిక రంగాలను కొత్త గమ్యాలకు తీసుకెళ్లిన మహెూన్నత నాయకుడని చెప్పారు. ఆయన చూపిన దారే నేటి అభివృద్ధి పునాది అని వెల్లడించారు. పీవీ నరసింహారావు సేవలను స్మరించుకుంటూ, ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగుదామని కోరుకుంటున్నాని చెప్పారు. 'తెలంగాణ ముద్దుబిడ్డ, భారత రత్న, బహుముఖ ప్రజ్ఞాశాలి, బహుభాషా కోవిదుడు పీవీ నరసింహారావు గారి వర్ధంతి సందర్భంగా నివాళి. భారతదేశ రాజకీయ, ఆర్థిక రంగాలను కొత్త గమ్యాలకు తీసుకెళ్లిన మహెూన్నత నాయకుడు.

## తపస్ జిల్లా కార్యవర్గంలో చోటు





**మెదక్ వెలుతురు డిసెంబర్ 23:**
తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్)మెదక్ జిల్లా కార్యదర్శులుగా కె.సంజీవ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాయ్స్ తూప్రాన్ ,జీ.నాగేశ్వర్ రావు ఎంపీపీ ఎస్ కోనాపూర్ ,రామాయంపేట మండలం నుండి ఎన్నికైనట్లు మెదక్ జిల్లా తపస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, చల్లా లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ తపస్ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారుద.

## వేధన్షిక పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి

- అతిథిదులుగా మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్ కుమార్, చిరుమర్తి లింగయ్య లు



**వెలుతురు, హైదరాబాద్, డిసెంబర్ 23:**
సూర్యాపేట పట్టణంలోని సదాశివారెడ్డి గార్డెన్స్ లో బీఆర్ఎస్ నాయకులు గుర్రం సత్య నారాయణరెడ్డి మనవరాలు వేధన్షిక మొదటి పుట్టినరోజు వేడుక కు హాజరై చిన్నారిని ఆశీర్వదించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ,మాజీ ఎమ్మెల్యేలు డా.గాదరి కిశోర్ కుమార్ ,చిరుమర్తి లింగయ్య తదితరులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా చిన్నారి ని వారు ఆశీర్వదించారు, అలాగే ఈ పుట్టిన రోజు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి. మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్ కుమార్, చిరుమర్తి లింగయ్య లకు గుర్రం సత్యనారాయణ రెడ్డి ఘన స్వాగతం పలికారు,

## 28 న చర్లపల్లి రైల్వే స్టేషన్ ప్రారంభం

- ఎంపీ ఈటల రాజేందర్
- మంత్రి శ్రీధర్ బాబు తో సమీక్ష
- పాల్గొన్న రైల్వే శాఖ అధికారులు



(రాపర్తి భాస్కర్ గౌడ్)
**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 23:**
చర్లపల్లి రైల్వే స్టేషన్ కు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్రమంత్రి శ్రీధర్ బాబు, రైల్వే శాఖ అధికారులతో సోమవారం మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ సమావేశం నిర్వహించారు, చర్లపల్లి రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమం నేపథ్యంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఇండస్ట్రీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో మినిస్టర్ క్వార్టర్స్ లో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మాజీ ఎంఎల్ఏలు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, భేతి సుభాష్ రెడ్డి, తాడూరి శ్రీనివాస్, జిఎంసీ కమిషనర్ ఇలంబర్తి, టీజీ ఐఐసీ వీసీ%డ% ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, రైల్వే కన్స్ట్రక్షన్ సిఇ సుబ్రమణ్య, రైల్వే సీనియర్ కోఆర్డినేషన్ రామారావు, కీసర ఆర్డీఓ , కాప్రా డిప్యూటీ కమిషనర్ తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. రైల్వే స్టేషన్ కి వెళ్ళే రోడ్డుకు అవసరం అయిన భూములు ఇచ్చేందుకు టీజీ ఐఐసి అంగీకరించింది. మౌలిక వసతులు వెంటనే పూర్తి చేస్తామని జిఎంసీ అధికారులు తెలిపారు. అంతకంటే ముందు చర్లపల్లి రైల్వేస్టేషన్లో రైల్వే, మున్సిపల్, రెవెన్యూ, ఐల , ఎలక్ట్రికల్, టౌన్ ప్లానింగ్, అధికారులతో సమావేశం అయిన ఈటల రాజేందర్, మాజీ ఎంఎల్ఏ లు మిగిలి ఉన్న పనులు, ఈనెల 28వ తేదీ న జరుగనున్న స్టేషన్ ప్రారంభోత్సవ ఏర్పాట్లపైసమీక్షించారు.

## కోలుకుంటున్న బాలుడు శ్రీతేజ్

**హైదరాబాద్,డిసెంబర్23( వెలుతురు):**
సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో గాయపడి.. దాదాపు మూడు వారాలుగా కోమాలో ఉన్న శ్రీతేజ్ హెల్త్ బులిటెన్ను కిమ్స్ హాస్పిటల్ యాజమాన్యం విడుదల చేసింది. ప్రస్తుతం శ్రీ తేజ్ ఆరోగ్యం నిలకడగా ఉందని, వెంటిలేటర్ లేకుండానే శ్వాస తీసుకుంటున్నాడని ఈ హెల్త్ బులిటెన్లో డాక్టర్స్ తెలిపారు. ఆదివారం కంటే సోమవారం అతని ఆరోగ్యం మెరుగైందని, కాకపోతే.. జ్వరం పెరుగుతోందన్నారు. అలాగే వైట్ బ్లడ్ సెల్స్, మిగితా సెల్స్ అన్ని ఇప్పుడిప్పుడే ఇంప్రూవ్ అవుతున్నాయి అని చెప్పారు. ఫుడ్ తీసుకోగలుగుతున్నాడని వెల్లడించారు. అయితే నాడీ వ్యవస్థ పనితీరులో మాత్రం ఎలాంటి మార్పు కనిపించలేదన్నారు.

# పీవీ స్వగ్రామంలో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం

( రాపర్తి భాస్కర్ గౌడ్)
**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 23**
హనుమకొండ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో భారత రత్న మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 20వ వర్ధంతి సందర్భంగా వారి నివాస ప్రాంగణంలో సంస్మరణ సభ కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరైన్నారు ,ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తో పాటు పీవీ నరసింహారావు కూతురు ఎమ్మెల్సీ వాణీదేవి, ఎమ్మెల్యే నాగరాజు , హుజురాబాద్ కాంగ్రెస్ ఇన్చార్జి వోడితల ప్రణవ్ , పీవీ నరసింహారావు కుటుంబ సభ్యులు ,ఇతర ముఖ్య నేతలు తదితరులు పాల్గొన్నారు,పీవీ నరసింహారావు 20 వ వర్ధంతి సందర్భంగా పీవీ నివాసంలో వారి విగ్రహానికి నివాళులు అర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ భారత రత్న వంగర ముద్దుబిడ్డ పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా ఈ సంస్కరణ సభ జరుగుతుందన్నారు.పీవీ నరసింహారావు కూతురు వాణీ మాట్లాడుతుంటే భావోద్వేగానికి గురవుతున్న,పీవీ నరసింహారావు సహచరులు చొక్కారవు తో కలిసి అనేక సార్లు పీవీ నరసింహారావు ను కలిసే అవకాశం వచ్చిందని మంత్రి ప్రభాకర్ తెలిపారు,1991 లో నేను ఎన్ ఎస్ యూ ఐ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు పీవీ ప్రధానిగా ఉన్నారని ఆయన గుర్తు చేశారు,అప్పటి నుండి ఆయన జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించేదని తెలిపారు, పీవీ నరసింహారావు ఈ వంగర ను ప్రపంచానికి చాటి చెప్పారని



మంత్రి గుర్తు చేశారు,వంగర్ హుస్నాబాద్ నియోజవర్గంలో ఉంది.హుస్నాబాద్ ను అన్ని రకాలుగా గౌరవాన్ని పెంపొందించేలా చేస్తున్నట్లుగా మంత్రి ప్రభాకర్ తెలిపారు,పీవీ



నరసింహారావు ఆయన చదివేది ఎక్కువ మాట్లాడడం తక్కువ.పీవీ నరసింహారావు ఆర్థికంగా ఈ దేశాన్ని బతికించిన వ్యక్తి అని కొనియాడారు,పెద్ద పెద్ద కార్లు సాంకేతిక విప్లవం మన దేశానికి వచ్చాయి అంటే కారణం వారేనని వంగర గ్రామానికి బ్రిడ్జి పై ఇప్పుడే అధికారులతో మాట్లాడి నిధులు కేటాయించి త్వరలోనే పూర్తి చేస్తమన్నారు,ఎమ్మెల్సీ వాణి ను మా ఆఫీస్ కి రమ్మని చెప్పి ఆహ్వానించామని ఈ సారి వర్ధంతి కార్యక్రమానికి వంగర రావాలని చెప్పానన్నారు,పీవీ కుమారుడు ప్రభాకర్ రావు కూడా వంగర గ్రామానికి వచ్చి కార్యక్రమాల్లో పాల్గొనాలి ఆహ్వానించా. పీవీ నరసింహారావు కూతురు వారి కొడుకుగా ఈ గ్రామ ప్రేమ ఆప్యాయతలు వారికి జ్ఞాపకం ఉన్నాయనీ మంత్రి ప్రభాకర్ అన్నారు, వంగర మా సొంతం అని అక్క చెప్పడం సంతోషమన్నారు,

### పీవీ స్మారకం పూర్తి చేస్తాం

ఈ ప్రాంతంలో మంచి వాతావరణం ఉండేలా టెక్నాలజీ ,ఎడ్యుకేషన్ , రూరల్ డెవలప్మెంట్, సాంస్కృతిక శిక్షణ ఇక్కడ జరిగేలా పివి నడయాడిన నేల దీనిని ఉపయోగిస్తే బాగుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు,నవోదయ విద్యాలయాలకు ఆద్యుడు పీవీ నరసింహారావు ,నవోదయ విద్యాలయాన్ని వంగర కి ఇవ్వాలని కేంద్రాన్ని విజ్ఞప్తి చేస్తున్నా హనుమకొండలో నవోదయ విద్యాలయాలు లేవు..ఇక్కడ స్థాపించాలని విజ్ఞప్తి చేస్తున్నా నవోదయ లు స్థాపించిన పీవీ నరసింహారావు స్వగ్రామం లో నవోదయ విద్యాలయాలకు



స్థలం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం ఇక్కడ నవోదయ విద్యాలయం ఇవ్వాలనారు,

### ఇప్పటికే కేంద్ర మంత్రులకు లేఖలు

పీవీ నరసింహారావు చెరువు పై కూర్చొని ఆయన జ్ఞాన సంపద సాధించారు.ఆ చెరువును కూడా అభివృద్ధి చేస్తం.పీవీ గాలి తాకితే మరింత జ్ఞానాన్ని సాధించేలా చేస్తం.పీవీ కుటుంబ సహకారంతో ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తాం.భారత రత్న ఈ ప్రాంతానికి రావడం చాలా పెద్ద గొప్ప .ఆయన నడయాడిన నేల మీద మనం ఇక్కడ ఉండడం గర్వంగా ఉంది .ఆయన అనేక సంస్కరణకు తెచ్చారు .అనేక భాషలు మాట్లాడగలరు.ఆయన స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శంగా ఉండాలి..వారు ఇచ్చిన స్ఫూర్తితో ముందుకు కదులుతా.వారి జ్ఞాపకాలు ఎక్కడెక్కడ మిగిలిన పనులు ఉన్నాయో ముందుకు తీసుకుపోతామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు,

# అల్లు అర్జున్ పై కఠిన చర్యలు తీసుకోండి

## జాతీయ బాలల హక్కుల సంరక్షణ కమిషన్ కు రాచాల ఫిర్యాధు

**న్యూఢిల్లీ వెలుతురు డిసెంబర్ 23:**
హీరో అల్లు అర్జున్ నిర్లక్ష్యం మరియు దుష్ప్రవర్తన కారణంగా బాలల హక్కులతో పాటు వారి సంక్షేమం ప్రమాదంలో పడిందని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జాతీయ బాలల హక్కుల సంరక్షణ కమిషన్ కు బిసి పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సోమవారం న్యూఢిల్లీ జనపథ్ లోని ఎన్ సి పి సి ఆర్ కార్యాలయంలో సభ్య కార్యదర్శిని కలిసి సంధ్య థియేటర్ ఘటనపై ఫిర్యాధు చేశారు. అనంతరం తెలంగాణ భవన్లో మీడియా రాచాల మాట్లాడారు. డిసెంబర్ 4, 2024న హైదరాబాద్లోని సంధ్యా థియేటర్లో జరిగిన పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా థియేటర్ యాజమాన్యం, చిత్ర యూనిట్ తీవ్ర నిర్లక్ష్యం మరియు హీరో దుష్ప్రవర్తన కారణంగా ఒక మహిళ చనిపోవడంతో పాటు ఆమె 8 ఏళ్ల కుమారుడు మాస్టర్ శ్రీ తేజ్ తీవ్రంగా గాయపడ్డారని అవేదన వ్యక్తం చేశారు. క్రౌడ్ మేనేజ్మెంట్ ఆందోళనల కారణంగా అటువంటి సందర్శనలకు వ్యతిరేకంగా పోలీసు ముందస్తు హెచ్చరిక హెచ్చరించినప్పటికీ నటుడు అల్లు అర్జున్ సంధ్య థియేటర్ని సందర్శించడంతో అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారన్నారు. థియేటర్ మేనేజ్మెంట్ తగిన భద్రతను కల్పించడంలో, ప్రేక్షకుల కదలికలను నియంత్రించడంలో తగిన అత్యవసర వైద్య సహాయాన్ని ఏర్పాటు చేయడంలో విఫలమైందని, ఇది తొక్కిసలాటకు దారి తీసిందన్నారు. మృతురాలు శ్రీమతి మొగుడంపల్లి రేవతి 8 ఏళ్ల కుమారుడు మాస్టర్ శ్రీ తేజ్ తీవ్రంగా గాయపడి హైదరాబాద్లోని కిమ్స్ కడిల్స్ హాస్పిటల్లో మెకానికల్ వెంటిలేషన్లో ఉన్నాడని, తీవ్రమైన హైపోక్సియా మరియు మెదడు దెబ్బ తినడంతో



అతని మనుగడపై తీవ్రమైన ఆందోళనలను పెంచుతుందన్నారు. ఈ సంఘటన భారత రాజ్యాంగం మరియు బాలల హక్కులపై ఐక్యరాజ్యసమితి కన్వెన్షన్ కింద హామీ ఇవ్వబడిన జీవితం మరియు భద్రత హక్కుఆరోగ్య హక్కు మరియు హాని నుండి రక్షణ హక్కుల ఉల్లంఘనకు ఉదాహరణగా నిలిచిందన్నారు. ఆర్టికల్ 21 ప్రకారం నిర్లక్ష్యం వల్ల ఒక వ్యక్తి యొక్క భద్రత మరియు జీవితానికి అపాయం కలిగించిందని కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. అత్యవసర సంసిద్ధతను నిర్ధారించడంలో థియేటర్ మరియు ఈవెంట్ నిర్వాహకులు విఫలమయ్యారని, రద్దీగా ఉండే లేదా అసురక్షిత ఉన్న అన్ని వాతావరణంలో మరింత హాని కలిగించే పిల్లల సంక్షేమానికి పబ్లిక్ ఈవెంట్లు తప్పనిసరిగా ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈవెంట్ నిర్వాహకులు, థియేటర్ మేనేజ్మెంట్ మరియు నటుడు అల్లు అర్జున్ ప్రజల భద్రతకు భరోసా ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ఉల్లంఘనలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు మరియు ప్రజా భద్రతకు హాని కలిగించినందుకు ప్రాసిక్యూషన్తో సహా సంఘటనకు బాధ్యులైన అన్ని పార్టీలపై కఠిన చర్యలను సిఫార్సు చేయండని కమిషన్ కు విజ్ఞప్తి చేశారు. మాస్టర్ శ్రీ తేజ్ యొక్క చికిత్స మరియు పునరావాసం కోసం తక్షణ ఆర్థిక మరియు వైద్య సహాయం కోసం ఏర్పాట్లు చేయడంతో పాటు అత్యున్నత స్థాయి సంరక్షణను నిర్ధారించాలని కోరారు. పబ్లిక్ ఈవెంట్ల సమయంలో భద్రత ప్రోటోకాల్ల గురించి పిల్లలకు మరియు వారి కుటుంబాలకు అవగాహన కల్పించడానికి దేశవ్యాప్త ప్రచారాన్ని ప్రారంభించాలన్నారు. ఈ విషాద సంఘటన బహిరంగ కార్యక్రమాల సమయంలో బాలల హక్కులు మరియు భద్రతను కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకోవాల్సిన తక్షణ అవసరాన్ని నొక్కి చెబుతుందని, మాస్టర్ శ్రీ తేజ్ మరియు అతని కుటుంబానికి న్యాయం జరిగేలా మరియు భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండేలా గౌరవనీయమైన కమిషన్ జోక్యం చేసుకోవాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బిసి పొలిటికల్ జెఎసి నాయకులు ఆనంతుల రామ్మూర్తి గౌడ్, బడేసాబ్,రాఘవేందర్ గౌడ్, మహేందర్ నాయుడు, గౌతమ్ శంకర్ గౌడ్,దేవర శివ తదితరులు పాల్గొన్నారు

# డాక్టర్ యాదగిరి కంభంపాటికి పిఆర్ఎస్ఐ జాతీయ అవార్డు అందజేత





**రామన్నపేట వెలుతురు న్యూస్ డిసెంబర్ 23**
హైదరాబాద్ పిఆర్ఎస్ఐ ఛాప్టర్ సెక్రెటరీ డాక్టర్ కంభంపాటి యాదగిరికి నిబద్ధత, అంకితభావంతో సుధీర్ఘ కాలంగా ప్రజా సంబంధాల రంగంలో చేస్తున్న అవిరళ కృషికి గాను ప్రతిష్టాత్మకమైన పిఆర్ఎస్ఐ జాతీయ అవార్డు అందుకున్నారు. హైద్రాబాద్ ఛాప్టర్ పిఆర్ఎస్ఐని బహుముఖంగా విస్తృతీకరించి అభివృద్ధి పరచడంలో ఉత్తమ నాయకత్వంతో కీలక పాత్రను నిర్వహించినందుకు డాక్టర్ యాదగిరిని గుర్తించి ఉత్తమ కార్యదర్శిగా ఈ జాతీయ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ అవార్డును ఆదివారం (డిసెంబర్ 22) రాయ్పూర్లో నిర్వహించిన 46వ పిఆర్ఎస్ఐ ఆల్ ఇండియా కాన్ఫరెన్స్లో డాక్టర్ యాదగిరి అందుకున్నారు. ఈ అవార్డును ఛత్తీస్ ఘడ్ ఉప ముఖ్యమంత్రి అరుణ్ సాహు చేతుల మీదుగా అందుకున్నారు.

హైద్రాబాద్లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్గా, ఇంఛార్జ్ విభాగాధిపతిగా డాక్టర్ యాదగిరి ప్రస్తుతం పని చేస్తున్నారు. నల్లగొండ జిల్లా, చిట్యాల మండలం, నేరడ గ్రామానికి చెందిన డాక్టర్ యాదగిరి అంబేద్కర్ విశ్వవిద్యాలయం జర్నలిజం శాఖలో అధ్యాపకులుగా చేరాక డిగ్రీ, పీజీ స్థాయిలలో జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్, ప్రజా సంబంధాల కోర్సుల ప్రామాణికతను విస్తృత స్థాయిలో పెంచేందుకు ఎంతగానో కృషి చేశారు. యాదగిరి ప్రతిష్టాత్మకమైన పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పిఆర్ ఎస్ఐ) సంస్థకు హైద్రాబాదు ఛాప్టర్ సెక్రెటరీగా రెండు సార్లు ఎన్నికై సేవలందిస్తున్నారు. పబ్లిక్ రిలేషన్స్ వాయిస్ జర్నల్కు సంపాదకవర్గ సభ్యులుగా కూడా వ్యవహరించారు. ప్రస్తుతం అదే పత్రికకు గౌరవ పాత్రికేయులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జర్నలిజం, ప్రజా సంబంధాలపై డాక్టర్ యాదగిరి రాసిన పలు ప్రామాణిక వ్యాసాలు అనేక పత్రికలలో ప్రచురితమయ్యాయి.ఈ కార్యక్రమంలో పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు డాక్టర్ అజిత్ పాతక్, సెక్రటరీ డాక్టర్ పి ఎల్ కే మూర్తి, హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ డాక్టర్ రాము పాల్గొన్నారు. జాతీయ అవార్డు అందుకున్నందుకు యాదగిరిని అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఫ్యాకల్టీ ఆఫ్ సోషల్ సైన్సస్ డీన్ ప్రొఫెసర్ వడ్డాణం శ్రీనివాసరావుతో పాటు ప్రజా సంబంధాల రంగ ప్రముఖులు, జర్నలిజం శాఖల ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు, మిత్రులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## అబ్బగోని శంకరయ్య గౌడ్ కు కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా ఆర్థిక సహాయం



**వెలుతురు, అబ్దుల్లా పూర్ మెట్, డిసెంబర్ 23:**
అబ్దుల్లాపూర్ మెట్ మండలపరిధిలోని బాచారం గ్రామానికి చెందిన గీత కార్మికుడు అబ్బగోని శంకరయ్య గౌడ్ ఇటీవల తాటి చెట్టు పైనుండి పడి మృతి చెందిన సంఘటన జరిగింది. నిరుపేద గీత కుటుంబానికి చెందిన గీత కార్మికుడి సంబంధించిన వివరాలను రంగారెడ్డి జిల్లా బీజేపీ సీనియర్ నాయకుడు మోడెపు యాదగిరి గౌడ్ ద్వారా సమాచారం తెలుసుకున్న కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా ట్రస్టు సభ్యులు, శంకరయ్య గౌడ్ కుటుంబానికి రూ.20 వేల ఆర్థికసాయాన్ని మంజూరు చేశారు, ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీజేపీ సీనియర్ నాయకుడు మోడెపు యాదగిరి గౌడ్ , స్థానిక వాలంటీర్లు నాతి రాఘవేంద్ర, నాతి చంద్ర శేఖర్, నాతి గణేష్ ,గ్రామ గౌడ సంఘం అధ్యక్షులు బొడిగె అంజయ్య చేతులమీదుగా బాధితుని సతీమణి అబ్బగోని నర్సమ్మ కు అందజేశారు. ఈ కార్యక్రమం లో గ్రామ గౌడ సంఘం అధ్యక్షులు బొడిగె అంజయ్య, కల్లెం శ్రీనివాస్ గౌడ్ ఇతరులు పాల్గొని బాధిత కుటుంబానికి సంతాపం వ్యక్తం చేసి, ముందుకి వచ్చి సహాయం చేసినందుకు కానా సంస్థ ని బాచారం గౌడ సంఘం అధ్యక్షులు అభినందించారు.

## ఏంజెల్స్ స్కూల్లో సందడిగా క్రిస్మస్ వేడుకలు...

**వెలుతురు, సిటీ కల్చరల్:**



తిలక్ నగర్ లోని ఏంజెల్స్ ప్రీ ప్రైమ రీ స్కూల్ లో సోమవారం క్రిస్మస్ వే డుకలు కోలాహలంగా జరిగాయి. హ్యాపీ క్రిస్మస్ అంటూ చిన్నారులు వేషదారణ, క్రిస్మస్ పాటలు అందరి ని అలరించాయి. ఈ సందర్భంగా జీసస్ బోధనలు స్కూల్ ప్రిన్సిపాల్ సంతోషి లక్ష్మి వివరించారు. విద్యా ర్థులు ప్రదర్శించిన క్రీస్తు జననం నాటిక, కంఠస్త వ్యాఖ్యలు, అభిన య నృత్యాలు, శాంతా క్లాస్ ప్రద ర్శన అందర్నీ విశేషంగా ఆకర్షించా యి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా య బృందం, విద్యార్థులు పాల్గొన్నా రు.

## ఘనంగా గన్ను రాజశేఖరరెడ్డి జన్మదిన వేడుకలు

**హైదరాబాద్ వెలుతురు న్యూస్ డిసెంబర్ 23:**
ప్రముఖ వ్యాపార వేత్త గన్ను రాజశేఖరరెడ్డి గారి జన్మదిన వేడుకలు సహారా స్టేట్స్ మన్సూరాబాద్ లో సోమవారం ఘనగా నిర్వహించరు. అనంతరం అయన అభిమానులు కేక్ కట్ చేసి, శాలువా,దండతో సన్మానించారు.
ఈ కార్యక్రమం లో రిటైర్డ్ లెక్చరర్ పగిడిమర్రి గురునాథం, డాక్టర్ లింగయ్య గారు ఇంజనీర్ మురళి గౌడ్, విద్యావేత్త ప్రసాద్ సగరపు, బోల్లా శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రమవుతోంది




- ఇచ్చిన హామీ మేరకు మోదీ ప్రభుత్వం 10 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తోంది
- నేటితో 9.25 లక్షల ఉద్యోగాలను భర్తీ చేశాం
- ఈ ఒక్కరోజే దేశవ్యాప్తంగా 71 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేస్తున్నాం
- గతంలో మోదీ 2 కోట్ల ఉద్యోగాలిస్తామంటే హేళన చేశారు
- ఆర్బీఐ నివేదిక ప్రకారం భారత ఆర్థిక వ్యవస్థ 4.66 కోట్ల ఉద్యోగాలను సృష్టించింది
- మాట ఇస్తే నెరవేర్చే ప్రభుత్వం మోదీదే
- మోదీ పాలనలో ఆర్థిక ప్రగతిలో 5వ స్థానానికి చేరుకున్నాం
- 2047 నాటికి మనమే నెంబర్ వన్ కావడం తథ్యం
- నూతన ఉద్యోగులారా.... కేంద్ర పథకాలను, సేవలను విస్తృతంగా జనంలోకి తీసుకెళ్లండి
- హైదరాబాద్ హకీంపేట ఎన్ఐఎస్ఏ అకాడమి 'రోజ్ గార్ మేళా'లో కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి
- తన చేతుల మీదుగా పలువురికి ఉద్యోగ నియామక పత్రాలు అందించిన కేంద్ర మంత్రి

**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 23:**
రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రమవుతోందని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఉద్యోగాల కోసం వేలాది మంది నిరుద్యోగ యువత ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి కోచింగ్ తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను హైదరాబాద్ లోని అశోక్ నగరలో తినతినడికి తిండిలేక పస్తులుంటూ ఒక్కపూట భోజనమే తింటూ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న వాళ్లను ఎంతో మందిని చూశానన్నారు. ఈ తరుణంలో మోదీ ప్రభుత్వం కేంద్ర శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ఎప్పటికప్పుడు భర్తీ చేస్తుండటం హర్షణీయమన్నారు. 10 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని గతంలో ప్రధానమంత్రి మోదీ మాట ఇచ్చారని, దానికి కట్టుబడి నేటి వరకు 'రోజ్ గార్ మేళా' పేరుతో 9.25 లక్షల మందిని నియామక పత్రాలను అందజేశామన్నారు. ఈ ఒక్కరోజే దేశవ్యాప్తంగా 71 వేల మందికి నియామక పత్రాలు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. సోమవారం రోజున హైదరాబాద్ లోని హకీంపేట నేషనల్ ఇండస్ట్రీయల్ అకాడమీలోని అంతరిక్ష కేంద్రం ఆడిటోరియంలో నిర్వహించిన 'రోజ్ గార్ " మేళా కార్యక్రమానికి బండి సంజయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాని కి ఎన్ఐఎస్ఏ డైరెక్టర్ సునీల్ ఇమ్మాన్యూయెల్, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసబాబుతోపాటు పలువురు పోలీస్ ఉన్నతాధికారులు, ఉద్యోగ పత్రాలు అందుకోబోతున్న 300 మందికిపైగా అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి బండి సంజయ్ చేసిన ప్రసంగంలోని ముఖ్యాంశాలు....
సోమవారం రోజున దేశవ్యాప్తంగా 71 వేల మంది నియామక పత్రాలు అందుకునే కార్యక్రమం. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఇష్టమైన కార్యక్రమం రోజ్ గార్ మేళా. ఉద్యోగాల విషయంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ప్రధాని మోదీ గారు. 10 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పారు. 2022 అక్టోబర్ 22న 'ప్రారంభమైన రోజ్ గార్ మేళా' నేటికీ కొనసాగుతోంది. ఇప్పటి వరకు గత 13వ రోజ్ గార్ మేళా ద్వారా 8,54,00 ఉద్యోగాలను భర్తీ చేశారు. నేటితో కలిపి 9 లక్షల 25 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లయింది. ఇగ మిగిలింది 75 వేలు మాత్రమే.



ప్రభుత్వ శాఖల్లో ఖాళీలుంటే.. ఇతర ఉద్యోగులపై భారం పడుతోంది. తద్వారా మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు సేవలందించడం కష్టమైంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు ఏ శాఖలో ఖాళీగా ఉన్నప్పటికీ ఎప్పటికప్పుడు ఆయా పోస్టులను ప్రధానమంత్రి మోదీ ఆధ్వర్యంలో భర్తీ చేస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ ఎప్పటికప్పుడు ఖాళీలను భర్తీ చేసిన దాఖలాల్లేవ్. ఆ ఘనత మోదీకే దక్కుతోంది. వాస్తవానికి ఒక్కో పోస్టుకు భారీ ఎత్తున పోటీ నెలకొంది. ఆ పోటీని తట్టుకుని పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉద్యోగం సాధించిన అభ్యర్థులందరికీ హ్యాట్సాఫ్...
ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో భారత్ ఆర్థిక




ప్రగతిలో అగ్రభాగాన నిలిచేందుకు నిరంతరం క్రుషి చేస్తున్నారు. గతంలో 11వ స్థానంలో ఉన్న భారత్ ను 5వ స్థానంలో నిలిపారు. మరో మూడేళ్లలో 3వ స్థానానికి తీసుకువచ్చే దిశగా పనిచేస్తున్నారు. అట్లాగే భారత్ కు స్వాతంత్ర్యం వచ్చి 2047 నాటికి 100 ఏళ్లు పూర్తి కానున్న సందర్భంగా అప్పటికి అమెరికా, చైనాను అధిగమించి భారత్ ప్రపంచంలోనే నెంబర్ వన్ కావాలన్నదే మోదీ ఆకాంక్ష. మోదీ క్రుషిలో మీరంతా భాగస్వాములు కావాలని కోరుకుంటున్నా.గతంలో మోదీ 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటిస్తే.... ప్రతిపక్షాలు హేళన చేశాయి. కానీ ఆర్బీఐ నివేదిక ప్రకారం భారత్ ఆర్థిక వ్యవస్థ 4 కోట్ల 66 లక్షల ఉద్యోగాలను స్రుష్టించినట్లు ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. మట ఇస్తే నెరవేర్చే ప్రభుత్వం నరేంద్రమోదీదే. గతంలో క్రమం తప్పకుండా వివిధ శాఖల్లోని ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేసిన దాఖల్లేవు. ఆ ఘనత మోదీకే దక్కుతోంది.కరోనా హయాంలో అమెరికాసహా ప్రపంచమంతా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతే ఆత్మ నిర్భర్ ప్యాకేజీతో భారత్ ను ఆర్థికంగా స్థిరంగా ఉంచిన ఘనత మోదీ ప్రభుత్వానిదే. మోదీ హయాంలో ఉద్యోగాలు కోరుకునే స్థాయి నుండి ఉద్యోగాలు కల్పించే స్థాయికి తీసుకొస్తున్నారు. అందులో భాగంగానే స్టాండప్ ఇండియా, స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా వంటి ఎన్నో కార్యక్రమాలను అమలు చేశారు.పేదలకు బ్యాంకు ఖాతాలు లేని పరిస్థితుల్లో 'జన్ ధన్ ఖాతా'లను జీరో బ్యాలెన్స్ తో ప్రారంభిస్తామని చెబితే ప్రతిపక్షాలన్నీ హేళన చేశాయి. ఈరోజు దేశంలో బ్యాంకు ఖాతా లేని ప్రతి ఒక్కరికి జన్ ధన్ ఖాతాను ప్రారంభించి నయాపైసా అవినీతికి తావులేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ది నగదును నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఒకనాడు నిత్యావసర వస్తువులు సహా అనేక వస్తువులను భారత్ దిగుమతి చేసుకునేది. మోదీ హయాంలో బియ్యం, నిత్యావసర వస్తువులుసహా అనేక ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి తీసుకొచ్చారు. ఇకపై దేశంలోని ప్రతి ఒక్కరూ లక్ష్యం నిర్దేశించుకుని ఆ దిశగా పనిచేయాలని కోరుతున్నా. ముఖ్యంగా ఆరోజు నియామక పత్రాలు అందుకోబోతున్న 71 వేల మంది అభ్యర్థులు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలుగా మారబోతున్నారు. వారంతా చిత్తశుద్ధి మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలి. మారుమూల ప్రాంతాలకు సేవలు విస్తరించేందుకు క్రుషి చేయాలి. తద్వారా శక్తివంతమైన భారత్ గా అవతరించి విశ్వగురుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకోవాలి. మోదీకి విజన్ అమోఘం. 1999లోనే అమెరికా వెళ్లినప్పుడు అక్కడున్న మీడియాతో మాట్లాడుతూ 'ఈ దేశంలోని ప్రవాస భారతీయులంతా ఒక్కొక్కరు మరో ఐదుగురికి ఇండియాలో పర్యటించేలా చేయండి. వారు ఇండియాలో పర్యటించడం ద్వారా వారంతా ఇండియాకు రావడం ద్వారా పర్యాటక అభివృద్ధితోపాటు మన దేశ ఉత్పత్తులను కొనే అవకాశముంది. తద్వారా భారత ఆర్థిక వ్యవస్థ మెరుగుపడే అవకాశం ఉంది."అని పేర్కొన్నారు. అంతటి విజన్ ఉన్న మోదీ ఆధ్వర్యంలో భారత్ కచ్చితంగా ప్రపంచంలోనే నెంబర్ వన్ స్థాయికి చేరుకోవడం తథ్యం. గతంలో పోస్టల్ ఉద్యోగులు సమ్మె చేయడంవల్ల కొత్తగా ఉద్యోగాలు పొందిన 1200 మంది తెలంగాణ ఉద్యోగులు సస్పెన్షన్ కు గురయ్యారు. సంబంధం లేని అంశంలో సమ్మె చేయడంతో వారు ఉద్యోగాలు కోల్పోయారు. ఈ విషయంపై తాను ప్రధానమంత్రి మోదీతోపాటు సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి వారిపై సస్పెన్షన్ ఎత్తివేయించాం. దయచేసి ఉద్యోగులంతా సంబంధం లేని అంశాలపై సమ్మె చేసి మీ జీవితాలను ఇబ్బందుల్లోకి నెట్టుకోవద్దని సూచిస్తున్నా. కొత్తగా ఉద్యోగంలో చేరబోతున్న ఉద్యోగులంతా సంబంధం లేని అంశాలపైనో, ఇతరులు చెప్పారనో లేనిపోని సమ్మెలు చేసి ఇబ్బంది పడొద్దు. మీకు ఏదైనా సమస్య ఉంటే మీ పై అధికారులు, మా దృష్టికి తీసుకరండి. ఎందుకంటే రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్య తీవ్ర స్థాయిలో పెరుగుతోంది. నిరుద్యోగులు ఏళ్ల తరబడి కోచింగ్ తీసుకుంటూ తిండికి లేక ఇబ్బంది పడుతున్నారు. నేను హైదరాబాద్ లోని అశోక్ నగర్ లోని అనేక కోచింగ్ సెంటర్లు, లైబ్రరీలకు వెళ్లినప్పుడు తిండికి పైసల్లేక పస్తులుంటూ చదువుకుంటున్న వేల మంది నిరుద్యోగులు నా కళ్ల ముందు తారసపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం క్రమం తప్పకుండా ఉద్యోగాలను భర్తీ చేయడంలో విఫలమవుతోం ది. గత పాలకులు పేపర్ లీకుల పేరుతో పరీక్షలను ఏళ్ల తరబడి వాయిదా వేసింది. నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం నిరంతరం క్రమం తప్పకుండా ఉద్యోగాలను భర్తీ చేస్తూ నిరుద్యోగ సమస్యను తగ్గిస్తోంది. దీంతోపాటు స్వయం ఉపాధి కల్పించడం, ప్రైవేట్ రంగంలో అనేక ఉద్యోగ అవకాశాలను కల్పిస్తోంది. ఈ సందర్భంగా కొత్తగా కేంద్ర ఉద్యోగులుగా మారబోతున్న ఉద్యోగులంతా కష్టపడి పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని కోరుతున్నా...







## పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేయాలి

### మంత్రుల నివాసంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారిని కలిసి విజ్ఞప్తి చేసిన బీసీ నేత లింగంగౌడ్

**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 23:**
పెండింగ్ లో ఉన్న ఫీజు రీయంబర్స్మెంట్ విడుదల చేయాలని కోరుతూ సోమవారం రోజున మంత్రుల నివాస ప్రాంగణంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారిని విజ్ఞప్తి చేసినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం సకాలంలో విద్యార్థులకు ఫీజు రీయంబర్స్మెంట్ అందించలేకపోవడంతో నాలుగు సంవత్సరాలుగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కోర్సులు పూర్తి అయిన విద్యార్థులు సర్టిఫికెట్స్ కోసం వెళితే ఫీజులు మొత్తం చెల్లిస్తేనే ఒరిజినల్ ధ్రువపత్రాలు ఇస్తామని కాలేజీ యాజమాన్యాలు ఖరాఖండిగా చెపుతున్నాయని లింగంగౌడ్ అన్నారు. విద్యార్థుల భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకొని పూర్తి ఫీజులు చెల్లించి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. కాలేజీ యాజమాన్యాలు కూడా పూర్తి ఫీజులు చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతి ఇస్థామని హాల్ టికెట్లు ఆపడం సరికాదు. ఈ కార్యక్రమంలో రమేశ్ టిల్లు పాల్గొన్నారు

# జూన్ 12కల్లా 1.18 లక్షల టిడ్కో గృహాలు పూర్తి

- టిడ్కోగృహాలను పూర్తికి రూ.102 కోట్ల చెల్లింపు
- అమరావతి జోన్-7,10 లే అవుట్ల రోడ్ల నిర్మాణం
- రూ.2,723 కోట్లతో అమరావతి పనులకు సిఎం ఆమోదం
- సిఆర్‌డిఎ సమావేశ వివరాలు వెల్లడించిన మంత్రినారాయణ



**అమరావతి,డిసెంబర్23( వెలుతురు):**
రాజధాని అమరావతిలో మరో రూ.2,723 కోట్లతో నిర్మాణ పనులకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. జూన్ 12 నాటికి 1.18 లక్షల టిడ్కో ఇళ్లు పూర్తి చేసి ప్రారంభించాలని ఆదేశించారు. సచివాలయంలో జరిగిన సీఆర్డీఏ 44వ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఎల్పీఎస్ జోన్ 7, జోన్ 10లో మౌలిక వసతుల కల్పనకు నిర్ణయం తీసుకున్నారు. రాజధాని ఔటర్ రింగ్‌రోడ్డు, విజయవాడ బైపాస్ రోడ్డు ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు చర్చించారు. ఇప్పటి వరకు రూ.47,288 కోట్ల విలువైన పనులకు సీఆర్డీఏ ఆమోదం తెలిపింది. మూడు సంవత్సరాల్లో అమరావతి రాజధాని అభివృద్ధి పనులను పూర్తి చేస్తాం అన్నారు. జధాని అభివృద్ధికి అయ్యే వ్యయా భారాన్ని ప్రజలపై ఒక్క పైసా కూడా వేయం అన్నారు. రాజధాని భూములు అమ్మగా వచ్చే సొమ్మునే రుణాలు తీర్చేందుకు ఉపయోగిస్తాం అన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాలను సమానం అభివృద్ధి పర్చేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలన ఇనిర్ణయించారు. సమావేశానంతరం వివరాలను మంత్రి నారాయణ వెల్లడించారు. వచ్చే ఏడాది జూన్ 12 వ తేదీ కల్లా 1.18 లక్షల టిడ్కో గృహ నిర్మాణాలను పూర్తి చేసి, ప్రారంభిస్తామని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అధ్యక్షతన 44 వ సీఆర్డిఏ సమావేశం రాష్ట్ర సచివాలయంలో జరిగిందని, ఈ సమావేశంలో రాజధాని అమరావతి అభివృద్ధి పనులకు ,టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి పలు నిర్ణయాలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఇప్పటికే బ్యాంకు రుణాలు తీసుకుని నాన్ పెర్ఫార్మింగ్ ఎస్సెట్స్ గా మిగిలి పోయిన టిడ్కో గృహాలను పూర్తి చేయడానికి రూ.102 కోట్లను చెల్లించేందుకు ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆమోదం తెల్పారన్నారు. 2014-19 మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వంచే 7,01,481 టిడ్కో గృహాలను మంజూరు చేయించి, వాటిలో 5.00 లక్షల గృహాలకు పరిపాలనాపరమైన అనుమతులను కూడా మంజూరు చేయడం జరిగిందన్నారు. వాటిలో 4,54,706 గృహాలను గ్రౌండ్ చేయడం జరిగింది. అందులో 2019 నాటి 3,13,832 గృహ నిర్మాణాలను ప్రారంభించడం జరిగింది. ప్రతి యూనిట్ నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి మొత్తం రూ.3.90 లక్షలు ఇచ్చేందుకు నిర్ణయించగా, అందులో రూ.1.90 లక్షలు కేంద్ర ప్రభుత్వం, మిగిలిన సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చేలా నిర్ణయించడం జరిగిందన్నారు. అదే విధంగా లబ్దిదారుని వాటగా చెల్లించాల్సిన సొమ్మును బ్యాంకు రుణంగా ఇప్పించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. కానీ గత ప్రభుత్వం అదికారంలోకి వచ్చి ఈ పక్రియను అంతా గందరగోళం చేయడం జరిగిందన్నారు. తమ ప్రభుత్వం టెండర్లు పిలిచి నిర్మాణానికి చేపట్టిన 4,54,706 గృహాలలో కేవలం 2,61,640 గృహాలను మాత్రమే గత ప్రభుత్వం చేపట్టి మిగిలిన వాటిని రద్దు చేయడం జరిగిందన్నారు. ఆ చేపట్టిన గృహాలను కూడా గత ప్రభుత్వం పూర్తి చేయలేదన్నారు. ఈ గృహాలలో దాదాపు 77 వేల గృహాలను తమ ప్రభుత్వమే పూర్తి చేయడం జరిగిందన్నారు. లబ్దిదారులకు మంజూరు చేసిన గృహాలపై గత ప్రభుత్వం బ్యాంకు ఋణాలను తీసుకుని, ఆ సొమ్మును డైవర్టు చేయడం జరిగిందన్నారు. ఫలితంగా ఆయా గృహాలు నాన్ పెర్ఫార్మింగ్ ఎస్సెట్లుగా మిగిలిపోయాయన్నారు. ఈ సమస్య నుండి బయట పడాలంటే రూ.102 కోట్లు చెల్లించాల్సి ఉంది, ఆ సొమ్మును ప్రభుత్వం చెల్లించేందుకు ముఖ్యమంత్రి ఆమోదం తెల్పారన్నారు. వీటిలో దాదాపు 1.18 లక్షల గృహ నిర్మాణాలను వచ్చే ఏడాది జూన్ 12 కల్లా పూర్తిచేసి ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు.రాష్ట్ర రాజధాని అమరావతి జోన్-7, 10 లే అవుట్ల రోడ్ల నిర్మాణ పనులను రూ.2,723 కోట్లతో చేపట్టేందుకు సీఆర్డీఏ ఆమోదం తెల్పినట్లు మంత్రి తెలిపారు. రాజధాని అమరావతి అభివృద్ధికై ఇప్పటి వరకూ రూ.47,288 కోట్ల విలువైన పనులకు సీఆర్డీఏ సమావేశంలో ఆమోదం తెల్పడం జరిగిందన్నారు. మిగిలిన అభివృద్ధి పనుల్లో కొన్నింటికి ఈ నెలాఖరు లోపు, మిగిలిన వాటికి వచ్చేనెలలోపు ఆమోదం తెల్పి, వచ్చే నెల 15 వ తేదీలోగా అన్ని పనులకు టెండర్లు పిలిసి పనులను చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఏ దేశానికైనా, రాష్ట్రానికి కైన ఒక రాజధాని తప్పని సరిగా ఉంటుందని, అదే విధంగా అంధ్రప్రదేశ్ కు అమరావతిని రాజధానిగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతిని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి పర్చేందుకు తమ ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరుగుచున్నదన్నారు. అందులో భాగంగా రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధికి అయ్యే వ్యయా భారాన్ని ప్రజలపై ఒక్క పైసా కూడా వేయడం లేదని మంత్రి స్పష్టం చేశారు. పూలింగ్ ద్వారా రైతుల నుండి సేకరించిన భూములు అమ్మగా వచ్చే సొమ్ముతోనే అమరావతి అభివృద్ధికై తీసుకున్న రుణాలు తీర్చేందుకు చర్యలు చేపట్టడం జరుగుచున్నదన్నారు. ఈ విషయంలో ఎటువంట అపోహలకు తావులేదని, ఎవరు ఎటు వంటి వివర్శలు చేసిన ప్రజలు నమ్మవద్దని ఆయన కోరారు. రాష్ట్రంలోని 26 జిల్లాలను సమానం అభివృద్ధి పర్చేందుకు 2014-19 మధ్య కాలంలోనే తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్ర పునర్విభజనలో భాగంగా రాష్ట్రానికి వచ్చిన పలు కేంద్ర సంస్థలను సమానంగా అన్ని జిల్లాలకు కేటాయించడం జరిగిందన్నారు.

# భోగాపురం విమానాశ్రయ పనుల్లో వేగం

- అధికారులకు సిఎస్ ఆదేశం

**అమరావతి,డిసెంబర్23( వెలుతురు):**
భోగాపురం అంతర్జాతీయ నిర్మాణ పనులను నిర్ధిష్ట కాలపరిమితికి లోబడి సకాలంలో పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సంబంధిత శాఖలు,ఏజెన్సీలకు సూచించారు.ఈమేరకు సోమవారం రాష్ట్ర సచివాలయం నుండి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి సంబంధించిన మొదటి కోఆర్డినేషన్ కమిటీ సమావేశం సిఎస్ నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన ఈఅంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులను వేగవంతంగా సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.విమానాశ్రయ నిర్మాణంతో పాటు అక్కడ వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థలు,ఏజెన్సీల ద్వారా ఏర్పాటు చేయాల్సిన ఏర్పాట్లను కూడా సిఎస్ సమీక్షించారు.ముఖ్యంగా కస్టమ్స్,బ్యూరో ఇమిగ్రేషన్,సిఐఎస్‌ఎఫ్ భద్రత,ఆరోగ్య తదితర శాఖల పరంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు.అదే విధంగా విశాఖపట్నం నగరం నుండి భోగాపురం విమానాశ్రయానికి మెరుగైన కనక్టవిటీ తదితర అంశాలపై కూడా సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు.
ఈసమావేశంలో కార్యదర్శి డా.ఎన్.యువరాజ్,ఎపి మారిటైం బోర్డు సిఇఓ ప్రవీణ్ ఆదిత్య పాల్గొన్నారు.అలాగే వర్చువల్ గా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ సంస్థల ప్రతినిధులు,పౌర విమానయాన సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రవాణాశాఖ ద్వారా సులభతర సేవలు

- మార్కెట్ యార్డ్ ప్రాంతంలో రవాణాశాఖ విభాగం
- ప్రారంభించిన మంత్రి సత్యకుమార్ యాదవ్

**పుట్టపర్తి,డిసెంబర్23( వెలుతురు ):**
ప్రజలకు రవాణా శాఖ ద్వారా సేవలన్నీ సులభతరంగా అందించాలన్న ధ్యేయంతో ధర్మవరం మార్కెట్ యార్డ్ ప్రాంతంలో రవాణా శాఖ విభాగంను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం వైద్య విద్య శాఖల మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ తెలిపారు. ధర్మవరం మార్కెట్ యార్డులో రవాణా శాఖ ఏర్పాటుచేసిన ఆ÷-లనైన్ సేవలను మంత్రి ప్రారంభించారు. జిల్లా రవాణా శాఖ అధికారి కరుణాసాగర్, కదిరి ఎం .వి.ఐ వరప్రసాద్ , ధర్మవరం ఎం.వి.ఐ రాణి, ఆర్డీవో మహేష్ ధర్మవరం తెలుగుదేశం ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ , రాష్ట్ర జనసేన నాయకులు చిలక మధుసూదన్ రెడ్డి , ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, పలువురు ప్రజా ప్రతినిధులు మహిళలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వాహనాల కు సంబంధించి లైసెన్సు, రిజిస్ట్రేషన్, ఎల్ ఎల్ ఆర్, ఫిట్నెస్, పర్మిట్లు మంజూరు తదితర సర్టిఫికెట్లను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. గతంలో ప్రజలు రవాణా శాఖ ద్వారా సేవలు పొందాలంటే హిందూపురం ,అనంతపురం, కదిరి ప్రాంతాలకు వెళ్లే వారిని ప్రస్తుతం 90 కిలోమీటర్ల వరకు ప్రయాణించే శ్రమను తగ్గించి ప్రస్తుతం తాత్కాలికంగా రవాణా శాఖ కార్యాలయం ఏర్పాటుకు రాష్ట్ర గౌరవం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి , రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సహకారాలతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలు అవసరమైన మేరకు రవాణా శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు కనీస అవసరాలు కూడా తీర్చలేదని కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల కాలంలో అనేక పరిపాలన నిర్మాణాత్మకమైన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతున్నదని మంత్రి పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో శాశ్వత రవాణా శాఖ కార్యాలయం ఏర్పాటు చేయుటకు ఆర్డిఓ మరియు రవాణా శాఖ అధికారి ద్వారా భూసేకరణకు సంబంధించి ప్రతిపాదన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో కొన్ని దశాబ్దాల కాలంగా రవాణా శాఖ కార్యాలయం లేని కారణంగా ప్రజల సమస్యలను గుర్తించి



ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని మంత్రి తెలిపారు. ధర్మవరం నియోజకవర్గంలోని బత్తలపల్లి, తాడిమర్రి ధర్మవరం పట్టణంతోపాటు రాప్తాడు నియోజకవర్గం లోని రామగిరి, సి.కే.పల్లి, కనుగానపల్లి మండల ప్రజానీకానికి కూడా ప్రమాణ శాఖ సేవలు అందించడం జరుగుతుందన్నారు. అందువల్ల ఈ ఆరు మండలాలకు సంబంధించిన ప్రజలు ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి తెలిపారు. అంతేగాక చెరువులకు నీరు పటలకు సాగునీరు జలజీవన్ మిషన్ పనులు తదితర కార్యక్రమాలకు కోట్లాది రూపాయలు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని మరి ముఖ్యంగా పట్టణ గ్రామాలలో గుంతలు లేకుండా రహదారుల నిర్మాణం కోసం సుమారు రూ.26 వేల కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి నీరు అందించే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవ తీసుకొని సుమారు రూ. 70 వేల కోట్ల రూపాయల ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించినట్లు మంత్రి తెలిపారు. రానున్న రోజుల్లో పెట్రోల్ ,డీజిల్ ఆదా చేసే క్రమంలో ఎలక్ట్రానిక్ వాహనాలు కూడా ప్రభుత్వం ద్వారా వాడుకలో రానున్నాయని మంత్రి తెలిపారు.

# చంద్రబాబుతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీల అభివృద్ధి

- ఉమ్మడి అనంతజిల్లాలో ఎస్సీ హాస్టళ్లకు రూ.11.56 కోట్లు
- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామికి ధన్యవాదాలు తెలిపిన సవిత

**అమరావతి,డిసెంబర్23( వెలుతురు):**
సీఎం చంద్రబాబునాయుడు పాలనలో ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు అభివృద్ధికి ప్రాధాన్యం లభిస్తుంటుందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్ల అభివృద్ధికి రూ.11.56 కోట్లు మంజూరు చేయడంపై ఆ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామికి మంత్రి ఎస్.సవిత ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు సోమవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలమంలో మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామిని ఆయన కార్యాలయంలో మంత్రి సవిత మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్ల మరమ్మతులకు రూ.11. 56 కోట్లను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల



నిధులు కూడా మంజూరు చేయలేదన్నారు. చివరికి విద్యార్థులకు ఇవ్వాల్సిన డైట్, కాస్మోటిక్ బిల్లులను కూడా చెల్లించలేదన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాగానే హాస్టళ్ల మరమ్మతులకు, విద్యార్థుల డైట్, కాస్మోటిక్ బిల్లులను కూడా చెల్లించిన విషయాన్ని మంత్రి సవిత తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ బిడ్డల విద్యకు, అభివృద్ధికి చంద్రబాబు ప్రభుత్వం

చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రి డోలా వీరాంజనేయులను కలిసి ధన్యవాదాలు తెలిపారు. గత జగన్ ప్రభుత్వం ఎస్టీ, బీసీ, గిరిజన సంక్షేమ శాఖల హాస్టళ్లను గాలికొదిలేసిందన్నారు. నా ఎస్సీలు...నా ఎస్టీలు...నా బీసీలు...అంటూ బడుగు బలహీన వర్గాల వారిని జగన్ ఓటు బ్యాంకుగా చూశారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ బిడ్డలు చదువు కోవడం జగన్ కు ఇష్టంలేదన్నారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టళ్లను పట్టించుకోలేదన్నారు. చిన్న చిన్న మరమ్మతులకు

అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. బీసీ సంక్షేమ హాస్టళ్ల మరమ్మతులతో పాటు విద్యార్థుల డైట్ బిల్లులను కూడా చంద్రబాబు ప్రభుత్వం మంజూరు విషయాన్ని మంత్రి డోలా బాల వీరాంజనేయులకు మంత్రి సవిత తెలిపారు. అనంతపురం ఉమ్మడి జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్ల మరమ్మతులకు నిధుల మంజూరు చేసినందకు ధన్యవాదాలు తెలుపుతూ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామిని మంత్రి సవిత సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీసీలకు తిరిగి 34 శాతం రిజర్వేషన్లకు నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి..)

లబ్ధి జరిగేందుకు పలు కార్యక్రమాలు చేపట్టాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగా బీసీల కోసం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష చేశారు. బీసీల రక్షణ కోసం ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు కూటమి ప్రభుత్వం మంత్రుల కమిటీని ఏర్పాటు చేసింది. మంత్రుల కమిటీ ప్రాథమికంగా ఇచ్చిన సూచనలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మరికొంత కసరత్తు తరువాత...సాంకేతిక, న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఈ చట్టాన్ని తీసుకురావాలని సీఎం అధికారులకు సూచించారు. అదే విధంగా నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్న హామీకి కట్టుబడి ఉన్నామని....దీనికి కూడా చట్టబద్ధత తెస్తామని సీఎం తెలిపారు. దీనిపై రానున్న రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని సీఎం అన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా బీసీలు స్థానిక సంస్థల్లో 34 శాతంగా ఉన్న రిజర్లేషన్లను కోల్పోయారని, రిజర్వేషన్లు 34 శాతం నుంచి 24 శాతానికి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు తగ్గడంతో బీసీలు 16,500 పదవులకు దూరమయ్యారన్నారు. వీటిని పునరుద్ధరించేందుకు న్యాయపరమైన సమస్యల పరిష్కారంపై సీఎం సమీక్షలో చర్చించారు. న్యాయపరంగా తిరిగి 34 శాతం రిజర్వేషన్లు పొందడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. కోర్టు తీర్పులు పరిశీలించి.....న్యాయ పరంగా ముందుకెళ్లాలని సీఎం అధికారులకు సూచించారు.సంక్షేమ హాస్టళ్లలో వసతుల కల్పనబీసీ సంక్షేమ హాస్టళ్లలో వసతుల కల్పనపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. బాలికల హాస్టళ్లు తక్షణమే మరమ్మతులు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రంలో మొత్తం 1,110 బీసీ విద్యార్థుల హాస్టళ్లు ఉన్నాయి. వాటిల్లో బాలురు 58022 మంది, బాలికలు 37794 మంది ఉంటున్నారు. ప్రభుత్వ భవనాలు 660 ఉండగా, అ÷-దదె భవనాలు 450 ఉన్నాయి. గత ప్రభుత్వం పెట్టిన రూ.110.52 కోట్ల డైట్ బిల్లుల్లో రూ.76.38 కోట్లు కూటమి ప్రభుత్వం చెల్లించగా రూ.34.14 కోట్లు పెండింగులో ఉన్నాయి...వాటిని కూడా చెల్లించాలని ఆదేశించారు. 2024-25 సంవత్సర బ్జడెట్‌లో ప్రభుత్వం రూ.135 కోట్లు కేటాయించింది. ఆగస్టు నాటికి కాస్మోటిక్ బిల్లులు కూడా రూ.20 కోట్లు పెండింగులో ఉండగా కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.7.10 కోట్లు చెల్లించింది. విద్యార్థుల ట్రంక్ బాక్సులు, ఇతర వస్తువులకుగాను ప్రభుత్వం బ్జడెట్ లో రూ.18 కోట్లు కేటాయించింది. వీటిని త్వరలోనే ప్రభుత్వం కొనుగోలు చేసి విద్యార్థులకు అందించనుంది. డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీల చెల్లింపు, ట్యూటర్ ఫీజు, హాస్టళ్ల మైనర్ రిపేర్లను వెంటనే పూర్తి చెయ్యాలని సీఎం ఆదేశించారు. 13 బీసీ స్టడీ సర్కిళ్లను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం రూ.10 కోట్లను మంజూరు చేసి 5720 మంది డీఎస్సీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ అందించారు. త్వరలోనే ఆన్ లైన్ తరగతులు కూడా చేపట్టనున్నారు. సివిల్స్ కు ఏటా 100 మందికి శిక్షణ ఇచ్చేందుకు స్టడీ సర్కిల్‌ను ప్రభుత్వం ప్రారంభించింది. సీఆర్డీఏ పరిధిలో 5 ఎకరాలను సివిల్ సర్వీస్ కోచింగ్ భవనం నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయించనుంది. దీని కోసం ఇప్పటికే భవనానికి సంబంధించిన డీపీఆర్ సిద్ధం కాగా..500 మందికి శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక సిద్ధం చేసింది. 2014-19 మధ్య విదేశాల్లో చదువుకున్న బీసీ విద్యార్థులకు రూ.81.65 కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే గత ప్రభుత్వం నిధులు చెల్లించకుండా బకాయిలు పెట్టింది. వీటి కోసం 2024-25 బ్జడెట్ లో రూ.36.11 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఉమ్మడి జిల్లాల్లో 13 బీసీ భవనాల నిర్మాణాలకు 2016-17లో నాటి టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో 3 భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. ఒక్కో భవనం పూర్తికి రూ.5 కోట్లు ఖర్చు కానుండగా పెరిగిన ఖర్చుల నేపథ్యంలో రూ.10 కోట్లు కేటాయించాలని బీసీ నేతలు కోరుతున్నట్లు సమీక్షలో చర్చించారు. అయితే ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మూడు బీసి భవనాలు త్వరితగతిన పూర్తి చెయ్యాలని సీఎం ఆదేశించారు. మిగిలిన భవనాల నిర్మాణానికి ఇతర జిల్లాల్లో భూసేకరణ పూర్తి చెయ్యాలని ముఖ్యమంత్రి చెప్పారు. బీసీల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు బ్జడెట్ లో రూ.896.79 కోట్లు కేటాయిచింది. రుణాల మంజూరుకు సంబంధించి యాక్షన్ ఎ÷-లాన్ సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. గొర్రెల పెంపకం దారులకు అందించాల్సిన చేయూతపైనా సమీక్షలో చర్చ జరిగింది. అదే విధంగా గత తెలుగుదేశం హయాంలో 13 జిల్లాల్లో కాపు భవన్‌ల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో భవనానికి రూ. 2 కోట్ల చొప్పున కేటాయించేందుకు నిర్ణయించింది. అయితే వీటిలో 4 భవనాల నిర్మాణం ప్రారంభం కాగా గత ప్రభుత్వం వీటిని పట్టించుకోలేదు. నిలిచిపోయిన 4 కాపు భవనాలను కూడా పూర్తి చేసేందుకు అవసరమైన రూ.5.40 కోట్ల విడుదలకు సీఎం అంగీకారం తెలిపారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఏపీ బ్రాహ్మిణ్ కో-ఆపరేటివ్ ÷నాన్స్ సొసైటీ ఏర్పాటు ద్వారా మంచి ఫలితాలు వచ్చాయని అధికారులు వివరించగా....ప్రతి సామాజిక వర్గానికి ఇలా కో-ఆపరేటివ్ ÷నాన్స్ సొసైటీ ఏర్పాటు చేసి ఆయా వర్గాలను బలోపేతం చేసేందుకు పని చేయాలని సీఎం సూచించారు. ప్రతి సామాజికవర్గంలో ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్న వాళ్లు తమ వర్గానికి ఎంతో కొంత సాయం చెయ్యాలని చూస్తున్నారని...ఇలాంటి వారిని ప్రోత్సహించి ఆర్థికంగా ఆయా సామాజిక వర్గాల్లో ఉన్న పేదలను పైకి తెచ్చేందుకు ప్రయత్నం చేయాలని సీఎం సూచించారు.ఎస్‌ఆర్ శంకరన్ నాలెడ్జ్ సెంటర్లురాష్ట్రంలో త్వరలో ఎస్ఆర్ శంకరన్ నాలెడ్జ్ సెంటర్లను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. స్కిల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా స్పోకెన్ ఇంగ్లీష్, సోషల్ ఎమోషనల్ స్కిల్స్, నైతిక విలువలు, నీతిశాస్త్రం, డిజిటల్ లిటరసీ, లీగల్ అవేర్నెస్ వంటివి ఈ సెంటర్ల ద్వారా విద్యార్థులకు అందించనున్నారు. 26 జిల్లాల్లోని 104 బీసీ హాస్టళ్లలో పైలట్ ప్రాజెక్టులుగా దీన్ని అమలు చేయనున్నారు. త్వరలోనే ఈ సెంటర్లను ప్రభుత్వం బీసీ విద్యార్థుల కోసం అందుబాటులోకి తీసుకురానుంది. సామాజిక పింఛన్ల తనిఖీ జరపండి..అర్హులకే పింఛన్లు అందాలిసమీక్షలో సామాజిక పింఛన్ల పంపిణీ అంశంపైనా చర్చ జరిగింది. రాష్ట్రంలో దివ్యాంగులకు ఇచ్చే పింఛన్లలో అనేక మంది అనర్హులు ఉన్నారని చర్చ జరుగుతోంది. ఎమ్మెల్యేలతో పాటు..అధికారుల నివేదికల్లో కూడా ఇదే అంశం స్పష్టం అవుతోంది. దీంతో పింఛన్ల తనిఖీ చేపట్టారు. దీనిపై సీఎం మాట్లాడుతూ....అర్హులకు అందరికీ పింఛన్లు, పథకాలు అందాలన్నది తమ ఉద్దేశమని...ఇదే సమయంలో అనర్హులకు ఫించన్లు ఇవ్వడం సరికాదని అన్నారు. ఎవరు అర్హులు, ఎవరు అనర్హులు అనే విషయం తేలాలంటే నిర్ధిష్టమైన నిబంధనలు అమలవ్వాలన్నారు. అనర్హులను తొలగించేందుకు పూర్తి స్థాయిలో పింఛన్ల తనిఖీ చేపట్టాలన్నారు. పింఛన్ల తనిఖీ కార్యక్రమాన్ని కొందరు పింఛన్ల తొలగింపు అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని...దీనిపై అర్హులైన వారు ఆందోళన పడాల్సిన పనిలేదని సీఎం భరోసా ఇచ్చారు. అర్హులకే సాయమనేది తమ విధానమని సీఎం చెప్పారు. మూడునెలల్లో దివ్యాంగుల పింఛన్లపై తనిఖీలు పూర్తి చెయ్యాలని...తప్పుడు సర్టిఫికెట్ ఇచ్చే డాక్టర్లు, అధికారులు, సిబ్బందిపై చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు. ఒక సారి తప్పుడు సర్టిఫికెట్ ఇస్తే....ఎప్పటికైనా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రూ.15,000 పెన్షన్ తీసుకుంటున్న 24 వేల మంది ఇంటికెళ్లి పరిశీలించాలని..వారు ఇబ్బందులు పడకుండా చూడాలని సీఎం సూచించారు. తప్పుడు సర్టిఫికెట్లతో ప్రభుత్వాన్ని మోసం చేస్తే సహించేది లేదన్నారు. సమీక్షలో మంత్రులు డోలా బాల వీరాంజనేయస్వామి, సవిత, అధికారులు పాల్గొన్నారు.

# ప్రశాంతంతగా న్యూ ఇయర్ వేడుకలు

- హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవు
- రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు




**హైదరాబాద్,డిసెంబర్23(వెలుతురు):** న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు కీలక సూచనలు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన, న్యూ ఇయర్ వేడుకలను సంతోషంగా, ప్రశాంతంగా జరుపుకోవాలని ప్రజలకు సూచించారు. నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ వేడుకలు నిర్వహించాలని, ఉల్లంఘనలకు దిగితే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ ఏడాది రాచకొండ పోలీస్ శాఖ 253 డ్రగ్స్ కేసులు నమోదు చేసిందని, 521 నిందితులను అరెస్ట్ చేయడం ద్వారా రూ. 88 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను సీజ్ చేసినట్లు సుధీర్ బాబు వెల్లడించారు. ఇంకా, 30 మందికి జీవిత ఖైదు విధించడం ద్వారా మాదక ద్రవ్యాల అక్రమ చలామణి నిరోధానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇంకా, లోక్ అదాలత్ ద్వారా 11 వేలకుపైగా కేసులను పరిష్కరించినట్లు పేర్కొంటూ, ప్రజల భద్రత కోసం పోలీసులు కృషి చేస్తుండటాన్ని ఆయన వివరించారు. అంతేకాకుండా.. మోహన్ బాబు ఘటనపై స్పందిస్తూ.. మోహన్ బాబు కేసులో దర్యాప్తు పారదర్శకంగా జరుగుతుందన్నారు. ఎవరికీ ఎలాంటి అనుమానాలు అవసరం లేదని, మోహన్ బాబు వాళ్ళు టైం అడిగారు ఆ టైం తరువాత అవసరమైన చర్యలు చేపడతామన్నారు సీపీ సుధీర్ బాబు. అవసరమైతే మోహన్ బాబుకు మరోసారి నోటీసులు జారీ చేస్తామని, బౌన్సర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదన్నారు. బౌన్సర్లకు ప్రత్యేక గైడ్‌లైన్స్ రూపొందిస్తామని, బౌన్సర్లు తోపులాటలు చేసి భయంకరమైన వాతావరణం క్రియేట్ చేస్తే ఊరుకోమని ఆయన హెచ్చరించారు. విజిబుల్ పోలీసింగ్, క్విక్ రెస్పాన్స్, టెక్నాలజీని ఉపయోగించి క్రైమ్ రేటు తగ్గించామని రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. 2024లో మొత్తం 33,084 కేసులు నమోదయ్యాయని చెప్పారు. కమిషనరేట్ పరిధి నేర వార్షిక నివేదికను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. 'ఈ ఏడాది నమోదైన 33,084 కేసుల్లో 25,143 కేసులు పరిష్కరించాం. 3 షిఫ్టుల్లో పెట్రోలింగ్ ఏర్పాటు చేశాం. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించాం. ఈ ఏడాది రాష్ట్రంలో అత్యధిక కేసులను పరిష్కరించిన కమిషనరేట్‌గా రాచకొండ నిలిచింది. మా పరిధిలో నమోదైన కేసుల్లో 30 మందికి జీవిత ఖైదు శిక్ష పడింది. అందులోనూ అగ్రస్థానంలో నిలిచాం. సంచలనం సృష్టించిన మోటకొండూరు పీఎస్ పరిధిలో 14 మంది నిందితులకు జీవిత ఖైదు పడింది. వివిధ కేసుల్లో 160 మందికి శిక్ష ఖరారైంది. లోక్ అదాలత్‌లో 11,440 కేసులతో పాటు 70,791 పెట్టీ కేసులు పరిష్కారమయ్యాయి. ఈ ఏడాది డయల్ 100 ద్వారా 2,41,742 ఫిర్యాదులు వచ్చాయి. అన్ని విభాగాల్లో కలిపితే క్రైమ్ రేటు 4? మాత్రమే పెరిగింది. గతేడాదితో పోలిస్తే హత్యకేసుల్లో ఎలాంటి మార్పు లేదు. చోరీ కేసులు 6?, డొమెస్టిక్ వయిలెన్స్ కేసులు 23? తగ్గాయి. రూ.88.25 కోట్ల విలువైన డ్రగ్స్‌ను సీజ్ చేశాం. మొత్తం 521 మంది డ్రగ్ నేరస్థులను అరెస్ట్ చేశాం. ఆ నిందితులపై 165 రౌడీషీట్లు ఓపెన్ చేశాం. ఎన్నికల సందర్భంగా రూ.16 కోట్ల నగదు, మద్యం సీజ్ చేశాం. సైబర్ బాధితులకు రూ.22 కోట్లు రిఫండ్ అయ్యేలా చర్యలు చేపట్టాం అన్నారు. కమిషనరేట్ పరిధిలో హద్దు దాటే బౌన్సర్లపై తీవ్ర చర్యలు ఉంటాయి. భయానక వాతావరణాన్ని సృష్టించడంతో పాటు ప్రజలను ఇబ్బందులకు గురిచేసి దురుసుగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## మంచు గుప్పిట్లో జమ్ముకశ్మీర్

- అత్యంత కనిష్టస్థాయికి ఉష్ణోగ్రతలు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 23 (వెలుతురు):** భూతల స్వర్గం జమ్ముకశ్మీర్ మంచు గుప్పిట్లో చిక్కుకుంది. దీంతో పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు అత్యంత కనిష్ట స్థాయికి పడిపోయాయి. కొన్ని ఏరియాల్లో అయితే మైనస్ డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పతనమయ్యాయి. దాంతో అక్కడి సరస్సులు, కొలనుల్లోని నీరు గడ్డకట్టింది. చలి తీవ్రతకు ప్రజలు గజగజ వణికిపోతున్నారు. జమ్ముకశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో మైనస్ డిగ్రీల్లో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కశ్మీర్ వ్యాలీలో కనిష్ట ఉష్ణోగ్రతలు మైనస్ 7 డిగ్రీల సెల్సియస్‌గా గరిష్ఠ ఉష్ణోగ్రతలు 7 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైనట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. అందాల శ్రీనగర్‌లో ఉష్ణోగ్రతలు మైనస్ 4.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. అనంత్‌నాగ్‌లో మైనస్ 10.5 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాబోయే రెండు రోజుల్లో ఉష్ణోగ్రతలు 1 నుంచి 2 డిగ్రీల సెల్సియస్ మేర స్వల్పంగా పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆ తర్వాత డిసెంబర్ 26 వరకు 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ వరకూ తగ్గే అవకాశం ఉందని పేర్కొంది. ఏకాంత ప్రాంతాల్లో చలిగాలులు కొనసాగే అవకాశం ఉందని వెల్లడించింది. ఐఎండీ డేటా ప్రకారం.. షోపియాన్‌లో మైనస్ 10.4 డిగ్రీల సెల్సియస్, పుల్వామాలో మైనస్ 10.3 డిగ్రీల సెల్సియస్, లార్నూలో మైనస్ 9.3 డిగ్రీల సెల్సియస్, ఖుద్వానీలో మైనస్ 9.0 డిగ్రీల సెల్సియస్, సోనామార్గ్‌లో మైనస్ 8.8 డిగ్రీల సెల్సియస్, ప్రసిద్ధ పర్యాటక కేంద్రం పహల్గామ్‌లో కనిష్టంగా మైనస్ 8.6 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బుద్గాం, ఖాజిగుండ్‌లో వరుసగా మైనస్ 8.3 డిగ్రీల సెల్సియస్, మైనస్ 8.2 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉష్ణోగ్రతలు పడిపోవడంతో కశ్మీర్ వ్యాలీ అంతటా చలి తీవ్రత పెరిగింది. అక్కడి సరస్సులు, కొలనుల్లోని నీరు గడ్డకట్టింది. ఉష్ణోగ్రతలు పడిపోవడంతో పర్యాటక ప్రాంతమైన దాల్ సరస్సులో చలి తీవ్రతకు నీరు గడ్డకట్టింది. ఈ చలికి సందర్శకులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మొత్తంగా అందాల శ్రీనగర్ చలి గుప్పిట్లో వణుకుతోంది.

## అల్లుఅర్జున్ ఇంటి దాడిలో కేసులో నిందితులకు బెయిల్ మంజూరు





**హైదరాబాద్, డిసెంబర్ 22 (వెలుతురు):** స్టార్ హీరో అల్లు అర్జున్ ఇంటిపై దాడి కేసులో నిందితులకు కోర్టు బెయిల్ విధించింది. శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి అల్లు అర్జున్‌పై విమర్శలు చేయడం, తన వ్యక్తిత్వంపై దుష్ప్రచారం జరుగుతున్నదని అల్లు అర్జున్ ఆవేదన వ్యక్తం చేసిన నేపథ్యంలో ఆదివారం మరోసారి ఉద్రిక్తత పరిస్థితి తలెత్తిన విషయం తెలిసిందే. జూబ్లీహిల్స్‌లోని అల్లు అర్జున్ ఇంటిపై 10 మంది యువకులు దాడి చేశారు. గేట్లను తోసుకుంటూ ఇంట్లోకి వెళ్లేందుకు యత్నించారు. అడ్డుకున్న సిబ్బందిని చితకబాదారు. ఆవరణలోని పూలకుండీలను ధ్వంసం చేశారు. అల్లు అర్జున్ ఖబర్దార్ అంటూ నినాదాలు చేశారు. అల్లు అర్జున్ సిబ్బంది ఇచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడికి వచ్చి యువకులను అరెస్ట్ చేశారు. అల్లు అరవింద్ మేనేజర్ కాంతారావు ఫిర్యాదు మేరకు కేసు బీఎన్ఎస్ 331(5), 190, 191(2), 324(2), 292, 126(2), 131 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. ఓయూ జేఏసీ నేతలుగా చెప్పుకున్న వారిని చౌటుప్పల్‌కు చెందిన నాగరాజ్, యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన నగేశ్, కొడంగల్ నియోజకవర్గానికి చెందిన రెడ్డి శ్రీనివాస్, మోహన్, చర్లపల్లికి చెందిన ప్రేమ్‌కుమార్, షాద్‌నగర్‌కు చెందిన ప్రకాశ్‌గా గుర్తించారు. కాగా, సోమవారం ఉదయం జూబ్లీహిల్స్ పోలీసులు నిందులను వనస్థలిపురంలోని జడ్జి నివాసంలో హాజరుపరిచారు. దీంతో వారికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. రూ.10 వేల చొప్పున ఒక్కొక్కరు రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించారు.

### ఓయూ జేఏసీ నేతలు కాదు..

దాడికి పాల్పడిన వారు ఓయూ జేఏసీ పేరుతో ప్లకార్డులు ప్రదర్శించారు. కానీ వాళ్లు ఓయూ జేఏసీ నేతలు కాదని పోలీసులు స్పష్టంచేశారు. దాడిలో కీలకపాత్ర పోషించిన రెడ్డి శ్రీనివాస్ కొడంగల్ నియోజకవర్గానికి చెందిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా గుర్తించారు. 2019లో కాంగ్రెస్ నుంచి జడ్పీటీసీగా కూడా పోటీ చేశాడని, అతడు సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డికి అత్యంత సన్నిహితంగా వ్యవహరిస్తుంటాడని తెలుస్తున్నది. మిగిలిన యువకులు కూడా కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా పని చేస్తున్నారని సమాచారం. మరోవైపు దాడిలో పాల్గొన్న రెడ్డి శ్రీనివాస్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. మళ్లీ 1500మందితో వచ్చి దాడి చేస్తామని ఆ వీడియోలో హెచ్చరించాడు.

## అమెరికాలో అనుమానాస్పదస్థితిలో విద్యార్థి మృతి



**హైదరాబాద్, డిసెంబర్ 22 (వెలుతురు):** అమెరికాలో ఉన్నత చదువులు, ఉద్యోగావకాశాల కోసం యూఎస్ వెళ్లిన పలువురు విద్యార్థులు అక్కడ జరిగిన ప్రమాదాల్లో మరణిస్తున్నారు. తాజాగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఓ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలం మాదన్నపేటకు చెందిన 25 ఏళ్ల బండి వంశీ గతేడాది జులైలో ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు. అక్కడ మిన్నెసొటాలో పార్ట్‌టైం జాబ్ చేస్తూ.. ఎంఎస్ చదువుతున్నాడు. అయితే, అతడు ఆదివారం తాను ఉంటున్న అపార్ట్‌మెంట్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న కారులో శవమై కనిపించాడు. అదే అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న హన్మకొండ జిల్లాకు చెందిన యువకులు ఆదివారం ఉదయం వంశీ మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వంశీ మృతితో మాదన్నపేట గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## ట్రైనీ ఐఏఎస్‌కు ముందస్తు బెయిల్ నిరాకరణ



**న్యూఢిల్లీ, డిసెంబర్ 23 (వెలుతురు):** మాజీ ఐఏఎస్ ట్రైనీ ఆఫీసర్ పూజా ఖేద్కర్‌కు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. అక్రమ రీతిలో యూపీఎస్సీ పరీక్షను ఆమె క్లియర్ చేసినట్లు ఆరోపణలు ఉన్న విషయం తెలిసిందే. ఓబీసీ, దివ్యాంగ కోటాలో లబ్ధి పొందేందుకు పూజా ఖేద్కర్ .. యూపీఎస్సీని తప్పుదోవ పట్టించినట్లు జస్టిస్ చంద్ర ధారి సింగ్ పేర్కొన్నారు. అర్హత లేకున్నా ఆమె ఆ కోటాలో లబ్ధి పొందినట్లు తెలిపారు. డాక్యుమెంట్లను ఫోర్జరీ చేసి ఐఏఎస్ శిక్షణకు ఎంపికైనట్లు సింగిల్ జడ్జి తెలిపారు. యూపీఎస్సీని మోసం చేయాలన్న ఉద్దేశం ఆమె ప్రయత్నంలో స్పష్టం కనిపిస్తున్నట్లు కోర్టు పేర్కొన్నది. వైకల్య సమస్యలు ఉన్నా వారి కోసం ఏర్పాటు చేసిన బినిఫిట్లను ఆమె పొందినట్లు కోర్టు తెలిపింది. ఆమె ఆర్థిక, సామాజిక బ్యాక్‌గ్రౌండ్ ఆధారంగా.. ఆమెకు పేరెంట్స్ కూడా సహకరించి ఉంటారని అంచనాకు వచ్చారు. కస్టడీలోనే ఆమెపై విచారణ కొనసాగాలని ధర్మాసనం తెలిపింది. యూపీఎస్సీ వ్యవస్థనే భ్రష్టుపట్టించే రీతిలో పూజా కుట్ర పన్నిందని, ఒకవేళ ఆమెకు ముందస్తు బెయిల్ మంజూరీ చేస్తే, అది విచారణపై ప్రభావం పడే అవకాశాలు ఉన్నట్లు కోర్టు పేర్కొన్నది. ప్రస్తుతం యూపీఎస్సీ ఆమె సెలక్షన్‌ను రద్దు చేసింది. భవిష్యత్తులో ఎటువంటి పరీక్ష రాయకుండా ఆమెను పర్మనెంట్‌గా డిమాండ్ చేశారు. యూపీఎస్సీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఖేద్కర్‌పై కేసు బుక్ చేశారు. అరెస్టు చేయవద్దు అని ఆగస్టు 12వ తేదీన తాత్కాలిక రక్షణ కల్పించారు. కానీ తాజా ఆదేశాలతో ఆ తీర్పును రద్దు చేయాల్సి ఉంటుంది.

## ఇటుక బట్టీ గోడ కూలి నలుగురు చిన్నారులు మృతి

**చండీగఢ్,డిసెంబర్ 23 (వెలుతురు):** నిద్రిస్తున్న పిల్లలపై ఇటుక బట్టీ గోడ కూలింది. ఈ సంఘటనలో నలుగురు చిన్నారులు మరణించారు. మరో బాలిక తీవ్రంగా గాయపడింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి సీరియస్‌గా ఉందని పోలీసులు తెలిపారు. హర్యానాలోని హిసార్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బుడానా గ్రామంలోని ఇటుక బట్టీలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన కార్మికులు పని చేస్తున్నారు. ఆదివారం రాత్రి తమ పిల్లలతో కలిసి అక్కడ నిద్రించారు. అయితే ఇటుక బట్టీ గోడ కూలి వారిపై పడింది. ఈ సంఘటనలో నలుగురు పిల్లలు మరణించారు. కాగా, ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతులను మూడు నెలల చిన్నారి నిషా, ఐదేళ్ల నందిని, తొమ్మిదేళ్ల వయస్సున్న సూరజ్, వివేక్‌గా గుర్తించారు. తీవ్రంగా గాయపడిన గౌరి అనే ఐదేళ్ల బాలిక పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. హిసార్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. ఈ ఐదుగురు చిన్నారులు ఉత్తరప్రదేశ్‌లోని అంబేద్కర్ నగర్ జిల్లా బాదవ్ గ్రామానికి చెందినవారని పోలీస్ అధికారి వెల్లడించారు.

## మూడు పెళ్లిళ్లు... రూ.1.25 కోట్ల మేర లూటీ

- మహిళను అరెస్టు చేసిన పోలీసులు



**జైపూర్,డిసెంబర్ 23 (వెలుతురు):** ఒక మహిళ పలువురిని పెళ్లాడింది. ఆ తర్వాత వారి నుంచి విడిపోయి డబ్బులు డిమాండ్ చేసింది. ఇలా ఇప్పటి వరకు ముగ్గురిని వివాహం చేసుకున్నది. వారి నుంచి రూ.1.25 కోట్ల మేర లూటీ చేసింది. మూడో భర్త ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేశారు. 'లూటీ వధువు'గా పేర్కొన్న ఆ మహిళను అరెస్ట్ చేశారు. ఉత్తరాఖండ్‌కు చెందిన నిక్కి అలియాస్ సీమ 2013లో ఆగ్రాకు చెందిన వ్యాపారవేత్తను తొలిసారి పెళ్లాడింది. కొంత కాలం తర్వాత ఆ వ్యక్తి కుటుంబంపై కేసు పెట్టింది. కేసు రాజీలో భాగంగా రూ.75 లక్షలు అందుకున్నది. కాగా, 2017లో గురుగ్రామ్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను సీమా వివాహం చేసుకున్నది. అతడి నుంచి విడిపోయిన ఆమె సెటిల్‌మెంట్‌గా రూ.10 లక్షలు తీసుకున్నది. ఆ తర్వాత 2023లో జైపూర్‌కు చెందిన వ్యాపారవేత్తతో సీమా పెళ్లి జరిగింది. అయితే ఆ వెంటనే రూ.36 లక్షల విలువైన బంగారు నగలు, నగదుతో అతడి ఇంటి నుంచి పారిపోయింది. వరుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు సీమాను అరెస్ట్ చేశారు. మరోవైపు నిందితురాలు సీమాను 'లూటేరి దుల్హన్' (దోపిడీలకు పాల్పడుతున్న వధువు)గా జైపూర్ పోలీసులు అభివర్ణించారు. విడాకులు తీసుకున్న లేదా భార్యలను కోల్పోయిన ధనవంతులైన మగవారిని మ్యాట్రిమోనియల్ సైట్‌లలో వెతికి వారిని ఆమె టార్గెట్ చేస్తుందని తెలిపారు. పలు రాష్ట్రాల్లో ముగ్గురిని పెళ్లాడిన సీమా వారి నుంచి రూ.1.25 కోట్లు వసూలు చేసినట్లు దర్యాప్తులో తెలిసిందన్నారు.

## భారతీయ రైల్వే ప్రయాణికులకు గుడ్‌న్యూస్

- వందే భారత్ రైలు త్వరలో స్లీపర్ కోచ్‌లు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 23 (వెలుతురు):** భారతీయ రైల్వే ప్రయాణికులకు గుడ్‌న్యూస్ చెప్పింది. లోడెడ్ సిమ్యులేషన్ ట్రయల్స్ కోసం కోచ్‌లను ఐసీఎఫ్ చెన్నైకి పంపినట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ట్రయల్ తర్వాత రైళ్లు వివిధ నగరాల మధ్య రాకపోకలు సాగిస్తాయన్నారు. భారతదేశపు తొలి స్లీపర్ వందే భారత్ రైలు త్వరలో ట్రయల్ రన్ మొదలవనున్నది. అయితే, ట్రయల్ రన్ పూర్తయ్యేందుకు దాదాపు రెండునెలల సమయం పట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం తొలి రైలు ఏ మార్గంలో నడుస్తుందనే చర్చ సాగుతున్నది. దేశంలోని వివిధ రైల్వే జోన్ల నుంచి రైల్వేబోర్డుకు భారీగానే ప్రతిపాదనలు వచ్చినట్లు రైల్వేవర్గాలు పేర్కొన్నాయి. ప్రధానంగా బెంగళూరు, ఢిల్లీ, ముంబయి నుంచి ప్రారంభించేందుకు ఎక్కువగా అవకాశాలున్నట్లు తెలుస్తున్నది. ఈ విషయంలో త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం వందే భారత్ స్లీపర్ రైలు చార్జీలు రాజధాని ఎక్స్‌ప్రెస్‌తో సమానంగా ఉంటాయని రైల్వేశాఖ మంత్రి ఇప్పటికే స్పష్టం చేశారు.

## ముండ్లమూరులో వరుస భూ ప్రకంపనలు

- ఆందోళనలో గ్రామ ప్రజలు



**ఒంగోలు,డిసెంబర్23(వెలుతురు):** ప్రకాశం జిల్లాలో భూకంపం ఆ జిల్లా వాసులను బెంబేలెత్తిస్తోంది. ఒకటి కాదు రెండు కాదు మూడు రోజుల నుంచి ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాల్లో భూమి కంపిస్తుండటంతో జనం భయంతో వణికిపోతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని క్షణక్షణం టెన్షన్‌తో జీవనం సాగిస్తున్నారు. మరో విషయం ఏంటంటే.. మూడు రోజులుగా ప్రకాశం జిల్లాలోని ఒకే ప్రాంతంలో.. ముండ్లమూరులో వరుస భూ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. దీంతో ఈ ఊళ్లో జనానికి ముచ్చెమటలు పడుతున్నాయి. సోమవారం కూడా ఈ ఊరిలో భూమి కంపించింది. వరుసగా మూడో రోజు కంపించడంతో టెన్షన్ అంతకంతకూ పెరిగిపోతోంది. సోమవారం ఉదయం 10.35 గంటల సమయంలో భూమి కంపించింది. కొన్ని రోజుల క్రితమే ఏపీ, తెలంగాణలోని చాలా ప్రాంతాల్లో భూమి కంపించిన సంగతి తెలిసిందే. డిసెంబర్ 4న ఉదయం 7 గంటల సమయంలో ఖమ్మం, భద్రాద్రి, వరంగల్, హైదరాబాద్, విజయవాడ, జగ్గయ్యపేట, రంగారెడ్డి, కృష్ణా జిల్లాల్లో భూమి కొన్ని సెకన్ల పాటు కంపించింది. ఈ పరిణామంతో జనం ఉలిక్కిపడి భయంతో వణికిపోతూ ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. 2 నుంచి 5 సెకన్ల పాటు భూమి కంపించింది. భూకంప తీవ్రత విషయానికొస్తే.. రిక్టర్ స్కేల్? పై 5.3గా నమోదైంది. ఉదయం 7.27కి భూప్రకంపనలు మొదలైనట్లు కొన్ని ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీలతో స్పష్టమైంది. ములుగు జిల్లా ఐలాపూర్ కేంద్రంగా భూకంపం సంభవించింది. తెలంగాణ వ్యాప్తంగా భూకంపం రిక్టర్ స్కేల్?పై 5.3 నమోదు కాగా, మూడు సెకన్లు భూమి కంపించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలిపింది.

https://epaper.velthuru.com
మంగళవారం 24 డిసెంబర్ 2024
వెలుతురు


# సీఎం రేవంత్‌రెడ్డిని కలవనున్న టాలీవుడ్ ప్రముఖులు

పుష్పా–2 ప్రీమియర్ షో సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్యా థియేటర్ తొక్కిసలాట ఘటన నేపథ్యంలో రాష్ట్రంలో ఇకపై ప్రీమియర్ షోలకు అనుమతి ఇచ్చేదిలేదని కాంగ్రెస్ సర్కార్ ప్రకటించింది. అదేవిధంగా సినిమా రేట్ల పెంపుకు అవకాశం లేదని స్పష్టం చేసింది. చారిత్రక, తెలంగాణ ఉద్యమం వంటి సినిమాలకు మాత్రమే టికెట్ల రేట్లు పెంపు అంశాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డిని తెలుగు సినీ ప్రముఖులు కలిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. రామ్‌చరణ్ నటించిన గేమ్ చేంజర్ సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఎఫ్‌డీసీ చైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్‌రాజు ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు. ఆయన తిరిగి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రిని కలవడంపై నిర్ణయం తీసుకుంటామని నిర్మాత నాగవంశీ చెప్పారు. టికెట్ ధరల పెంపు, ప్రీమియర్ షోలపై చర్చిస్తామని వెల్లడించారు. సంధ్య థియేటర్ వద్ద అనుకోని ఘటన జరిగిందన్నారు. ఏ హీరో, నిర్మాత అలా జరగాలని కోరుకోరని చెప్పారు. సినీ పరిశ్రమ ఏపీకి తరలిపోతుందనేది అవాస్తవమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమకు అక్కడి ప్రభుత్వం సహకరిస్తున్నదని పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో షూటింగ్‌లు జరుగుతున్నాయని చెప్పారు.




## ఇసారి ఆ తప్పు జరగదు - ప్రశాంత్‌నీల్

ప్రభాస్ 'సలార్' సినిమా విడుదలై ఏడాది పూర్తయింది. ప్రశాంత్‌నీల్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా 700కోట్ల వసూళ్లను రాబట్టిన విషయం తెలిసిందే. ఈ సినిమా చివర్లో దర్శకుడు ప్రశాంత్‌నీల్ 'సలార్ 2 శౌర్యాంగపర్వం'ను కూడా ప్రకటించేశాడు. దాంతో అభిమానులు సెకండ్ పార్ట్ కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో వారందరికోసం 'సలార్ 2' అప్‌డేట్‌ని ఇచ్చేశారు ప్రశాంత్‌నీల్. ఆయన మాట్లాడుతూ ' 'సలార్' భారీ విజయాన్ని సాధించినా.. ఒక దర్శకుడిగా ఆ సినిమా విషయంలో పూర్తి సంతృప్తిగా లేను. ఎక్కడో 'కేజీఎఫ్' ఛాయలు ఆ సినిమాలో కనిపిస్తుంటాయి. 'సలార్ 2 శౌర్యాంగపర్వం'లో మాత్రం ఆ తప్పు జరగదు. ఓ కొత్త సినిమాను ప్రేక్షకులు చూస్తారు.' అని చెప్పుకొచ్చారు. ఇంకా మాట్లాడుతూ 'ఈ కథ రాసుకున్నప్పుడే రెండు భాగాలుగా తీయాలని నిర్ణయించుకున్నా. ఎందుకంటే ఇది దేవా– వరదా అనే ఇద్దరు స్నేహితుల కథ. మలుపులు, కుదుపులు లేకపోతే కథ రక్తికట్టదు. స్నేహం సాఫీగా సాగితే కిక్కుండదు. అందుకే.. కష్టమైనా సరే.. వారిద్దర్నీ విడగొట్టాలి. వారి మధ్య ఓ పెద్ద అపార్థం సృష్టించాలి. ఒకరినొకరు అపార్థం చేసుకోవాలి. శత్రువులుగా మారాలి. ఈ తర్వాత ఏమైంది? అనేది తెరపైనే చూడాలి. దాన్ని ఇప్పుడే రివీల్ చేయలేను.' అంటూ నవ్వేశారు ప్రశాంత్‌నీల్.


## శ్రీతేజ్‌ను పరామర్శిస్తున్న ప్రముఖులు



సంధ్య థియేటర్ దగ్గర జరిగిన తొక్కిసలాటలో గాయపడి చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ని సోమవారం ప్రముఖ సినీ నటుడు ఆర్. నారాయణమూర్తి పరామర్శించారు. తెల్లవారితే పుష్ప–2 సినిమా విడుదలవుతుందనగా.. డిసెంబర్ 4వ తేదీ రాత్రి హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్‌లో ప్రీమియర్ షో వేయడం, ఆ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో దిల్‌సుఖ్ నగర్‌కు చెందిన రేవతి(35) మృతి చెందడం, ఆమె కుమారుడు శ్రీతేజ్ (9) అపస్మారక స్థితికి చేరుకొని చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. సినిమా ఈ నేపథ్యంలో ప్రముఖ సినీ, రాజకీయ ప్రముఖులు శ్రీతేజ్ చికిత్స పొందుతున్న కిమ్స్ ఆసుపత్రికి క్యూ కట్టారు. తాజాగా ప్రముఖ నటుడు ఆర్. నారాయణమూర్తి సికింద్రాబాద్ లోని కిమ్స్ హాస్పిటల్ కి చేరుకున్నారు. బాలుడి ఆరోగ్యస్థితిపై అరా తీశారు. రేవతి భర్త భాస్కర్ కి ధైర్యం చెప్పారు. ఇప్పటికే 'పుష్ప 2' టీమ్ నుండి సుకుమార్, జగపతి బాబు, మైత్రీ నిర్మాతలు కలిశారు. వీరితో పాటు అల్లు అరవింద్, బన్నీ వాసులు కూడా కలిసి అండగా ఉంటాం అని భరోసానిచ్చారు. మొన్న జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి టాలీవుడ్ చిత్ర పరిశ్రమకి చెందిన సెలబ్రిటీలపై మండిపడిన విషయం తెలిసిందే. ఆయన మాట్లాడుతూ..

"బాధితులను ఆదుకోవడానికి సినీ ప్రముఖులు ఎవరూ ఆసక్తి చూపించలేదు. కానీ అల్లు అర్జున్ కోసం క్యూ కట్టిన సినీ ప్రముఖులు బాధితులను పరామర్శించడానికి ముందుకు రాలేదు. దీనిని బట్టి చూస్తుంటే అసలు సినీ ప్రముఖులు ఏం కోరుకుంటున్నారనేది నాకు అర్థం కావడం లేదు. అసలు అల్లు అర్జున్‌కు ఏమైంది.. అంతగా ఇంటికి క్యూ కట్టి నన్ను తిడుతున్నారు. అల్లు అర్జున్‌కు ఏమైనా కాలు విరిగిందా.. చెయ్యి విరిగిందా? ఎందుకు అంతగా పరామర్శిస్తున్నారు. సినిమా వాళ్లపై నాకు కోపం ఎందుకు ఉంటుంది? సినిమా వాళ్లు బాధ్యతగా వ్యవహరించాలి" అని చేసిన వ్యాఖ్యలకు చిత్ర పరిశ్రమ కదులుతున్నట్లు తెలుస్తోంది.

## క్రికెట్‌కు సచిన్ ఎలాగో.. ఇండియన్ సినిమాకు శంకర్ అలాగా - రామ్‌చరణ్



శంకర్‌గారు కింగ్ ఆఫ్ ఇండియన్ సినిమా. క్రికెట్‌కు సచిన్ ఎలాగో, ఇండియన్ సినిమాకు శంకర్‌గారు అలా. అలాంటి శంకర్‌గారితో పనిచేయడం నా అదృష్టం. నానుంచి సోలో ఫిల్మ్ వచ్చి అయిదేళ్లయింది. ఇది నాకు ప్రత్యేకమైన సినిమా. ఈ మూవీ ఏ ఒక్కర్నీ నిరాశపరచదు.' అని రామ్‌చరణ్ అన్నారు. ఆయన హీరోగా రూపొందుతున్న చిత్రం 'గేమ్ ఛేంజర్'. ఎస్.శంకర్ దర్శకత్వంలో దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక పాన్ ఇండియా సినిమా జనవరి 10న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ అమెరికా డల్లస్‌లో గ్రాండ్‌గా జరిగింది. ఈ కార్యక్రమానికి అగ్ర దర్శకుడు సుకుమార్ అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ "రంగస్థలం'కు రామ్‌చరణ్ జాతీయ అవార్డు తీసుకుంటాడని ఆశించా. కానీ రాలేదు. అయితే.. 'గేమ్ చేంజర్' ట్రెయిలర్ చూశాక, ఈ సినిమాలోని రామ్‌చరణ్ నటనకు పక్కాగా జాతీయ అవార్డు వస్తుందనిపించింది.' అని తెలిపారు. 'మా సంస్థలో ఇది 50వ సినిమా. ఇంత పెద్ద బడ్జెట్ సినిమా తీయడం ఇదే ప్రథమం. శంకర్‌గారి సినిమా సెల్‌ఫోన్‌లో చూస్తే ఫీల్ రాదు. దాన్ని బిగ్ స్క్రీన్‌పైనే ఎక్స్‌పీరియన్స్ చేయాలి. రెండు తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ అంశాలు ఈ సినిమాలో చాలా కనిపిస్తాయి. శంకర్‌గారు అన్నీ తానై నడిపించారు. ఈసారి మామూలుగా కొట్టడంలేదు. గట్టిగా కొట్టబోతున్నాం.' అని దిల్‌రాజు నమ్మకం వ్యక్తం చేశారు. శంకర్ మాట్లాడుతూ 'పోకిరి, ఒక్కడు లాంటి మాస్ మసాలా సినిమా చేయాలి.. కానీ అందులో కూడా నా మార్క్ ఉండాలి అనుకొని ఈ 'గేమ్‌ఛేంజర్' చేశాను. ప్రభుత్వోద్యోగి, పొలిటీషియన్ మధ్య జరిగే సంఘర్షణే ఈ సినిమా. రామ్‌చరణ్ సెటిల్డ్‌గా చేశాడు. పంచెకట్టులో అప్పన్నగా అదరగొట్టేశాడు. ఈ సినిమాకి అందరూ ప్రాణం పెట్టి పనిచేశారు. రేపు ఆ కష్టాన్ని తెరపై చూస్తారు.' అని శంకర్ చెప్పారు. ఇంకా అంజలి, సంగీత దర్శకుడు తమన్, నిర్మాత అనిల్ సుంకర, డైరెక్టర్ బుచ్చిబాబు, ఎస్‌జే సూర్య కూడా మాట్లాడారు.

## చిరు ఫ్యాన్స్ తిట్టుకున్నా.. పర్వాలేదు

### వాల్తేరు వీరయ్య కంటే డాకు మహారాజ్ బాగా తీశాడు : నాగవంశీ




సినిమా విడుదల సమయంలో సెన్సేషనల్ కామెంట్స్ చేసే ఏ నిర్మాత సూర్యదేవర నాగవంశీ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మెగాస్టార్ అభిమానులు తిట్టుకున్నా ఫర్వాలేదు. కానీ దర్శకుడు బాబీ 'వాల్తేరు వీరయ్య' కంటే 'డాకు మహారాజ్' సినిమాని బాగా తీశాడు' అని కామెంట్స్ చేశాడు. ఈ విషయంలో చిరంజీవి ఫ్యాన్స్ తనని తిట్టుకున్నా పర్లేదని స్టేట్ మెంట్ ఇచ్చారు. ఇప్పుడు ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నాగవంశీ ఈ వ్యాఖ్యలు చేశారు. బాలకృష్ణ హీరోగా బాబీ దర్శకత్వంలో నాగవంశీ నిర్మించిన చిత్రం 'డాకు మహారాజ్'. శ్రద్ధా శ్రీనాథ్, ప్రగ్యా జైస్వాల్ కథానాయికలు. బాబీ డియోల్, చాందిని చౌదరి ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా జనవరి 12న థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ క్రమంలోనే జనవరి 4న అమెరికాలో ఓ ఈవెంట్ ప్లాన్ చేశారు. మరో ఈవెంట్ విజయవాడలో నిర్వహిస్తామని చెప్పారు. ఆయన మాట్లాడుతూ " బాలకృష్ణతో వర్క్ చేయాలని ఎప్పటినుంచో అనుకుంటున్నా. ఇప్పటికి కుదిరింది. ఈ సినిమాలో ఆయన్ని చాలా కొత్తగా చూస్తారు. ఇప్పటివరకు ఏ సినిమాలోనూ ఇలాంటి లుక్‌లో ఆయన కనిపించలేదు. అఖండ, లెజెండ్ గురించి ఎలా చెప్పుకుంటున్నారో దీని గురించి కూడా అలానే మాట్లాడుకుంటారు. సినిమా ఇంటర్వెల్‌లోనే నాకు ఫోన్ చేసి ఈ మాట చెబుతారు. ఈ సినిమాకు సంబంధించి మూడు గ్రాండ్ ఈవెంట్స్ ప్లాన్ చేశాం. జనవరి 2న హైదరాబాద్‌లో ట్రైలర్ రిలీజ్ చేయాలనుకుంటున్నాం. తర్వాత రెండు రోజులకు అమెరికాలో ప్రీరిలీజ్ ఈవెంట్ చేసి అక్కడ ఓ పాటను విడుదల చేయనున్నాం. జనవరి 8న ఆంధ్రప్రదేశ్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ ప్లాన్ చేస్తున్నాం.

## కాంగ్రెస్ ఇన్‌చార్జితో అల్లుఅర్జున్ మామ భేటీ

తెలుగు రాష్ట్రాల్లో హీటెక్కిస్తున్న సంధ్య థియేటర్ తొక్కిసలాట వివాదంలో రోజుకో ఎపిసోడ్ ఉత్కంఠను రేపుతోంది. ఈ ఇష్యూపై తెలంగాణ ప్రభుత్వం ఎంత సీరియస్ గాఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం వర్సెస్ సినీ ఇండస్ట్రీ అన్నట్లుగా మారిండి వ్యవహారం. ఈ క్రమంలోనే అల్లు అర్జున్ మామ, కాంగ్రెస్ నేత కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి టీపీసీసీ ఇన్‌చార్జ్ దీప దాస్ మున్షీ ని కలవడం ఆసక్తికరంగా మారింది. సోమవారం హైదరాబాద్ కి కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్ దీప దాస్ మున్షీ వచ్చారు. గాంధీ భవన్ లో కాంగ్రెస్ నేతలతో మీటింగ్ లో పాల్గొని మాట్లాడా రు. ఈ క్రమంలోనే అల్లు అర్జున్ మామ, కాంగ్రెస్ నేత కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి ఆమెని కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అల్లు అర్జున్ కేసుపై వ్యవహరిస్తున్న తీరు సంచలనంగా మారిన వేళ ఈ మీటింగ్ ఆసక్తిని రేపుతోంది. మరోవైపు కాంగ్రెస్ స్టేట్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. మేమందరం ప్రెస్ మీట్ లో ఉండగా అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్ రెడ్డి గారు గాంధీభవన్ వచ్చారు. ఆయన బయటకు వెళ్లిపోయాక నాతో ఫోన్ మాట్లాడారు. మళ్ళీ వచ్చి కలుస్తానని చెప్పారు. అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్ రెడ్డి నా పాత మిత్రుడు, కాంగ్రెస్ వాది. చంద్ర శేఖర్ రెడ్డితో తప్పకుండా మాట్లాడుతా. ఏదైనా విషయాలు ఉంటే చర్చించుకుంటాం. అల్లు అర్జున్ అంశంలో ఒక నిండు ప్రాణం పోయింది. మరొక ప్రాణం కొట్టుమిట్టాడు తుంది. 11 గా ఉన్న అల్లు అర్జున్ ను అరెస్ట్ చేశారు. ఆయనకు బెయిల్ వచ్చింది. దీనిపై రాజకీయ లబ్ది పొందేందుకు చిత్ర సీమ చరిత్ర తెలియనివాళ్లు మాట్లాడుతున్నారు. బాధ్యత గల పదవిలో ఉన్న కిషన్ రెడ్డి, తెలంగాణలో లా అండ్ ఆర్డర్ పరిస్థితి మీకు తెలీదా? వాళ్లు కూడా అడ్డగోలుగా మాట్లాడుతు న్నారు. చిత్రసీమకు కాంగ్రెస్ పార్టీకి ఉన్న అనుబంధం వీళ్లకు తెలుసా? చిత్ర సీమ హైదరాబా ద్ ఎలా వచ్చిందో వీళ్లకు తెలుసా? పుష్ప 2కి కూడా వెసులుబాటు ఇచ్చింది ప్రభుత్వమే. రాజకీయ నాయకులు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడితే మంచిదని' హితవు పలికారు.

## గూగుల్ సెర్చింగ్‌లో నెంబర్‌వన్‌గా.. త్రిప్తి డిమ్రీ

'యానిమల్'కి ముందు కూడా త్రిప్తి డిమ్రీ సినిమాలు చేసింది. కానీ గుర్తింపు రాలేదు. కానీ 'యానిమల్' తర్వాత రాత్రికి రాత్రి స్టార్ అయి కూర్చుంది. రీసెంట్‌గా ఈ అందాలభామ మరో అచీవ్‌మెంట్ కూడా సాధించింది. బాలీవుడ్‌లో తన తోటి హీరోయిన్లందర్నీ వెనక్కు నెట్టి నంబర్‌వన్‌గా నిలిచింది. ఇది ఎలా సాధ్యం? అనుకుంటున్నారా!.. అసలు విషయం ఏంటంటే.. అసలే బాలీవుడ్‌లో స్టార్డ్స్ తాకిడి ఎక్కువ. వారందరినీ దాటుకొని గూగుల్ సెర్చ్‌లో నంబర్‌వన్‌గా నిలిచింది త్రిప్తి డిమ్రీ. ఇది కూడా తక్కువ విషయమేం కాదు. ఈ పరిణామంపై తెగ సంబరపడిపోతున్నది ఈ అందాలభామ. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'నా గురించి తెలుసుకోవాలని ఇంతమంది ఉత్సాహపడ్డారంటే అది నిజంగా నా విజయమే. ఈ క్రేజ్‌కి కారణం 'యానిమల్'. థ్యాంక్యూ సందీప్ సార్. 'యానిమల్ 2' కోసం ఎదురు చూస్తున్నా. అందులోనూ అందరూ మెచ్చేలా నా పాత్ర ఉంటుంది.' అంటూ చెప్పుకొచ్చింది త్రిప్తి డిమ్రీ.




## ప్రజాస్వామ్యంలో భౌతికదాడులకు తావులేదు

### - కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



సినీ నటుడు అల్లు అర్జున్ ఇంటిపై జరిగిన దాడిని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో భౌతికదాడులకు తావులేదని చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరూ వ్యవహరించ కూడదన్నారు. సంధ్య థియేటర్ ఘటనకు సంబంధించిన అంశం కోర్టులో ఉందని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని ఎక్స్ వేదికగా అన్నారు.

# కడప కార్పొరేషన్‌లో రసాభాస

- ఎమ్మెల్యే మాధవీరెడ్డికి కుర్చీ లేకుండా అవమానం
- మేయర్ తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే
- మహిళను అవమనపర్చడం దారుణమని నిరసన
- నిలుచునే సమావేశంలో ఎమ్మెల్యే మాధవి ప్రసంగం
- వైకాపా, టిడిపి శ్రేణుల పరస్పర విమర్శలతో ఉద్రిక్తత
- ముందుజాగ్రత్తగా 144 సెక్షన్ విధించిన పోలీసులు




**కడప,డిసెంబర్23(వెలుతురు):**

కడప నగర కార్పోరేషన్ సర్వసభ్య సమావేశం వేళ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కుర్చీ వ్యవహారంతో గందరగోళం నెలకొంది. సమావేశంలో ఎమ్ఎల్యే మాధవీరెడ్డికి కుర్చీ వేయకపోవడంతో టిడిపి శ్రేణులు ఆందోళనకు దిగారు దీంతో అక్కడ కొంత ఉద్రిక్తత ఏర్పడింది. సమావేశానికి ముందే కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. మేయర్ డౌన్ డౌన్ అంటూ టీడీపీ కార్యకర్తలు నినాదాలు చేశారు. దీంతో వారిని పోలీసులు అడ్డుకున్నారు. వైఎస్సార్‌సీపీ పాలక వర్గం, కడప ఎమ్మెల్యే మాధవి మధ్య కుర్చీ వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో మేయర్, ఎమ్మెల్యేమాటల యుద్ధం జరిగింది. కాగా కడప కార్పొరేషన్‌లో తనకు కుర్చీ లేకపోవడంతో ఎమ్మెల్యే మాధవి రెడ్డి నిలబడే నిరసన వ్యక్తం చేశారు. మరోవైపు కార్పొరేషన్ గేటు బయట టీడీపీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. మహిళలను గౌరవించాలని ఎమ్మెల్యేకు మద్దతుగా వారు ఆందోళనకు దిగారు. జయశ్రీ పేరుతో అక్రమంగా ఇల్లు నిర్మిస్తున్నది ఎవరని మాధవి రెడ్డి ప్రశ్నించారు. గందరగోళం నేపథ్యంలో మేయర్ పోడియం వద్ద వైఎస్సార్‌సీపీ, టీడీపీ కార్పొరేటర్లు బైఠాయించి నిరసన చేపట్టారు. గతంలో కూడా కడప నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. మేయర్ ఛాంబర్‌లో ఎమ్మెల్యే మాధవి రెడ్డికి కుర్చీ వేయకుండా అవమానించారు. ఇప్పుడు కూడా ఆమె నిరసన తెలుపుతూ నిల్చొని మాట్లాడుతుండగా మేయర్ సురేశ్, కార్పొరేటర్లు అడ్డుకున్నారు. ఎక్స్ అఫీషియో మెంబర్‌గా మాట్లాడే అవకాశం తనకు ఉందని మాధవి అన్నారు.గత సమావేశాల్లో వైఎస్సార్‌సీపీ మేయర్ తనకు కుర్చీ వేయకుండా అవమానించారని ఎమ్మెల్యే మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు కూడా సమావేశాలకు ముందు కార్పొరేషన్ ఆఫీసు వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఆందోళనకు దిగిన వారిని పోలీసులు అడ్డుకున్నారు. అక్కడ ఎలాంటి ఉద్రిక్తతలు జరగకుండా పోలీసులు భారీగా మోహరించారు. కడప కార్పొరేషన్ పరిధిలో 144 సెక్షన్ విధించారు. కాగా ఇటీవల వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో 8 మంది కార్పోరేటర్లు చేరారు. సోమవారం ఉదయం 11 గంటలకు నగర కార్పోరేషన్ సర్వసభ్య సమావేశం ప్రారంభమైంది. ఈ సమావేశంలో కూడా ఎమ్మెల్యే మాధవి రెడ్డికి మేయర్ చాంబర్‌లో కూర్చీ వేయలేదు. మేయర్ సురేష్ బాబు, మాధవి రెడ్డి మధ్య వాగ్వాదం జరిగింది. మహిళను అవమానిస్తారా.. ఇక్కడ కుర్చీ మీరు లాగేసినా ప్రజలు తనకు కుర్చీ ఇచ్చారని, కుర్చీల కోసం పోరాడాల్సిన అవసరం తనకు లేదని ఎమ్మెల్యే అన్నారు. సమావేశమంతా నిల్చొని మాట్లాడే శక్తి తనకుందన్నారు. మేయర్‌కు ఈ సలహా ఎవరు ఇచ్చారో తెలియదు కానీ, కడప నియోజక వర్గంలోని మహిళలను అవమానిస్తే.. వాళ్ల నాయకుడు సంతోషిస్తాడో.. లేకపోతే మేయర్, కార్పొరేటర్ల కుర్చీలు తీసివేస్తారేమో అన్న భయం పట్టుకుందో తెలియదుగానీ కుర్చీలాట మొదలెట్టారని ఎమ్మెల్యే మండిపడ్డారు. ఈ క్రమంలో సమావేశంలో గందరగోళం నెలకొంది. ఒకవైపు వైఎస్సార్‌సీపీ, మరోవైపు టీడీపీ కార్పొరేటర్లు నిరసన తెలిపారు. దీంతో కడప నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. సమావేశానికి హాజరైన స్థానిక తెదేపా ఎమ్మెల్యే మాధవీరెడ్డికి వేదికపై కుర్చీ ఏర్పాటు చేయలేదు. దీంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలోనూ ఇలాగే చేశారంటూ మండిపడ్డారు.ఈ సందర్భంగా మాధవీరెడ్డి మాట్లాడుతూ వైకాపాకు చెందిన మేయర్ సురేశ్‌బాబు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మహిళను మేయర్ అవమానపరుస్తున్నారు. మహిళను అవమానిస్తే మీ నాయకుడు సంతోషిస్తారేమో. తన కుర్చీని లాగేస్తారని మేయర్ భయపడుతున్నట్లున్నారు. అందుకే ఆయన కుర్చీలాట ఆడుతున్నారు. విచక్షణాధికారం ఉందని మేయర్ విచక్షణ లేకుండా ప్రవర్తిస్తున్నారు. ఆయనకు మహిళలంటే చిన్నచూపు. అందుకే మహిళలను నిలబెట్టారు. వైకాపా పాలనలో కుడి, ఎడమ వైపు ఎమ్మెల్యేలను కూర్చోబెట్టుకున్నారు. ఇప్పుడు ఎమ్మెల్యేలకు కుర్చీ వేయకపోవడంలో ఆంతర్యమేంటి? కడప అభివృద్ధిని కుంటుపరిచారు. ఇక్కడ జరిగిన అవినీతిపై మాట్లాడాలి. అవినీతిపై చర్చిస్తారనే సమావేశాలు జరగకుండా చేస్తున్నారు' అని మాధవీరెడ్డి విమర్శించారు. ఈ క్రమంలో మేయర్ సురేశ్ బాబు, ఎమ్మెల్యే మాధవీరెడ్డికి మధ్య వాదోపవాదాలు సాగాయి. కుర్చీ లేకపోవడంతో ఎమ్మెల్యే నిలబడే ఉన్నారు. మేయర్ కుర్చీకి ఒక వైపు తెదేపా, మరో వైపు వైకాపా కార్పొరేటర్లు నిల్చొని నిరసన తెలిపారు. మేయర్ కుర్చీ వెనక ఇరుపక్షాల వాదోపవాదనలు సాగాయి. పోటాపోటీ నినాదాలతో సమావేశంలో గందరగోళ పరిస్థితి నెలకొంది. తెదేపా, వైకాపా కార్పొరేటర్ల మధ్య తోపులాట చోటుచేసుకుంది. మేయర్‌కు క్షమాపణ చెప్పాలంటూ వైకాపా కార్పొరేటర్లు కింద బైఠాయించి నిరసన తెలిపారు. ఇదే సందర్భంగా సమావేశానికి ఆటంకం కలిగిస్తున్నారంటూ వైకాపా నుంచి తెదేపాలోకి వెళ్లిన ఏడుగురు కార్పొరేటర్లను సస్పెండ్ చేస్తున్నట్లు మేయర్ సురేశ్‌బాబు ప్రకటించారు. వైకాపా కార్పొరేటర్లను కూడా సస్పెండ్ చేయాలని తెదేపా సభ్యులు డిమాండ్ చేశారు. మరోవైపు ఎమ్మెల్యేకు కుర్చీ ఇవ్వకపోవడంతో నగరపాలక సంస్థ కార్యాలయం బయట ఆమె వెంట వచ్చిన కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. మేయర్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. మహిళను గౌరవించాలని డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం సందర్భంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యాలయ పరిసరాల్లో 144 సెక్షన్ విధించారు.

## పట్నం నరేందర్ రెడ్డికి ఊరట

- బొంరాస్ పేట కేసులో ముందస్తు బెయిల్
- షరతులతో బెయిల్ ఇచ్చిన హైకోర్టు

**హైదరాబాద్,డిసెంబర్23(వెలుతురు):**

వికారాబాద్ జిల్లా కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పట్నం నరేందర్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. బోంరాస్‌పేట పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఓ కేసులో ఆయనకు



హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. సోమవారం విచారణ చేపట్టిన ధర్మాసనం ముందస్టు బెయిల్ మంజూరు చేసింది. విచారణకు సహకరించాలని, రూ.25 వేల సొంత పూచికత్తు సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రతి సోమవారం పోలీస్ స్టేషన్‌లో హాజరుకావాలని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని హైకోర్టు ఆదేశించింది. లగచర్ల దాడి ఘటనలో అరెస్టయిన నరేందర్ రెడ్డి ఇప్పటికే బెయిల్‌పై బయటికి వచ్చారు. లగచర్ల దాడి ఘటన కంటే ముందే ఆయనపై బోంరాస్ పేట పోలీసులు మరో కేసు నమోదు చేశారు. కాగా, ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ నరేందర్ రెడ్డి మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. కాగా, నవంబర్ 11న కొడంగల్ నియోజకవర్గం లగచర్లలో అల్లర్లు జరిగిన సంగతి తెలిసిందే. ఫార్మా కంపెనీ ఏర్పాటు కోసం భూములు సేకరించేందుకు వెళ్లిన కలెక్టర్ ప్రతీక్ జైన్, అధికారులపై దాడి చేశారంటూ 24 మంది రైతులను పోలీసులు అరెస్టు చేశారు. అల్లర్లకు కుట్ర చేశారంటూ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్, సురేశ్ అనే మరో వ్యక్తిని సైతం అరెస్టు చేశారు. రైతులు, ఎమ్మెల్యేను చర్లపల్లి, సంగారెడ్డి జైళ్లకు తరలించారు. దీనిపై తెలంగాణ హైకోర్టును మాజీ ఎమ్మెల్యే ఆశ్రయించారు. విచారణ జరిపిన న్యాయస్థానం 24 మంది రైతులతోపాటు పట్నం నరేందర్ రెడ్డికి బెయిల్ మంజూరు చేసింది. డిసెంబర్ 19న ఆయన బెయిల్‌పై బయటకు వచ్చారు. కాగా, తాజాగా మరో కేసులోనూ హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.

## శ్రీశైలం క్షేత్రంలో అన్యమత ప్రచారం నిషేధం

- అలా చేస్తే చట్ట ప్రకారం శిక్షార్హం



**నంద్యాల,డిసెంబర్23(వెలుతురు):**

ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాల్లో ఒకటి మాత్రమే కాదు అష్టాదశ అమ్మవారి ఆలయాల్లో ఒకటి అయిన శ్రీశైలం మహాక్షేత్రంలో ఇకపై అన్యమత ప్రచారం చేయకుండా ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీగిరి క్షేత్రంలో వెలసిన శివయ్య ఇక్కడ మల్లికార్జునుడుగా అమ్మవారు భ్రమరాంబగా భక్తులకు దర్శనం ఇస్తున్నారు. ఆదిదంపతుల దర్శనం కోసం తెలుగు రాష్ట్రాల్లోమాత్రమే కాదు దేశంలో అనేక ప్రాంతాల నుంచి భక్తులు వస్తాయి. తాజాగా శ్రీశైలం మహా క్షేత్రంలో దేవాదాయ శాఖ సరికొత్త నిబంధనలను తీసుకొచ్చి,. సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ నిబంధనలను అనుసరించి శ్రీశైలక్షేత్ర పరిధిలో అన్యమత ప్రచారం, అన్యమతాలకు సంబంధించిన కార్యకలాపాలు, అన్యమతచిహ్నాలు ప్రదర్శించడం పూర్తిగా నిషేధం విధించారు. ఈ విషయాన్ని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. శ్రీశైలం ఈఓ మాట్లాడుతూ అన్యమత సూక్తులను, చిహ్నాలను, భోదనలను, అన్యమతానికి సంబంధించిన ఫోటోలు కలిగిఉన్న వాహనాలు కూడా క్షేత్ర పరిధిలోకి అనుమతించబడవని పేర్కొన్నారు. శ్రీశైల క్షేత్ర పరిధిలో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ అన్యమత ప్రచారాలకు, అన్యమత కార్యక్రమాలకు సహకరించడం కూడా చట్టం ప్రకారం శిక్షార్హమే అని అన్నారు. కనుక ప్రతి ఒక్కరూ ఈ నిబంధనలు పాటించాలని సూచించారు. అయితే నిబంధనలు ఉల్లంఘించిన విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై చట్టం ప్రకారం తగు చర్యలు తీసుకొనబడతాయని ఈఓ హెచ్చరించారు.

## 47 డ్రోన్లను కూల్చివేశాం: ఉక్రెయిన్

**న్యూఢిల్లీ,డిసెంబర్ 23 (వెలుతురు):**

ఉక్రెయిన్ వైమానిక దళం కీలక ప్రకటన చేసింది. దేశవ్యాప్తంగా రష్యా ప్రయోగించిన 72 డ్రోన్లలో.. 47 డ్రోన్లను కూల్చివేసినట్లు ఉక్రెయిన్ ప్రకటించింది. టెలిగ్రామ్‌లో దీనిపై ఆ దేశ సైన్యం ప్రకటన చేసింది. తమ మిలిటరీ తొమ్మిది ప్రదేశాల్లో దాడుల్ని తిప్పికొట్టిందన్నారు. కీవ్ ప్రాంతంలో అనేక ప్రైవేటు ప్రదేశాలు, ఇండ్లు ధ్వంసమైనట్లు ఉక్రెయిన్ వైమానిక దళం పేర్కొన్నది. కెమిలిన్‌స్టికి ప్రాంతంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. విద్యుత్తు లైన్ దెబ్బతిన్నట్లు స్థానికులు చెబుతున్నారు. 25 డ్రోన్లు లక్ష్యాన్ని చేరుకోలేకపోయాయని ఉక్రెయిన్ తెలిపింది.

## అంగరంగవైభవంగా పివి సింధి పెళ్లి

- ఉదయపూర్ వేదికగా ఒక్కటైన జంట
- నేడు హైదరాబాద్‌లో వివాహ విందు



**హైదరాబాద్,డిసెంబర్23(వెలుతురు):**

భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. హైదరాబాద్‌కు చెందిన 29 ఏళ్ల వెంకట దత్త సాయితో సింధు వివాహం ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. రాజస్థాన్ ఉదయ్‌పూర్ వేదికగా జరిగిన ఈ వివాహ వేడుకకు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు, పలువురు ప్రముఖులు హాజరై కొత్త జంటను ఆశీర్వదించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. ఇవి చూసిన అభిమానులు సింధు జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మంగళవారం హైదరాబాద్‌లో గ్రాండ్‌గా రిసెప్షన్ ఏర్పాటు చేశారు. కాగా, సింధు పెళ్లి చేసుకున్న వెంకట దత్త సాయి.. పోసిడెక్స్ టెక్నాలజీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈ విషయాన్ని ఆమె తండ్రి పీవీ రమణ స్వయంగా వెల్లడించిన విషయం తెలిసిందే. ఇక ఈనెల 14న వీరిద్దరి ఎంగేజ్మెంట్ కూడా ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పీవీ సింధు, వెంకట దత్తసాయి రింగ్స్ మార్చుకున్నారు. ఎంగేజ్‌మెంట్ ఫొటోను సింధు ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో షేర్ చేస్తూ? 'ఒకరి ప్రేమనకు దక్కిన సమయంలో.. తిరిగి మనం ప్రేమించాలి' అని క్యాప్షన్ ఇచ్చింది. ఆదివారం రాత్రి 11.20 గంటలకు రాజస్థాన్‌లోని ఉదయ్ సాగర్ లేక్‌లోని సుందరమైన రాఫెల్స్ హోటల్‌లో మూడుముళ్ల బంధంతో ఈ జంట ఒక్కటయ్యారు. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు, పలువురు ప్రముఖుల నడుమ వీరి పెళ్లి వేడుక జరిగింది. ఈ పెళ్ళికి కేంద్రసాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ హాజరయ్యారు. ఆయన నూతన వధూవరులను నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని దీవించారు. అందుకు సంబంధించిన ఫొటోను సోషల్ మీడియాలో పంచుకున్నారు.

## విజయసాయి దోపిడి అంతాఇంతా కాదు

- మాజీమంత్రి సోమిరెడ్డి విమర్శలు



**అమరావతి,డిసెంబర్23(వెలుతురు):**

వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి దోపిడీ ముఠా చేయని కుంభకోణం లేదని తెదేపా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించారు. విజయసాయి వియ్యంకుడికి ఆదాయం కోసం ప్రజలపై ట్రూఅప్ ఛార్జీలు వేశారన్నారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జెన్‌కోకు విజయసాయి అనుబంధ సంస్థ బొగ్గు అమ్మిందని ఆరోపించారు. 4.5 లక్షల టన్నుల నాసిరకం బొగ్గును.. టన్ను రూ.8,500లకు విక్రయించిందన్నారు. అధిక ధరకు కొని ప్రజలపై విద్యుత్ భారం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ట్రైడెంట్ నాలెడ్జ్ కంపెనీ నాసిరకం బొగ్గు సరఫరాపై శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని.. దీనిపై సీఐడీ, విజిలెన్స్ ఎందుకు చర్యలకు ఉపక్రమించట్లేదని ప్రశ్నించారు. విజయసాయి దొంగల ముఠాపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జగన్ కుంభకోణాలపై చర్యలకు వివిధ శాఖల్లో సిబ్బంది కూడా సరిపోవట్లేదని వ్యాఖ్యానించారు. 108, 104 స్కామ్ పైనా సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని సోమిరెడ్డి కోరారు.

## ఫెర్రీ ప్రమాద ఘటనలో సాంకేతిక లోపం

- నేవీకి ముందే విషయం తెలుసా?

**ముంబయి,డిసెంబర్23(వెలుతురు):**

అరేబియా సముద్ర జలాల్లో ఇటీవల పర్యటకుల ఫెర్రీని నౌకాదళానికి చెందిన ఓ స్పీడ్ బోటు ఢీకొట్టిన ఘటనలో 15 మంది మృతి చెందారు. దీనికి సంబంధించి కీలక విషయాలు వెల్లడయ్యాయి. స్టీరింగ్‌లో సాంకేతికలోపం తలెత్తడం, వేగాన్ని నియంత్రించే త్రోటల్ క్వాడ్రంట్ కూడా సరిగా పని చేయకపోవడమే ఈ ప్రమాదానికి కారణమంటూ నౌకాదళ వర్గాలు మీడియాకు వెల్లడించాయి. ఈ లోపాల గురించి క్రూ సిబ్బందికి ముందే అవగాహన ఉందని సమాచారం.గత వారం ముంబయి తీరం సమీపంలోని ప్రసిద్ధ ఎలిఫెంటా దీవిని సందర్శించేందుకు వెళ్తున్న పర్యటకుల ఫెర్రీని ఇంజిన్ ట్రయల్స్‌లో భాగంగా అతివేగంతో వెళ్లిన బోట్ ఢీకొనడం వల్ల ఈ ప్రమాదం జరిగింది. అప్పుడు ఫెర్రీలో 113 మంది ప్రయాణికులు ఉన్నారు. వారిలో 98 మందిని రక్షించారు. నిబంధనల ప్రకారం.. అందులో 84 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది మాత్రమే ఎక్కాల్సిఉంది. ఈ ఘటనపై మహారాష్ట్ర మారిటైమ్ బోర్డ్ దర్యాప్తు చేపడుతోంది. ఫెర్రీ లైసెన్స్ రద్దు చేసింది. అలాగే కొలాబా పోలీస్‌స్టేషన్ పరిధిలో నేవీ బోట్ డ్రైవర్‌పై కేసు నమోదైంది.

## ప్రేమజంటను రప్పించి పెళ్లి చేస్తామని ఫోన్

- అర్ధరాత్రి వేళ యువకుడి దారుణ హత్య

**హైదరాబాద్,డిసెంబర్23(వెలుతురు):**

పారిపోయిన ప్రేమజంటను ఇంటికి రప్పించి అనంతరం యువకుడిని గుర్తు తెలియని యువకులు కత్తులతో పొడిచ చంపారు. ఈ సంఘటన హైదరాబాద్‌లోని బోయిన్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ బోయిన్‌పల్లి లోపి అలీ కాంప్లెక్స్‌లో మహమ్మద్ సమీర్(25) వెల్డింగ్ పనులు జీవనం సాగిస్తున్నారు. గత సంవత్సరం నాచారంలోని ఓ భవనానికి వెల్డింగ్ పనుగులు చేయడానికి వెళ్లాడు. భవనం యజమాని కూతురుతో సమీర్ ప్రేమలో పడ్డాడు. గతంలో ఇద్దరు కలిసి అస్సాంకు పారిపోయి ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇద్దరికి ప్రేమ పెళ్లి చేస్తామని యువతి కుటుంబ సభ్యులు చెప్పడంతో హైదరాబాద్‌కు వచ్చారు. అమ్మాయిని తీసుకెళ్లి మరో వ్యక్తితో నిశ్చితార్థం చేయడంతో సమీర్ అడ్డుపడినట్లు సమాచారం. డిసెంబర్ 21న అర్ధరాత్రి సమీర్ ఇంటి బయట కూర్చున్నాడు. కొందరు దుండగులు బైక్‌లపై వచ్చి కత్తులతో సమీర్‌పై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అడ్డుకోవడానికి ప్రయత్నించిడంతో వారిపై కూడా దాడి చేశారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువతి కుటుంబ సభ్యులు పరారీలో ఉండడంతో వారిపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని పోలీసులు ప్రశ్నిస్తున్నారు.



Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com